9-4Pg1exHMNWJQE 1 VJA_9-4Pg1exHMNWJQE.qxd 09/Apr/26 12:03 AM Page 1

epaper.vaartha.com WWW.VAARTHA.COM

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

: fb.com/vaartha Digital విజయవాడ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

9-4-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 68 పేజీలు: 12 వెల: 6.50



## భారీగా పడిపోయిన ముడిచమురు ధరలు

26 డాలర్లు తగ్గిన బ్యారెల్ ధర

91డాలర్లకు చేరిక



## దలాల్ స్ట్రీట్‌లో పండుగ

సెన్సెక్స్ 2,946 పాయింట్లు లాభం

నిఫ్టీ 890 పాయింట్లు వృద్ధి

హోర్ముజ్ జలసంధి తెరిచేందుకు ఇరాన్ గ్రీన్‌సిగ్నల్

మధ్యప్రాచ్యంలో స్వర్ణయుగం రాబోతోంది: ట్రంప్

సీజ్ ఫైర్‌ను స్వాగతించిన భారత్

పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి తొలి అడుగు అని వ్యాఖ్య..



# శాంతిమంత్రం

## అమెరికా- ఇరాన్ మధ్య రెండు వారాలు కాల్పుల విరమణ

అమెరికా, ఇరాన్‌ల మధ్య 40వ రోజుకు చేరిన యుద్ధ జ్వాలలు ఎట్టకేలకు చల్లారాయి. ఇరాన్‌పై జరిపే భారీ సైనిక దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గి, రెండు వారాల షరతులతో కూడిన కాల్పుల విరమణను ప్రకటించారు. ఈ నిర్ణయానికి, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికీ మార్గం సుగమమైంది. ఈ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా ఉపశమనాన్ని కలిగించింది.

వివరాలు లోపలి పేజీల్లో...



ఇస్లామాబాద్ వేదికగా

## రేపు చర్చలు

పక్షం రోజులు కొనసాగే అవకాశం

జెడి వాన్స్ నేతృత్వంలో అమెరికా బృందం

ఇరాన్ తరపున బాఘీర్ బృందం చర్చలకు రెడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** పశ్చిమాసియాలో దాదాపు 40 రోజులుగా సాగిన యుద్ధానికి తెరదించుతూ ఇరాన్ అమెరికా మధ్య తాజాగా కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు విధించిన డెడ్‌లైన్‌ను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాలపాటు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. దాంతోపాటు ఇరాన్‌పై దాడులు నిలిపివేస్తున్నట్లు ప్రక టించారు. ఈ మేరకు ఇరాన్ పంపిన 10 పాయింట్ల ప్రతిపాదనకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అటు ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణ ఒప్పందానికి ఓకే >>2

## రెపోరేట్లు యధాతథం

పశ్చిమాసియా ఉద్రిక్తతలే కారణం

5.25 శాతం వద్దనే రెపోరేట్ల స్థిరీకరణ



## రూ.కోటి విరాళమిస్తే..



యేడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

**తిరుమల, ఏప్రిల్ 8 ప్రభాతవార్తప్రతినిధి:** సంపన్నవంతులైన భక్తులు దాతలుగా మారితే వారికి ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం మరిన్ని వెసలుబాటు కల్పించింది. టిటిడికి కోటి రూపాయలు విరాళాలిచ్చే దాతలకు, ఆపై భారీ మొత్తంలో భూరీగా విరాళాలిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు మరో నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, మూడురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆదేవదేవుని దర్శనం చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ ప్రయోజనాలతో బాటు ఒకసారి10పెద్ద లడ్డూలు, 20చిన్న లడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 >>2



సౌత్ ఏషియా సదస్సులో మంత్రి కందుల దుర్గేష్, అధికార బృందం

## క్రియేటివ్ ఎకానమీ హబ్‌గా 'అమరావతి'

అమరావతి, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను కలుపుతూ స్టోరీటెల్లింగ్ కారిడార్' : మంత్రి దుర్గేష్

**విజయవాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక, సృజనాత్మక ఆర్థిక కేంద్రం (క్రియేటివ్ ఎకానమీ హబ్)గా తీర్చిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ముంబైలో నిర్వహిం చిన 21వ హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్ సౌత్ ఏషియాకు మంత్రి దుర్గేష్ హాజర య్యారు. ఈ >>2



## అమరావతి అవినీతి గని

వచ్చే యేడాది పాదయాత్ర ప్రారంభించి చంద్రబాబు మోసాలు ప్రజలకు వివరిస్తా: మాజీ సిఎం జగన్

**విజయవాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి పేరుతో భారీ అవినీతి, దోపిడీ జరుగుతోందని మాజీ సీఎం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. ఆయన తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ అందుకే >>2

# ఆర్థిక దన్నుగా రోడ్లు



రహదారుల అనుసంధానం ఆర్థిక కార్యాచరణ

పోర్టు కారిడార్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

ఇవి బస్సుల వినియోగం పెంచేలా చర్యలు

రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఉన్నత సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్‌చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహ దారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం, వివిధ రాష్ట్రాలను అనుసంధానించేలా జాతీయ రహదారి ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షలో చర్చించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటి ష్టంగా ఉండాలి. >>2

## ఇనాం భూములకు కొత్త చట్టం

2027 మార్చి నాటికి 1.12 కోట్ల పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి

2లో

1.37 లక్షల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ నిర్ణయం

రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

## సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి డిపిఆర్ సిద్ధం

రూ.2,534 కోట్లతో ప్రాజెక్టు రూపకల్పన

కేంద్ర కేబినెట్ ఆమోదానికి ప్రతిపాదనలు

**విజయవాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రాజెక్టును మంజూరు చేసింది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. రూ.2,534 కోట్లతో చేపట్టనున్న నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్‌ను కేంద్ర కేబినెట్ ఆమోదానికి సిపిడబ్ల్యూడి పంపింది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1299.08 కోట్లతో ప్రాజెక్టు డిపిఆర్ తయారైంది. కేంద్ర ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ.1234.91 కోట్లతో ప్రాజెక్టును ప్రభుత్వం రూపకల్పన చేసింది.కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువు దీరనున్నాయి. అమరావతి కేంద్రంగా పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం బహుళ అంతస్తుల భవనాల నిర్మించాలని నిర్ణయించింది. కేంద్ర గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికేఆమోదం తెలిపారు. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సిఆర్‌డిఏ 22.53 ఎకరాలను కేటాయించింది. అందులో 5.53ఎకరాల్లో సెక్రటేరియట్, 17ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం జరగనుంది.ప్రాజెక్టుపైఎప్పటికప్పుడు అధికారులతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సంప్రదింపులు చేశారు. మరోవైపు పదెకరాల్లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామని హడ్కో వెల్లడించింది.

## మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి



హోంగార్డుల పరస్పర బదలీలు చేపట్టండి

సిఎం చంద్రబాబుకు బిజెపి చీఫ్ మాధవ్ వినతి

**విజయవాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షుడు పివియన్ మాధవ్ కలసి మత్స్యకారులు, హోంగార్డుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. నెల్లూరు, ఒంగోలు, బాపట్ల తీర ప్రాంతాల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు అక్రమంగా ప్రవేశించి స్థానిక మత్స్యకారులకు తీవ్ర ఇబ్బందులు >>2

## విద్యార్థులే దేశ భవిష్యత్

సమాజంకోసం ఆలోచించండి, పనిచేయండి

ఎయు శతాబ్ది ఉత్సవాల్లో డి.సిఎం పవన్ కల్యాణ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విద్యార్థులు కేవలం విశ్వవిద్యాలయ విద్యార్థులు మాత్రమే కాదు, దేశ భవిష్యత్ కూడా అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్‌లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సి.ఆర్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సి.వి రామన్ వంటి వ్యక్తులు ఇక్కడ తమ మేధస్సుతో విశ్వవిద్యాలయాన్ని నడిపించారు అని అటువంటి వ్యక్తులకు జేజేలు కొట్టాలి విద్యార్థులకు సూచించారు. సమాజాన్ని ముందుకు నడిపించే వ్యవస్థను మహనీయులు ఇక్కడ ప్రతిష్టించారు అని తెలిపారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు అంతా ఈ విశ్వవిద్యాలయం భవిష్యత్తు, ఇక్కడ గడిపేసమయం మీ జీవితంలో అత్యంత ముఖ్యమైన సమయం అని చెప్పారు సమయం. ఇది మీ దిశను నిర్ణయించే సమయం అని సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, సమాజానికి ఉపయోగపడే బాధ్యత విద్య అందిస్తుంద >>2



9-4pg2exHMNWJQE 2_9-4pg2exHMNWJQE.qxd 09/Apr/26 12:07 AM Page 1





బుధవారం రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

# ఆర్థిక దన్నుగా రోడ్లు

>> మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే, వాటిల్లో ఏటా 10,238 కిలోమీటర్ల మేర నిరంతర నిర్వ హణ చేయాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలి. రోడ్ల నిర్వహణ అనేది నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే, వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవు. రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్ధతులను అవలం బిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఆర్ అండ్ బి రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల కొరత లేకుండా చూడాలి. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలి. రహదారి నిర్వహణకు ప్రామా ణికతను నిర్దేశించాలి. స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతా వరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట హైబ్రీడ్ మోడల్ లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుంది. కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనేది ఆలోచన చేయాలి. దీనిపై యూనివర్శిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టండి. గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మత్తులు చేపట్టాలి. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధిలో చేపట్టే రోడ్ల అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్‌గా నిలిచేలా పనులు చేపట్టాలి. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలి. దీని కోసం సాస్కి నిధులను వినియోగించుకోవాలి. కుంభమేళా తరహాలో పుష్కరాలకు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలి' అని సిఎం సూచించారు. 'రాష్ట్రంలోని పోర్టులను కనెక్ట్ చేసేలా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు ఉన్నాయి. పోర్టులను కనెక్ట్ చేసేలా పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ అలానే ఉంది. తూర్పు భారతంలో తీర ప్రాంతం, పోర్టుల విషయంలో ఏపీ కీలకంగా ఉంది. ఈస్ట్ వెస్ట్ కారిడార్ గా జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఈ రకమైన కనెక్టివిటీని పెంచడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయం గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి. లాజిస్టిక్స్ రం గాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేసేలా పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టాలి. దీని నిమిత్తం ఏపీ లింక్ ద్వారా ఆర్థిక వనరుల్ని సమకూరేలా ప్రణా ళికలు సిద్ధం చేయాలి. మౌలిక సదుపాయాల ద్వారా సామాన్యుడికి సౌకర్యాలు పెరగాలి, ఇదే సమయంలో ఆర్థిక లావాదేవీలు జరగాలి. ప్రభుత్వం ప్రజాధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చు చేస్తోంది. ప్రతి పైసా సద్వినియోగం కావాలి. అత్యుత్తమ ఫలితాలు రావాలి. ప్రస్తుతం 73 శాతం కార్గో రోడ్ రవాణ ద్వారానే వెళ్తోంది. రైల్వే ద్వారా వెళ్లే కార్గో వ్యయం తక్కువగా ఉన్నట్టే రహదారుల కార్గో వ్యయం కూడా తగ్గాల్సిన అవసరం ఉంది. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టుల మధ్యనున్న ప్రాంతాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఆయా పోర్టులను అనుసంధానం చేసే సమయంలో ఆయా పోర్టులకు సమీపంలోని పొరుగు రాష్ట్రాల సరిహద్దులను కలుపుకుని వెళ్లేలా ప్రధాన రహదారులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఉండాలి. రహదారుల నిర్మాణం వల్ల ఎకనామిక్ యాక్టివిటీ పెరగాలి. జాతీయ రహదారులకు సమీపంలో ఉండే ప్రాంతాల అభివృద్ధి జరగాలి. జాతీయ రహదారులతో పాటు దేశ నిర్మాణం జరగాలి. ఎపి పారిశ్రామిక, ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా మారుతోంది. జాతీయ అంతర్జాతీయ మార్కెట్లకు కనెక్టు చేసేలా రహదారులు రావాలి. వివిధ నగరాలకు రింగ్ రోడ్లు వస్తే ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం అవుతాయి. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీని కనెక్టు చేసేలా రహదారుల నిర్మాణం జరగాలి. ఖరగ్ పూర్ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్‌శ్రీశైలం దోర్నాల హైవే, కల్వకుర్తి నంద్యాల హైవే వంటి జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. వివిధ కారిడార్ల ద్వారా 1335 కిలోమీటర్ల జాతీయరహదారుల రెండేళ్లలో అందుబాటులోకివస్తాయి. ఈ ఏడాదిలో రూ. 24,502కోట్ల విలువైన ప్రాజెక్టులుపూర్తి కావాలి. రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల్లో అవుటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబుఅధికారులకు దిశానిర్దేశం చేశారు.

**ఇవిలతో తక్కువ రవాణా వ్యయం:** "అతి తక్కువ వ్యయంతో ప్రజా రవాణా అందుబాటులోకి రావాలి. దీనికి ఈవీ బస్సుల వినియోగం సరైన మార్గం. క్లీన్ ఫ్యూయెల్ వినియోగం ఎక్కువ జరిగితే ఖర్చు తగ్గుతుంది. ఫలితాలు ప్రజలకు అందుతాయి. సోలార్ పవర్ ను సమర్థంగా నిర్వహించడం ద్వారా విద్యుత్ కొనుగోలు ధరను సుమారు రూ.1 మేర తగ్గించ గలిగాం. కాస్ట్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ఫ్యూయల్ విధానంపై దృష్టి సారిస్తే తక్కువ ఖర్చు.. ఎక్కువ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈవీ బస్సులకు కిలోమీటరుకు రూ.72 వ్యయం అవుతోంది. వివిధ మోడళ్లను అధ్యయనం చేసి అతి తక్కువ వ్యయంతో ఈవీలను ఆపరేట్ చేయాలి. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ లాంటి అంశాలను పరిశీలించాలి. అన్నీ కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులే ఉండాలి. ఈ సైకిళ్ల వినియోగం మరింతగా పెంచేలా ప్రమోట్ చేయాలి. ఈసైకిళ్లు మాస్ ట్రాన్ పోర్టుగా మారేంతగా ప్రజలకు అవగాహన కల్పించాలి" అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు బిసి జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసి ఎండి బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# క్రియేటివ్ ఎకానమీ హబ్‌గా 'అమరావతి'

>> ఎపి పర్యాటక రంగంలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పులను ఆయన వివరించారు. మంత్రి దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందం కంటెంట్, సంస్కృతి, జీవనశైలి, ఇమ్మర్సివ్ డిజైన్‌ను పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో విలీనం చేయడంపై సృజనాత్మక, అనుభవ ఆర్థిక వ్యవస్థకు చెందిన పలువురు వాటాదారులు అయిన జేఎస్ డబ్ల్యూ స్పోర్ట్స్, ఆర్ ఎంజెడ్, అర్వాస్, తమరా లీజర్ ఎక్స్‌పీరియన్సెస్, షాలెట్ హోటల్స్, హవాస్ మీడియా సంస్థల ప్రతినిధులతో కీలక చర్చలు జరిపింది. పర్యాటక రంగాన్ని ఎపి పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, క్రియేటివ్ ఎకనామీ హబ్‌గా మార్చడమే తమ ప్రాధాన్యత అని మంత్రి దుర్గేష్ వారికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అమరావతిని కేవలం ఒక నగరంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయి 'క్రియేటివ్ ఎకానమీ హబ్'గా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నామన్నారు. కేవలం సందర్శనకే పరిమితం కాకుండా సందర్శకులకు సరికొత్త అనుభూతిని పంచే 'ఎక్స్ పీరియన్స్ ఎకానమీ' వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈరోస్ ఇంటర్నేషనల్, రెడ్ బుల్ వంటి దిగ్గజ సంస్థలతో కలిసి పని చేయడం ద్వారా రాష్ట్రంలోని అమరావతి, విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాలను కలుపుతూ ఒక భారీ 'స్టోరీటెల్లింగ్ కారిడార్'ను అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ ప్రకటించారు. ఎపి ఆధ్యాత్మికతను, సంస్కృతిని డిజిటల్ మాధ్యమాల్లో అంతర్జాతీయ పర్యాటకులకు పరిచయం చేయడానికి, భవిష్యత్ తరాలకు అందించేందుకు హోలోగ్రాఫిక్ స్టోరీటెల్లింగ్, ఇమ్మర్సివ్ కల్చరల్ నెరేటివ్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఉపయోగిస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. రెడ్ బుల్ భాగస్వామ్యంతో క్రీడాకారుల జీవనశైలి, గమ్యస్థానాల ఆధారిత కథనాలను రూపొందించి ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ వేదికపై నిలబెడతామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా ఈరోస్ ఇంటర్నేషనల్ సంస్థతో కీలక చర్చలు జరిపిన మంత్రి దుర్గేష్ నెలరోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమక్షంలో అవగాహన ఒప్పందం చేసుకుంటామని హామీ ఇచ్చారు. సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి విశేష ప్రాధాన్యతనిస్తుందని, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పనతో పాటు నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు ప్రోత్సాహకాలు కల్పిస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం ఇప్పుడు సంప్రదాయ పద్ధతుల నుండి బయటపడి గ్లోబల్ కంటెంట్ ప్లాట్‌ఫారమ్‌గా ఎదగడానికి సిద్ధంగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు, సాంస్కృతిక కథనాలకు ఇమ్మర్సివ్ టూరిజం అనుభవాలకు ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. తద్వారా యువతకు ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధితో పాటు అంతర్జాతీయ గుర్తింపును సాధించడమే తమ లక్ష్యమని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ క్రియేటివ్ ఎకానమీ విభాగపు లీడ్ సత్య ప్రభ, సీనియర్ కన్సల్టెంట్ సాహితీ దివి పాల్గొన్నారు.

# రూ.కోటి విరాళమిస్తే..

>> మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. తిరుమలలో 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండి డాలర్‌ను తగిన ఆధారాల్ని కార్యాలయంలో చూపి పొందవచ్చు.

**మదినిండా ఏడుకొండలస్వామి దర్శనం:** ఒక్కసారి గోవింద.. గోవిందా... అంటూ మనస్ఫూర్తిగా ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని మదిలో తలచుకుని మొక్కుకుంటే తమ కష్టాలు తీరి పోతాయని హిందూ భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనందనిలయంలో కొలువైన వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్ళీ మళ్ళీ ఆ దివ్యమంగళరూపాన్ని చూడాలనే తాపత్రయం భక్తులకు కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన, కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం బహుళప్రయోజనాలు చేకూరుస్తోంది. గతంలో కోటి రూపాయలు, 1.50కోట్ల రూపాయలు దాతలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరుమందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారూ జామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్ర దీపాలంకారసేవ వరకు)ఆలయంలోపల కులశేఖరపడి వద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్ళి తనివితీరా దర్శనం చేసుకునే వెసలు బాటు కల్పించింది. అంతేగాక ఆ భక్తులకు సుప్రభాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్ళే ప్రయోజనం ఉండేది. ఆ విరాళాల్లో కొంత మార్పుచేసి కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలకు ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, వసతి, ప్రసాదాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే వెసలుబాటు కల్పించారు.

**రూ.కోటి విరాళాలివ్వాల్సిన పథకాలు:** దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదాన ట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్‌విబిసి ట్రస్ట్, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌లకు దాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిటిదేవస్థానమ్స్. ఎపి.జివొవి. ఇన్" లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి, చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్) అందజేయవచ్చు.

# అమరావతి అవినీతి గని

>>ప్రత్యామ్నాయంగా మావిగన్ ప్రణాళికను ప్రతిపాదించామని తెలిపారు. వచ్చే ఏడాది పాదయాత్ర చేపట్టి ప్రజల మధ్యకి వెళ్తానని జగన్ ప్రకటించారు. పాదయాత్ర ప్రారంభమైన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రతిరోజూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచుతారని చెప్పారు. ప్రజల సమస్యలపై తమ పార్టీ గట్టిగా పోరాటం చేస్తోందని, ఆవిషయంలో గర్వంగా ఉందని పేర్కొన్నారు. రాజధాని విషయంలో తమ ప్రభుత్వం ఆచరణాత్మక పరిష్కారాన్ని చూపించిందని జగన్ తెలిపారు. విశాఖపట్నాన్ని కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా ప్రతిపాదించామని గుర్తుచేశారు. అంతేకాకుండా ప్లాన్ బిగా మచిలీపట్నం- విజయవాడ- గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల గ్రోత్ కారిడార్‌గా మావిగన్ ప్రాజెక్టును సూచించామని చెప్పారు. అమరావతిలో ఒక ఎకరాకు కనీస సదుపాయాలకే రూ.2 కోట్లు ఖర్చవుతుందని, మొత్తం ప్రాజెక్టుకు లక్షల కోట్లు అవసరమవుతాయని జగన్ అన్నారు. అదే మొత్తంలో 10శాతం పెట్టుబడితోనే అభివృద్ధి సాధ్యమని మావిగన్ ద్వారా వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అయితే ఈ ప్రణాళికను తిరస్కరించడం వెనుక అవినీతి ప్రయోజనాలే కారణమని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి పేరుతో కాంట్రాక్టులు ఇచ్చి కమీషన్లు దండుకుంటున్నారని జగన్ విమర్శించారు. రాష్ట్రంలో మహిళల భద్రత దారుణంగా పడిపోయిందని, వివిధ ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఒక రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ కాలంలో తీసుకున్న అప్పుల్లో పెద్ద భాగం నేరుగా ప్రజల ఖాతాల్లో డిబిటి ద్వారా ఇచ్చామని, ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్నఅప్పులు ఎక్కడికి వెళ్తున్నాయో స్పష్టత లేదని ప్రశ్నించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమం వంటి అన్ని రంగాల్లోనూ పరిస్థితి దిగజారిందని జగన్ పేర్కొన్నారు. రైతులకు మద్దతు ధరలు లేవని, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ వంటి పథకాలు కూడా నిర్వీర్యమయ్యాయని, ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. మొత్తంగా రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని, ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందని జగన్ తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ తామెంటో చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ.2.73 లక్షల కోట్లు) నేరుగా డిబిటి ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ.3.52 లక్షల కోట్ల అప్పు చేశారని, ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

# విద్యార్థులే దేశ భవిష్యత్

>> న్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్న నెల్సన్ మండేలా మాటలను గుర్తుచేశారు. ఏయూ జ్ఞానదీపంగా ప్రకాశిస్తూ నిలవాలి ప్రతీ రంగంలో నాయకులుగా ఏయూ విద్యార్థులు ఎదగాలని, విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. ఏయూ ప్రాంగణం ఒక క్యాంపస్ మాత్రమే కాదు, విలువలతో దేశ నిర్మాణంలో సైతం ముఖ్య భూమిక పోషించిందని, శతాబ్ది కాలాన్ని పూర్తిచేసుకున్న భారతీయ వారసత్వ సంపదకు నిదర్శనంగా నేడు ఏయు నిలిచిందన్నారు. మీ ప్రేమ అభిమానం కోరుకుంటే వచ్చేవి కావు అని యువతరం మనసుల్లో అనేక ప్రశ్నలు ఉంటాయి విద్యార్థుల ప్రశ్నలు ఎంతో స్వచ్ఛంగా గుండె లోతుల్లోంచి వారు ప్రశ్నలు సంధిస్తారు అని చెప్పారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడాలంటే ఒక పెద్ద సాహసంగా నేను భావిస్తాను. పుస్తకాలతో కుస్తీపట్టే మీతో మాట్లాడాలంటే చాలా ఆలోచించాలి అన్నారు. విద్యార్థుల దగ్గర నటిస్తే కుదరదు, అందుకే నేను మనసునే ఉపయోగిస్తాను అంటూ విద్యార్థులతో తన అనుభవాలను తెలిపారు. భగవంతుడు నాకు ఇక్కడ చదువుకునే అవకాశం ఇవ్వలేదు కానీ మిమ్మల్ని ఈ విధంగా కలిసే అవకాశం మాత్రం ఇచ్చారు అని తెలిపారు. తన స్నేహితుడు ఏయూ పూర్వ విద్యార్థి త్రివిక్రమ్ శ్రీనివాస్ ఇక్కడే ఎమ్మెస్సీ న్యూక్లియర్ ఫిజిక్స్ చదివి ఇక్కడ ఆచార్యులు ఎంత గొప్పవారు అనే విషయాలు ఆయన నుంచి తెలుసుకున్నాను అని అన్నారు. జీవితం మీ ఉత్సాహంలో, కేరింతల్లో ఉంటుందని విద్యార్థులనుద్దేశించి అన్నారు. విశ్వవిద్యాలయాలు, మనమంతా పనిచేసేది భావితరాలకోసమేనన్నారు. శతాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలను విద్యార్థులకు అందజేశారు. శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. గడచిన 11 నెలలుగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. టెక్నికల్, కల్చరల్, అవుట్‌రీచ్ విభాగాలు నిర్వహించిన కార్యక్రమాలను తెలియజేశారు. ప్రధానంగా అవుట్‌రీచ్‌లో భాగంగా గ్రామీన ప్రాంతాలలో విద్యార్థులను ఉన్నత విద్య దిశగా నడిపించే విధంగా స్ఫూర్తిని నింపే కార్యక్రమాలను పాడేడు, పార్వతీపురం ప్రాంతాలలో నిర్వహించామన్నారు. కల్చరల్ ఫెస్టివల్ చైర్మన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్ మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వం ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ సొంతమన్నారు. ఆయనతో ఇటీవల కలిసిన సందర్భం గుర్తుచేసుకుంటూ, ఉపముఖ్యమంత్రి వ్యక్తిత్వాన్ని విద్యార్థులకు వివరించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వచ్చిన ఉపముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఫెస్ట్ కో చైర్మన్ ఆచార్య ఏ.పల్లవి, కన్వీనర్లు ఆచార్య ఎన్.ఎం యుగంధర్, సి.హెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు, శాసన సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు, విజయ్ కుమార్, విఎంఆర్‌డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.** కార్యక్రమంలో భాగంగా ముందుగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సాయంత్రం నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు ప్రాంగణానికి చేరుకున్నారు. వారి అభిమానం, వెలకట్టలేని ప్రేమాభిమానాలు కనిపించాయి. వేదికపై ప్రదర్శించిన వివిధ గీతాలకు విద్యార్థినులు నృత్యాలు చేస్తూ కనిపించారు. సాయంత్రం నుంచి వాతావరణం కూడా చల్లబడింది. దీనితో ఆహ్లాదకర వాతావరణంలో ఫెస్ట్ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణం యువత కేరింతలలో హోరెత్తింది.



బుధవారం విశాఖ ఎయులో జరిగిన సాంస్కృతిక కళాకారులతో డి.సిఎం పవన్

# ఇనాం భూమలుకు కొత్త చట్టం

**విజయవాడ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2027 మార్చి నాటికి రీ సర్వే 2.0 పూర్తి చేసి 1.12 కోట్ల కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా భూ వివాదాలు సృష్టించింది. వీటిని పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టిన ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రీ సర్వే 2.0లో భాగంగా ఇప్పటికి 6,976 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా... వీటితో 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోంది. సర్వే పూర్తయిన మిగిలిన 1,259 గ్రామాలకు సంబంధించి 9 లక్షల పాసు పుస్తకాలను ఈ ఏడాది జూలై నాటికి పంపిణీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే వచ్చే ఏడాది మార్చి నాటికి రీ సర్వేతో పాటు పాసు పుస్తకాల పంపిణీ 100 శాతం పూర్తి కావాలని ఆదేశించారు. దీని కోసం నెలవారీ లక్ష్యాలను సిద్ధం చేసుకుని కార్యాచరణ అమలు చేయాలన్నారు. జూలై తరువాత మార్చి లోపు 80 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరగాలని తేల్చి చెప్పారు. తప్పులకు ఆస్కారం లేకుండా పాసు పుస్తకాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు.

**1.37 లక్షల ఎకరాల భూములకు విముక్తి..**

సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇతర సర్వీస్ ఇనాం లోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించనున్నారు. దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని సీఎం ఆదేశించారు. 2019లో సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి నాడు ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ... తరువాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్డినెన్స్ మరుగున పడింది. దురుద్దేశంతో గత ప్రభుత్వం దీనిని చట్టంగా మార్చకుండా లక్షల కుటుంబాలకు నష్టం చేకూర్చింది. అయితే ప్రజా ప్రభుత్వం వీరికి న్యాయం చేసేందుకు, సాయంగా నిలిచేందుకు దీనిపై చట్టం చేయాలని నిర్ణయించింది.

**ఇంటి పట్టా ఉంటే రిజిస్ట్రేషన్:** 2016కు ముందు ఏదైనా ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం దాదాపు 75 లక్షల పేద కుటుంబాలకు వరంగా మారనుంది. 2016 ముందు పట్టా కలిగిన యజమాని... నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, విక్రయించేందుకు, గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నిర్ణయం లక్షలాది పేదల కుటుంబాలకు ఆస్తిగా మారుతుంది. అలాగే రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ కింద 13.59 లక్షల ఎకరాల భూమి ఉండగా...ఇందులో అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాలపై భూ యజమానులకు త్వరలో పూర్తిగా యాజమాన్య హక్కులు కల్పించనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని, భూ యజమానికి మొబైల్‌కి సాఫ్ట్ కాపీ పంపించాలని సీఎం అన్నారు. ఈ కేవైసీ అనంతరం రికార్డులను బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రపర్చాలని సీఎం చంద్రబాబు సూచించారు. భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి రికార్డ్ లాకింగ్ చేసుకోవచ్చు. దీని కారణంగా ఆయన నాలెడ్జ్ లో లేకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు. ప్రజల భూములకు రికార్డ్ లాకింగ్ రక్షణ కవచంగా ఉంటుంది. సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మితో పాటు ఇతర అధికారులు హాజరయ్యారు.

# మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి

>> కలిగిస్తున్నారని తెలిపారు. స్పీడ్ బోట్లతో వచ్చి మత్స్యసంపదను దోచుకోవడం, స్థానిక మత్స్యకారుల వలలు మరియు పడవలను ధ్వంసం చేయడం, దాడులకు పాల్పడటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో స్థానిక మత్స్యకారుల్లో భయాందోళనలు పెరిగి, శాంతిభద్రతలకు భంగం కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో ఇలాంటి బోట్లను స్థానికులు పట్టుకున్నప్పటికీ, సంబంధిత అధికారుల నుండి కఠిన చర్యలు తీసుకోకుండా వాటిని విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు తీసుకుని, తీరప్రాంత భద్రతను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తరువాత సుమారు 400 మంది హోంగార్డులు తమ స్వగ్రామాలకు దూరంగా పనిచేస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆంధ్రప్రదేశ్- తెలంగాణ మధ్య పరస్పర బదిలీలు చేపట్టాలని కోరారు.

# ఇస్లామాబాద్ వేదికగా రేపు చర్చలు

>> చెప్పింది. ఇక ప్రస్తుతం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్ అమెరికా మధ్య రెండో దశ శాంతి చర్చలు జరుగనున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరదించే దిశగా అడుగులు పడుతున్నాయి. దశాబ్దాల వైరం, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అమెరికా, ఇరాన్ చర్చలకు రావడం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఏప్రిల్ 10న ఇస్లామాబాద్ వేదికగా శాంతి చర్చలు జరుగనున్నాయి. ఈ భేటీ యుద్ధ మేఘాలు కమ్ముకున్న మధ్యప్రాచ్యంలో శాంతి కిరణంలా కనిపిస్తోంది. దశాబ్దాలుగా ఉప్పు నిప్పులా ఉన్న అమెరికా, ఇరాన్ దేశాలు ఇప్పుడు ఒకే టేబుల్‌పై కూర్చుని చర్చలు జరపాలని నిర్ణయించుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక అతిపెద్ద మలుపు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధాన్ని శాశ్వతంగా ముగించడమే లక్ష్యంగా ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. ఇస్లామాబాద్ వేదికగా జరగనున్న ఈ చర్చలు కేవలం రెండు దేశాల మధ్య సంబంధాలకే పరిమితం కాకుండా, మొత్తం గల్ఫ్ ప్రాంతంలో సుస్థిరతను తీసుకువస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖాముఖి చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలనే సంకల్పం యుద్ధం వల్ల నష్టపోతున్న దేశాలకు పెద్ద ఊరట. ఈ చర్చల కోసం అమెరికా తన అత్యంత కీలకమైన అనుభవజ్ఞులైన బృందాన్ని రంగంలోకి దించింది. అమెరికా తరపున ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, స్టీవ్ విట్కాఫ్, గతంలో మధ్యప్రాచ్య శాంతి ఒప్పందాల్లో కీలక పాత్ర పోషించిన జారెడ్ కుష్నర్ పాల్గొంటున్నారు. ఈ చర్చలు ఏప్రిల్ 10న ప్రారంభమై సుమారు రెండు వారాలపాటు కొనసాగే అవకాశం ఉందని సమాచారం. ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యలు సంక్లిష్టమైనవి కావడంతో ప్రతి అంశాన్ని కూలంకషంగా చర్చించి ఒక నిర్ణయానికి రావాలని భావిస్తున్నారు. ఈ 14రోజులు పశ్చిమాసియా భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. ఒక వేళ ఈ చర్చలు సఫలమైతే, అది ఆధునిక చరిత్రలో ఒక అతిపెద్ద దౌత్య విజయంగా నిలిచిపోతుంది. యుద్ధంకారణంగా అతలాకుతలమవుతున్న సాధారణ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ఇస్లామాబాద్ వైపు ఆశగా చూస్తున్నాయి. యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, చమురు ధరలు, రవాణా మార్గాలు దెబ్బతింటున్న తరుణంలో ఈ చర్చలు విజయం అందరికీ అవసరం. ఇస్లామాబాద్‌లో జరిగే ఈ 'శాంతి మంత్రం' ఫలించి, పశ్చిమాసియాలో తుపాకుల మోత ఆగిపోవాలని మానవతావాదులు కోరుకుంటున్నారు. ఈ భేటీ విజయవంతమైతే, అది కేవలం రెండు దేశాల విజయం మాత్రమే కాదు. ప్రపంచ శాంతికి దక్కే గౌరవం అవుతుంది.

## వారం - వర్జ్యం

09-04-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
సప్తమి రా.9.18
మూల ఉ.8.47
వర్జ్యం : ఉ.7.01-ఉ.8.49
దు.ఉ.10.04-ఉ.10.54, 2)మ.3.03-మ.3.53
శుభసమయం : ఉ.9.30-10.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. కోర్టు వ్యవహారాలు సానుకూల పడతాయి.

**వృషభం:** అందరిలోనూ ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. భూములు, స్థలాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగస్తులకు అనుకూలం.

**మిథునం:** జీవిత భాగస్వామితో సఖ్యత చాలా విషయాలను ప్రభావితం చేస్తుంది. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం:** రాజకీయ, పారిశ్రామిక వర్గాల వారికి అన్నివిధాలా ప్రోత్సాహం లభిస్తుంది. స్వల్ప ధనలాభం కలుగుతుంది.

**సింహం:** ఆస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. మానసిక ప్రశాంతత పొందుతారు. సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**కన్య :** వాయిదా పడుతున్న విషయములు పరిష్కారదశకు వస్తాయి. వ్యవహారాలు సాఫీగా పూర్తిచేస్తారు. వాహనసౌఖ్యం.

**తుల :** విద్యా, వైజ్ఞానిక విషయములలో సంతాన విద్యా విషయాలలో కొద్దిపాటి క్రమశిక్షణ అవసరం. బంధువుల కలయిక.

**వృశ్చికం:** నిర్మాణాత్మక సంబంధమైన పనులకు అనుకూల కాలము. భూ వివాదాలు పరిష్కారమవుతాయి. వస్త్రలాభం.

**ధనుస్సు:** కుటుంబ సంబంధిత వ్యవహారాలలో ఇతరుల జోక్యంవలన కొద్దిపాటి భేదాభిప్రాయాలు రావచ్చు. జాగ్రత్త వహించండి.

**మకరం:** జాయింట్ వ్యవహారములు, కాంట్రాక్టులు మొదలైన వాటి సంబంధిత వ్యవహారములను వాయిదా వేయవద్దు.

**కుంభం:** మానసిక ప్రశాంతత, మనోధైర్యం ఏర్పడుతుంది. వ్యాపారాభివృద్ధి మధ్యస్తంగా ఉంటుంది. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** ఉపయుక్తం లేని కబుర్లు, సంభాషణలు కాలహరణానికి కారణమవుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

09-04Pg3exHMNWJQEC 3 OV_09-04Pg3exHMNWJQEC.qxd 08/Apr/26 10:55 PM Page 1



# బెజవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి రూ.170 కోట్లతో భారీ ప్రణాళిక



- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- మూడు దశల్లో స్టేడియం అభివృద్ధి, క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం.
- ఖేలో ఇండియా నిధులతో స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాత వార్త ప్రతినిధి:** రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి నగరం, పట్టణం, గ్రామాల్లో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం అభివృద్ధి పనులకు ఖేలో ఇండియా నిధులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఉభయసభల్లో అమరావతికి చట్టబద్ధత కల్పించిన శుభ సందర్భంలో ఈ కార్యక్రమం జరగడం విశేషమన్నారు. విజయవాడ నగరానికి ఎంతో భావోద్వేగ అనుబంధం కలిగిన ఐజీఎమ్ఎస్ స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. స్టేడియం అభివృద్ధికి మొత్తం సుమారు రూ. 160 నుండి రూ. 170 కోట్ల వరకు మూడు దశల్లో వ్యయం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా రూ. 20 కోట్లు, మిగిలిన నిధులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సమకూరనున్నాయని వెల్లడించారు. గత ప్రభుత్వ ఐదేళ్లలో ఆగిపోయిన క్రీడా అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పుడు వేగం పుంజుకున్నాయని, గుంటూరులో ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని, త్వరలో శ్రీకాకుళంలో కూడా పనులు ప్రారంభమవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుండి రూ.1000 కోట్ల నిధుల ప్రతిపాదనలు ఉన్నాయని, రెండో విడతలో రూ.100 కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని మంత్రి కొనియాడారు. రాబోయే మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను క్రీడా రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (తిశిలి) మ్యాచ్‌లను అమరావతిలో ప్రారంభించి కడపలో ముగించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాటాడుతూ... విజయవాడ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, అమరావతి రాజధానిగా శాశ్వత గుర్తింపు రావడంతో నగరానికి మరింత అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగుపడుతున్నాయని తెలిపారు. స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతిలో 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, అలాగే స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పార్లమెంటు సభ్యులు చెప్పారు. శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ... స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. స్టేడియం అభివృద్ధి కోసం పలుమార్లు సందర్శించి మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఎంపీ సూచనల మేరకు స్టేడియంలో ఒక బ్లాక్‌కు ప్రముఖ మహిళా క్రీడాకారిణి పేరు పెట్టనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం పూర్తిగా రూపురేఖలు మారిపోతాయని, అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, శాసనసభ్యులు గద్దే రామ్మోహన్, జిల్లా కలెక్టర్ డా. జీ. లక్ష్మీశ, నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్ ఎం. ధ్యానచంద్ర,, శాప్ వీసీ అండ్ ఎండీ ఎస్. భరణి, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి కోనేరు హంపి, మార్కోలైన్స్ పేవ్‌మెంట్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ డైరెక్టర్ వెల్లంకి రేవంత్, పాల్గొన్నారు.

## గన్నవరం,అన్నవరం రైలు మార్గంలో రూ.292 కోట్లతో 6 రైల్ ఓవర్ బ్రిడ్జిలు

**రాజంపేట, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** విజయవాడ, విశాఖపట్నం రైల్వే డివిజన్లో కీలక రైల్ ఓవర్ బ్రిడ్జి (ఆర్ ఓబి) నిర్మాణాలు చేపట్టేందుకు దక్షిణ మధ్య రైల్వే 292 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచింది. ఈ మేరకు బుధవారం దక్షిణ మధ్య రైల్వే నిర్మాణం విభాగం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గన్నవరం ,అన్నవరం, పిఠాపురం మీదుగా రైలు మార్గంలో కీలక రైల్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలన్నారు. విజయవాడ గుడివాడ రైల్వే సెక్షన్లో నిడమనూరు ఉప్పులూరు స్టేషన్ల మధ్య రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ 16 పై రెండు వరుసల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని, గన్నవరం పెద్ద అవుటుపల్లి రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ 324 పై రెండు వరుసల రైల్వే ఓవర్ బ్రిడ్జిని, అలాగే పెద్ద అవుటపల్లి తేలప్రోలు మధ్య రెండు వరసల రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు 128 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదేవిధంగా విజయవాడ విశాఖపట్నం రైల్వే సెక్షన్లో మేడపాడు సామర్లకోట మధ్య లెవెల్ క్రాసింగ్ 426పై రైల్వే ఓవర్ బ్రిడ్జి, లెవెల్ క్రాసింగ్ 426 పై సామర్లకోట పిఠాపురం రైల్వే స్టేషన్ల మధ్య ఓ ఆర్ఓబి, 439 రైల్వే లెవెల్ క్రాసింగ్ పై రవికంపాడు అన్నవరం రైల్వే స్టేషన్ మధ్య మరో రైల్వే ఓవర్ బ్రిడ్జిని 168.93 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఈ ఆరు రైల్వే ఓవర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను18 నెలలోగా పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచారు.

## ముఖ్యమంత్రితో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ

- అమరావతిలో భారీగా పెట్టుబడులకు అవకాశముందన్న ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు
- రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని అభిప్రాయపడ్డ వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు.
-. అమరావతి సహా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిఎం వెల్లడి..



సిఎం చంద్రబాబుతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు

**విజయవాడ, ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అమరావతి నిర్మాణ ప్రగతిని ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీవిద్యుత్ రంగ సంస్కరణల వల్ల ఈ నగరం భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ప్రపంచ బ్యాంకు బృందం అభిప్రాయపడింది. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్ గా మారుతుందని వెల్లడించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధితో వాణిజ్య కార్యాకలాపాలకు అమరావతి కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నట్టు బృంద ప్రతినిధులు ముఖ్యమంత్రితో చెప్పారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా తాము పని చేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంక్ బృందానికి సీఎం చంద్రబాబు వివరించారు. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు.

## యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం :మంత్రి సవిత

- ఎంఎస్ఎంఇల అభివృద్ధితో ఉపాధి అవకాశాలకు ఊతం - ఇడబ్ల్యూఎస్ వర్గాలకు పారిశ్రామిక అవకాశాలతో సాధికారత



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి సవిత

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. నాగార్జున యూనివర్సిటీలోని డాక్టర్ హెచ్.హెచ్. డైక్‌మన్ ఆడిటోరియంలో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు వ్యాపార, పారిశ్రామిక అవకాశాలపై నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు . జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కులు కీలకమని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, వారిని పారిశ్రామిక రంగంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించగా, ఇప్పుడు ఉపాధి సృష్టిపై దృష్టి పెట్టామని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సవిత స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి జరుగుతోందన్నారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని, కేవలం 22 నెలల్లోనే రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, పెట్టుబడిదారులకు త్వరితగతిన అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని మంత్రి చెప్పారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు స్థాపిం చేందుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ యువతకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా ఉంటామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువత డీపీఆర్‌లతో ముందుకొస్తే సబ్సిడీ రుణాలు, శిక్షణ, ఉత్పత్తి నిర్వహణపై మార్గదర్శకత్వం అందిస్తామని చెప్పారు.

## మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియకు గడువు పెంపు

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువును పొడిగిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విడుదల చేసిన షెడ్యూల్‌ను రద్దు చేసి, కొత్త షెడ్యూల్ అమలు చేయాలని స్పష్టం చేసింది. ఫీల్డ్ స్టాఫ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సిబ్బంది ప్రస్తుతం 2027 జనగణన సంబంధిత పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ కారణంగా వార్డుల పునర్విభజన పనులు సకాలంలో పూర్తి చేయడం కష్టమని అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల సరిహద్దులు, జనాభా గణాంకాల కచ్చితత్వం, భౌగోళిక సవరణలు వంటివి క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి మరింత సమయం అవసరమని వారు తెలిపారు. తొందరపాటుతో డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేస్తే తప్పులు దొర్లే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్న మున్సిపల్ శాఖ, ప్రక్రియకు మరింత సమయం ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు, ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి ముందే అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువు పెంపు నిర్ణయంతో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కూడా మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా : మంత్రి నారా లోకేష్



**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపదలు,ఇబ్బందుల్లో ఉన్న వారికి ఏ సమయంలోనైనా తాను అండగా ఉంటానని ఏపీ మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో 87వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై పార్టీ కార్యాలయానికి తరలివచ్చిన సామాన్యులు, పార్టీ కార్యకర్తలను మంత్రి ఆప్యాయంగా పలకరించి వారి నుంచి వినతులు స్వీకరించారు. ఉదయం నుంచే టీడీపీ ఆఫీసు దగ్గర సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి సామాన్య ప్రజలు, రైతులు, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మంత్రి నారా లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను ఓపికగా విన్నారు. స్వయంగా వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా సమస్యలు పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గాలా డిపోను తరలించకుండా విజయవాడలోనే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది మంత్రి నారా లోకేశ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ బోర్డును కొండపల్లి నుంచి మోటమర్రికి పెంచడం వల్ల గత 17 ఏళ్లుగా విజయవాడలో ఉన్న సికింద్రాబాద్(గాలా) డిపో ఉనికి సందిగ్ధంలో పడిందని సుమారు 500 కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయనే విషయాన్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు .ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్ ను కోరారు. కోవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్ మెంట్ కల్పించి ఆదుకోవాలని ఏపీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. నంద్యాల జిల్లా మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన 2.63 ఎకరాల భూమిని శిరిగిరి చంద్రమోళీశ్వర రెడ్డి ఆక్రమించారని కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ ఫిర్యాదుచేశారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన ఈ వినతులన్నింటినీ మంత్రి నారా లోకేశ్ జాగ్రత్తగా పరిశీలించారు. ఏ ఒక్క అర్జీ బుట్టదాఖలు కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ స్పష్టమైన హామీ ఇచ్చారు. మై టీడీపీ యాప్ టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ "మై టీడీపీ యాప్‌ఖ టాప్ 10 ఫెర్ఫార్మర్స్" తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలకు సత్కారం చేశారు. పార్టీ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుంది. ఎన్నికల్లో విజయానికి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ సిద్ధాంతాలు వివరించేందుకు ఏడాదంతా శిక్షణ తరగతులు. 201924 మధ్య జగన్ ఎమ్మెల్యేలనే కలవలేదు, మనం కార్యకర్తలను కలుస్తున్నాం. నియోజకవర్గ పర్యటనల్లో కార్యకర్తలతో భేటీ అవుతున్నాం. వారానికోరోజు పార్టీ కార్యాలయంలో సమస్యలు తెలుసుకుంటున్నాం.ఖి అని మంత్రి లోకేశ్ చెప్పారు.

## మద్యం కేసు నిందితులు వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్ రిమాండ్ పొడిగింపు

**విజయవాడ,ఏప్రిల్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసు నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్‌ను సిట్ అధికారులు కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ గడువు నేటితో ముగియడంతో వాసుదేవరెడ్డి, ప్రణయ్ ప్రకాశ్‌ను విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల రిమాండ్ పొడిగిస్తూ విచారణను కోర్టు ఈనెల 22కు వాయిదా వేసింది. అనంతరం రిమాండ్‌లో ఉన్న నిందితులను అధికారులు గుంటూరు జైలుకు తరలించారు.

# తిరుమల సమాచారం

## శంకరంబాడి సుందరాచార్యుల విగ్రహానికి పాలాభిషేకం



**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే గొప్ప కవి, మా తెలుగు తల్లి మల్లెపూదండ" గీతాన్ని అందించిన శంకరంబాడి సుందరాచార్యుల వర్ధంతిని బుధవారం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మీపురం కూడలి లో ని శంకరంబాడి సుందరాచార్యుల విగ్రహానికి పూలమాలలు వేసి కళాకారులు, సాహితీ ప్రియులు భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి శంకరంబాడి చేసిన సేవలు అమూల్యమని, ఆయన రచనలు తెలుగు భాష యొక్క మాధుర్యాన్ని ప్రపంచానికి పరిచయం చేశాయని పేర్కొన్నారు. మా తెలుగు తల్లి మల్లెపూదండ" గీతం ద్వారా తెలుగు తల్లి మహిమాన్వితత్వాన్ని చాటిన మహాకవి శంకరంబాడి సుందరాచార్యులు తెలుగు జాతికి చిరస్మరణీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కార్యదర్శి కే.ఎన్. రాజా, రంగస్థలి ప్రతినిధులు, పురోహితుడు సురేష్ స్వామి, మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, ఎల్. కృష్ణయ్య, చిత్రపు హనుమంతరావు, మణికంఠ, వాసు, మల్లారపు రవి ప్రసాద్, లోక ప్రభాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 13 నుండి 22 వరకు భాష్యకార్ల ఉత్సవాలు



**తిరుమల, ఏప్రిల్ 8ప్రభాత వార్తప్రతినిధి: :** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో భాష్యకారులు వార్షిక ఉత్సవాలు ఈనెల 13 నుండి 22వ తేదీ వరకు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు ఉదయం 7.30 గంటలకు శ్రీ భాష్యకారులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధులలో ఊరేగింపుగా తీసుకువెళ్తారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పెద్దమాడ వీధులలో విశేష ఉత్సవం జరుగుతుంది. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర, ఆస్థానం కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఏప్రిల్ 21న భోగి తేరు, 22న సాత్తుమొర వేడుకలు భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తనున్నాయి. అనంతరం ఏప్రిల్ 23న గంధపొడి ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భాష్యకారుల కటాక్షాన్ని పొందాలని టిటిడి తెలిపింది.

## టిటిడి ట్రస్ట్‌లకు విరాళాలు



**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాత వార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందించారు. బుధవారం మధ్యాహ్నం ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్ట్ కు 10 లక్షలు విరాళం అందింది. తిరుపతికి చెందిన పి.సతీష్ కుమార్, పి.రోజా దంపతులు ఈ విరాళం డిడిని టిటిడి ఇఒశ్రీ ముద్దాడ రవిచంద్రకి దాత అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను టిటిడి ఇఒ అభినందించారు.

- చిన్నపిల్లల హృదయాలయంకు రూ.10 లక్షలు

అలాగే తిరుపతికి చెందిన కె.అనంతమ్మ పుట్టినరోజు సందర్భంగా, ఆమె కుమార్తె శారద తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంకు 10 లక్షలు విరాళం అందించారు. ఈ విరాళం డిడిని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఆసుపత్రిలో డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డికి దాత అందజేశారు.

## దత్తమందిరంలో రేపు బృందావనార్చనసేవ



**తిరుపతి,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి శుక్రవారం ఉదయం అత్యంత భక్తిశ్రద్ధలతో అవధూత దత్తాత్రేయమందిరంలో భక్తులే నిర్వహించే బృందావనర్చన సేవ రేపు జరగనుంది. ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్లగ్రామంలో కోలువైనదత్తాత్రేయ స్వామి బృందావనాన్ని భక్తులే శుద్ధిచేసి, అభిషేకించే అవకాశం ఉంది. ఈ సేవలో పాల్గొనడానికి ఎటువంటి రుసుములేదు. ఈ వారంలో దత్తాత్రేయస్వామి మందిరంలో రేపు ఉదయం 9గంటల నుండి బృందావనార్చన సేవ మొదలవుతుంది. శనివారం సాయంత్రం 7గంటల నుండి విశేష పల్లకీసేవ జరుగుతుంది. ఆలయం వివరాలకు పవని విష్ణు కౌశిక్ 9182882632 ,9908973699 నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

## భక్తులను మరింత ఆకట్టుకునేలా ఎస్వీబిసి ప్రసారాలు: టిటిడి జె ఇ ఒ డాక్టర్ శరత్

**తిరుమల,ఏప్రిల్ 8 ప్రభాత వార్త ప్రతినిధి:** శ్రీవారి భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) ప్రసారాలను విస్తరించనున్నట్లు టిటిడి జె ఇ ఒ (వైద్యం, విద్య) మరియు ఇంఛార్జి సి ఇ ఒ డాకార్ ఎ. శరత్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా కార్యాలయానికి వచ్చిన ఆయన, బుధవారం వివిధ శాఖల ప్రతినిధులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోజువారీ కార్యక్రమాల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందేలా కార్యక్రమాలను మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని సూచించారు. "శతమానంభవతి" కార్యక్రమాన్ని క్రమబద్ధీకరించి ప్రతి భక్తునికీ శ్రీవారి ఆశీర్వచనం, అక్షింతలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "దివ్యానుభూతి" కార్యక్రమాన్ని మరింత సులభంగా, అందరికీ చేరువగా తీసుకువస్తామని చెప్పారు. సోషల్ మీడియా వేదికల ద్వారా ఆకర్షణీయమైన భక్తి కార్యక్రమాలు, భక్తుల అనుభవాలను, ఇతర కార్యక్రమాలను మరింత విస్తృతంగా భక్తులకు చేరవేయనున్నట్లు తెలిపారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రసారమవుతున్న కార్యక్రమాలను మరింత నాణ్యంగా అందిస్తామని పేర్కొన్నారు. ఎస్వీబీసీ ద్వారా శ్రీవారి నిత్యసేవలు, ఉత్సవాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తూ భక్తులకు ఆధ్యాత్మికానుభూతి కలిగిస్తున్నామని తెలిపారు. వేదాలు, ఉపనిషత్తులు, సనాతన ధర్మాన్ని విస్తరించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడంతో పాటు, శ్రీవారి వైభవాన్ని మరింత పేరొందిన పండితుల వ్యాఖ్యానాల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో ప్రసారాల రూపకల్పన, రికార్డింగ్, కంటెంట్, కెమెరాలు, ఆడియో మిక్సింగ్, డైలీ ప్రోగ్రామ్ చార్ట్ వంటి అంశాలను పరిశీలించి, అన్ని వివరాలు క్రమబద్ధంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

## విమర్శలపై స్పందించడంలో ప్రజాస్వామ్య పంథాను అనుసరించాలి : డి సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ ,ఏప్రిల్8 ,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉంటాయని, వాటిపై స్పందించడంలో ప్రజాస్వామ్య పంథాను అనుసరించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. విమర్శలు చేసిన వారిపై దాడులు చేయడం అప్రజాస్వామికం,పిరికితనంగా ఆయన"ఎక్స్" వేదికగా వ్యాఖ్యానించారుజ. గతంలో జగన్ సీఎం హోదాలో పాఠశాల విద్యార్థుల సమక్షంలోనే హద్దులు దాటి, దిగజారుడు మాటలు మాట్లాడారని పవన్ గుర్తు చేశారు. భార్యను కారుతో పోల్చి మాట్లాడిన జగన్ తీరును ప్రజలు మర్చిపోలేదని పేర్కొన్నారు. అలాగే అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు సతీమణిపై వైకాపా ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడితే జగన్ నవ్వుతూ ప్రోత్సహించారని గుర్తు చేశారు. అప్పట్లో జగన్ కార్యాలయాలపై, ఆయన సంస్థలపైగానీ జగనసేన అభిమానులెవరూ దాడి చేయలేదన్నారు. ఎదుటివారు దిగజారి మాట్లాడినా, మనం వారి స్థాయికి దిగజారవద్దని ప్రజాస్వామ్య రీతిలోనే స్పందించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైకాపా నేతలు ఈ రోజుకీ దిగజారి, అభ్యంతరకర భాషలోనే మాట్లాడుతున్నారని విమర్శించారు.

వార్త

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

- రాజాజి

# అంతమా? పంతమా!

శ్వేతసౌధాధినేత డోనాల్డ్ ట్రంప్ ఎప్పుడు ఏమి మాట్లాడినా ఎవరూ పెద్ద సీరియస్‌గా తీసుకోరు. ఆయనను అభిమానించేవారు సైతం ఏదో అన్నాడులే అని సరిపెట్టేసుకుంటారు. అమెరికన్లు ఇతర దేశాల ప్రజలు సైతం ఆయనవి అసంబద్ధ ప్రేలాపనలుగా తోసిపుచ్చారు. తాజాగా పశ్చిమాసియా యుద్ధం రేపటికి 40 రోజులు ముగుస్తాయనగా ముందురోజు ఏదో మిన్ను విరిగి మీద పడిపోయినట్లు 'ఇరాన్‌లో డూమ్స్ డే' ప్రారంభమైనట్లు మాట్లాడుతూ ఈ రాత్రితో ఇరాన్‌లో నాగరికత అంతం అవుతోందని చెబుతూనే ఎన్నో వింత వ్యాఖ్యానాలు చేశారు. ఆదిలో కాల్పుల విరమణకు 5 రోజులు గడువు విధించగా మిత్రదేశం ఇజ్రాయెల్ కూడా దానిని అంగీకరించలేదు. మళ్లీ తగుదునమ్మా అంటూ మరో రెండు వారాలు సమయమిచ్చినట్లు ప్రకటించారు. 'కాల్పుల విరమణకిచ్చిన గడువు ముగిసే సమయానికి అదేదో ప్రపంచం అంతమయ్యే రోజు సమీపించినంత ఆత్రుత కనపరుస్తూ 'ఇరాన్‌పై అణుదాడి'కి సిద్ధమౌతున్న స్థాయిలో హుంకరించారు. అయినా ఎవరూ భయపడినట్లు లేదు. తాత్కాలిక కాల్పుల విరమణ సంధికి విధించిన గడువు భారత కాలమాన ప్రకారం బుధవారం ఉదయం 5.30గంటలకు ముగిసింది. కానీ ఏమీ జరుగలేదు. అంతమవబోతున్న నాగరికతను మళ్లీ వెనక్కు తీసుకురావడం సాధ్యంకాదన్నారు. అలా జరగడం తన కిష్టం లేకపోయినా తప్పేటట్లు లేదనగానే కొందరుఉలిక్కి పడ్డారేమో తెలియదు కానీ 47 ఏళ్ల నిర్బంధం, అవినీతి పాలన ఎట్టకేలకు అంతం కాబోతోందన్న పలుకులు విశ్వసించేటట్లుగా చెప్పలేకపోయారు. అదేదో ఇరాన్‌ను బూచితో భయపెడ్తున్నట్లుగానే ఉంది. తొలుత ఎందు కైనా మంచిదని ఆలోచించేవారు 'ఇరాన్‌పై అమెరికా అణుదాడి' చేయబోతోందా? అనే అనుమానంతో భయపడినా అలాంటిదేం జరుగదని సరిపెట్టుకున్నారు. తెల్లారేసరికి అదేం జరుగలేదంటే పాపం! ట్రంప్ తమాయించు కున్నట్లున్నారే అనుకుని సమాధానం పడ్డారు జనం. ఇప్పటికే 7 ఆధునిక విమానాలను సైతం నేలపాలు చేసిన ఇరాన్ ధాటికి అమెరికాతట్టుకోలేకపోతోందనుకున్న తరుణంలో ట్రంప్ ఎలాంటి అవివేక నిర్ణయంతీసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని, ఆయనదంతా మేకపోతుగాంభీర్యమే అనుకునే వాళ్లూ ఉన్నారు. ట్రంప్ ఒకడుగు వేస్తే ఇరాన్ రెండడుగులు ముందుకేస్తోందే తప్పఅసలు తగ్గలేదు. ఆదినుంచి ట్రంప్ ఎలాంటి ప్రేలాపనలు పేలినా ఇరాన్ 'సై అంటే సై' అనడమూ అందుకు సిద్ధమవడమే తప్ప మరో ఆలోచన చేయలేదు. హర్మూజ్ విషయంలో ఐక్యరాజ్యసమితి ప్రతిపాదనపై తీర్మానం వీగిపోయింది. హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చే తీర్మానానికి తమ 'వీటో' పవర్‌ను ఉపయోగించి రష్యా, చైనాలు తిరస్కరించాయి. తాజాగా హర్మూజ్ జలసంధి విషయంలో ట్రంప్ మాట్లాడుతున్న వ్యవహార మంతా ఓవిదూషకుడి ఇంద్రజాల మహేంద్రజాలపు ఎత్తుగడల్లాగానే ఉన్నాయి. ఇరాన్ తన అధీనంలోని హర్మూజ్ జలసంధిని నిఘా పెంచుకుంటూనే తనగుండావెళ్లే వాణిజ్య నౌకలకు వీలైనంత మేరకు 'దారి'తీస్తూనే ఉంది. ఇరాన్ తనను తాను కాపాడుకోవడానికి అమెరికా దుందుడుకు తనాన్ని తగ్గించేందుకు ఇదొక్కటే మార్గం. తాజాగా హర్మూజ్‌ద్వారా ప్రయాణించే ఇరాన్ నౌకలకు పన్ను వసూలు చేసే ఆలోచనకు ధీటుగా అదే సమయంలో తాముకూడా ఇలాంటి పన్నును హర్మూజ్ జలసంధి పేరిట అమెరికా సుంకం వసూలు చేయాలని అమెరికా ఆలోచిస్తోంది. ట్రంప్ స్వయంగానే ఈ విషయాన్ని బయటపెట్టారు. ఇరాన్‌ను యుద్ధంలోఓడించాక, ఆ తర్వాతనే అమెరికా సుంకం విధించాలని కలలు కంటున్నట్లుంది. హర్మూజ్ జలసంధిలో రోజూ 120నౌకలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొన్నిదేశాల నౌకలపై ఇప్పటికే ఇరాన్ రెండు మిలియన్ డాలర్ల మేరకు పన్ను వసూలుచేస్తోంది. ఇలారోజూ240 మిలియన్ డాలర్లు చేజిక్కించుకోవాలన్నది అమెరికా పాలకుల ఆశ. ట్రూత్ సోషల్ పోస్ట్‌లో ట్రంప్ పోస్టులన్నీ విచిత్రంగానే ఉంటాయి. ఏవి సాధ్యమో, ఏవిఅవాస్తవాలో, ఏవి నిజమో, ఏవి వాస్తవదూరమో, అర్థంకాక వాటిని చదివే వారు గందరగోళంలో పడతారు. అలాంటి మానసిక పరిస్థితిలో ట్రంప్ వ్యాఖ్యలు ఎవరికీ అర్థంకావు. ట్రంప్ ఇప్పటికే మూడుసార్లు గడువును పొడిగించారు. అమెరికాతో గల రాజీ అవకాశాలపై ఇరాన్ ఏమాత్రం ఆశలు పెట్టుకోలేదు. ఇరాన్ అంతటి శక్తివంతమైన దేశాన్ని ట్రంప్ చాలాచులకనగా మాట్లాడుతూ అమెరికన్లలోఆయనే చులకనౌతున్నారు. యుద్ధం మొదట్లో ఇరానీయుల్ని తమ దేశాధినేతలపై తిరుగుబాటు చేయాలని ప్రేరేపించినా పనిచేయలేదు. తాజాగా ఇరానీయులే తమ దారికి వచ్చినట్లు చెబుతూనే ప్రాచీన నాగరికత ఉన్న ఇరాన్ చరిత్ర గర్భంలో కలిసిపోతుందనే సంకేతాలతో హెచ్చరిస్తున్నారు. చివరికి తెలిసిందేమిటంటే మరో రెండువారాలు కాల్పుల విరమణకు చైనా ఇరాన్‌ను ఒప్పించిందంటున్నారు. మరోపక్క అమెరికా భూతల దాడులను ఎదుర్కొనేందుకు ఇరాన్ సిద్ధమౌతోంది. తమ దేశం కోసం 1.40 కోట్ల మంది ఇరాన్ ప్రజలు సంసిద్ధులుగా ఉన్నారని ఇరాన్ నేతలు చెబుతున్నారు. హర్మూజ్ జలసంధినుంచి ఇటీవల కాలంలో ఒక్క ఎల్ఎన్‌జి నౌక కూడా బయటకు రాకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా ద్రవీకృత సహజ వాయువు కొరత తీవ్రమవక తప్పదు. ఏ దేశన్నైనా ట్రంప్ ఆదేశాలు సందిగ్ధతలో ఉంచుతున్నాయి. ఇరాన్ మాత్రం తమ సార్వభౌమత్వాన్ని కాపాడుతూ శాశ్వత యుద్ధ విరమణ షరతులకు మాత్రమే తలొగ్గుతుంది. తప్పఅ మెరికాకు సాగిలపడే పరిస్థితిలో లేదు.



విశ్వాసం అనేది కొద్దిపాటి గాలికి వాలిపోయేది కాదు. అది అచంచలమైనది. హిమాలయాల అంత స్థిరమైనది.

మహాత్మా గాంధీ



సంకల్ప బలం ఉన్నవారు అన్నిటినీ తనకు అనుకూలంగా మలచుకోగలరు.

సోక్రటీస్

# నారీశక్తి బలోపేతానికి సమష్టి కృషి!

మరికొన్ని రోజుల్లో దేశంలోని అన్ని ప్రాంతాల్లో పండగ వాతావరణంతో సందడి మొదలు కాబోతున్నది. అస్సాం ప్రజలు రొంగాలి బిహు జరుపుకొంటే, ఒడిశా ప్రజలు మహా బిషుబ పాన సంక్రాంతి నిర్వహిస్తారు. పశ్చిమ బెంగాల్లో పొయిలా బైశాఖి బెంగాలీల నూతన సంవత్సరానికి నాంది పలికితే కేరళలో సంబరంగా విషు పండగ నిర్వహిస్తారు. తమిళనాడులో పుత్తాండు పర్వదినాన్ని, పంజాబ్ సహా ఉత్తర భారతంలోని ఇతర ప్రాంతాల్లో బైశాఖీ వేడుకను చేసుకుంటారు. ఇవన్నీ ఆశాభావాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. దేశ విదేశాల్లో ఈ వేడుకలను నిర్వహించుకొనే వారందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పవిత్ర ఉత్సవాలు అందరి జీవితాల్లోనూ ఆనందాన్నీ, సౌభాగ్యాన్నీ తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాను. ఏప్రిల్ 11 నుంచి మహాత్మా ఫూలే 200 జయంత్యుత్సవాలను మనం ప్రారంభించుకుంటున్నాం. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు యావత్ భారతదేశం నివాళి అర్పిస్తుంది. ఈ ప్రత్యేక సందర్భాలే కాకుండా, మన హృదయాలూ, ఆలోచనలూ పునర్నవీకరణ స్ఫూర్తితో నిండిన వేళ.. మన దేశం మరో చారిత్రక విజయం ముంగిట నిలబడింది. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్టం చేసుకోవడానికి, సమానత్వం, సమ్మిళితత్వం దిశగా మన సమష్టి నిబద్ధతను పునరుద్ఘాటించడానికి లభించిన గొప్ప అవకాశమిది. మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనిని ఓ శాసనపరమైన కార్యక్రమంగా పేర్కొంటే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తగ్గించినట్టే అవుతుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబం. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవి, అమూల్యమైనవి. ప్రతి రంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు నేడు భారత్ కేంద్రంగా మారింది. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి కళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగాచేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్యసేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు, ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవుతాయి. రానున్న అంటే 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం అనివార్యం. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధినియంను పార్లమెంటు ఆమోదించింది. నా జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన సందర్భాల్లో ఒకటిగా నేను దీనిని భావిస్తాను. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తిలో ప్రతిధ్వనిస్తోంది. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలని మన రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. ఈ ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ప్రయత్నాల్లో ప్రధానం. శాసన వ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి పౌరునికీ సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మా చిత్తశుద్ధిని ఇది ప్రతిబింబిస్తుంది. ఉపేక్షకు అవకాశం లేని సమయం వచ్చింది. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఎలాంటి జాప్యం జరిగినా ప్రజాస్వామ్య సమ్మిళితత్వాన్నీ, ప్రజాస్వామ్య స్ఫూర్తినీ మనం వాయిదా వేసినట్లే. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించారు. ఈ అంశంపై చర్చించారు. ఇలా చేయడం తప్పనిసరి అని కూడా భావించారు. ఇప్పుడు గనుక దీనిని వాయిదా వేస్తే మనం గుర్తించిన, సరిదిద్దగలిగిన అసమతౌల్యాన్ని మరింత పెంచడమే అవుతుంది. నిర్దిష్ట లక్ష్యంతో, ఆత్మవిశ్వాసంతో భారత్ ముందుకు సాగుతున్న ఈ తరుణంలో ప్రజలు, ముఖ్యంగా జనాభాలో సగభాగంగా ఉన్నవారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. సకాలంలో చేపట్టే చర్యలు దీర్ఘకాలంగా నెరవేరని వాగ్దానాలను నెరవేర్చడమే కాకుండా ప్రగతి వేగాన్ని సైతం కొనసాగిస్తాయి. మన ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రాతినిధ్యం కల్పించేదిగా, స్పందించేదిగా, భవిష్యత్తుకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఇది నిజంగా చరిత్రాత్మకమైన అవకాశం. అందరూ కలిసి రావాల్సిన సమయం ఇది ఏ ఒక్క ప్రభుత్వానికో, పార్టీకో లేదా వ్యక్తికో సంబంధించిన అంశం కాదు. దీని ప్రాధాన్యాన్ని గుర్తించి, దీనిని సాకారం చేసుకునే దిశగా దేశమంతా ఏకతాటిపైకి రావాల్సిన సమయం. మన నారీశక్తికి మనం అందించాల్సింది ఇదే. అందుకే మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం కావాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలి. మన కోసం కాకుండా భవిష్యత్తు తరాల కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ఇలాంటి అవకాశాలు మనకు అందిస్తాయి. మార్పులను స్వీకరిస్తూ, మరింత సమ్మిళితత్వాన్ని సాధించడంలోనే అసలైన ప్రజాస్వామ్య స్ఫూర్తి దాగి ఉందన్న సంగతిని గుర్తు చేస్తున్నాయి. చరిత్రాత్మకమైన ఈ పార్లమెంటు సమావేశం సమీపిస్తున్న నేపథ్యంలో భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాలని పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులందరికీ విజ్ఞప్తిచేస్తున్నాను. బాధ్యతగా వ్యవహరించేందుకూ, ఈ అవకాశాన్ని ఉపయోగించుకునేందుకు ముందుకు వద్దాం. అత్యున్నత ప్రజాస్వామ్య విలువలకోసం కలిసినడుద్దాం. జాతీయ ప్రయోజనాల విషయంలో విభేధాలను పక్కన పెట్టి, ఐక్యంగా వ్యవహరించగలదని భారత్ ఎల్లప్పుడూ రుజువు చేస్తూనే ఉంది. ఇది అలాంటి సందర్భమే. అందరం కలిసి కట్టుగా ముందుకు సాగుదాం. రాజ్యాంగ విలువలను బలోపేతం చేద్దాం. దేశప్రగతి కోసం నారీశక్తికి సాధికారత కల్పిద్దాం. ●

# భవితకు భద్రత బయోగ్యాస్!

ముద్దం నరసింహస్వామి

భారతదేశం విపత్కరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు అత్యాధునిక సాంకేతికతతో దూసుకుపోతుండగా, మరోవైపు వంటగ్యాస్ (ఎల్పీజీ) కోసం ఇప్పటికీ విదేశీ దిగుమతులపైనే భారీగా ఆధారపడుతోంది. ముఖ్యంగా పశ్చిమాసియాలో, అందునా 'హర్మూజ్ జలసంధి' పరిసరాల్లో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడల్లా మన వంటగదుల్లో ఆందోళన మొదలవుతోంది. సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల ధరలు పెరగడమే కాకుండా, ఇంధన భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే వనరులతో 'బయోగ్యాస్' వ్యవస్థలను పునరుద్ధరించడం కేవలం ఆర్థిక అవసరమే కాదు, దేశ భద్రతా వ్యూహంలో భాగం కావాలి. ప్రస్తుతం భారత్ ఎల్పీజీ దిగుమతుల కోసం ఏడాదికి లక్షకోట్ల రూపాయలకు పైగా విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చిస్తోంది. దీనికితోడు ప్రభుత్వ ఖజానాపై మరో పదివేల కోట్ల రూపాయల సబ్సిడీ భారం పడుతోంది. ఇంత భారీ వ్యయం చేస్తున్నప్పటికీ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాల వల్ల సరఫరాపై పూర్తి గ్యారెంటీ లేకపోవడం ఆందోళనకరం. 1980ల్లోనే బయోగ్యాస్‌ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినప్పటికీ, మధ్యలో ఎల్పీజీ సబ్సిడీలు పెరగడం వల్ల ప్రజలు ఈ సహజ ఇంధనానికి దూరమయ్యారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు వెలుగొందిన బయోగ్యాస్ ప్లాంట్లు నేడు శిథిలావస్థకు చేరాయి. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 20కోట్లకు పైగా పశు సంపద మనకు ఇంధన గని వంటిది. వీటి నుంచి వచ్చే పేడను, పంట అవశేషాలను, వంటింటి వ్యర్థాలను శాస్త్రీయంగా వినియోగిస్తే ప్రతి గ్రామం ఒక 'శక్తి కేంద్రం'గా




మారుతుంది. వ్యర్థాలను కేవలం సమస్యగా చూడకుండా, ఒక విలువైన వనరుగా మార్చుకోవాల్సిన సమయంఆసన్నమైంది. గణాంకాల ప్రకారం, ఒక సాధారణ కుటుంబం బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా ఏడాదికి సుమారు 15 వేల రూపాయల వరకు ఆదా చేయవచ్చు. అయినప్పటికీ, దేశంలో కేవలం 0.3శాతం కుటుంబాలే బయోగ్యాస్ వాడుతుండటం, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఇందులో వెనుకబడి ఉండటం శోచనీయం. బయోగ్యాస్ కేవలం వంట ఇంధనం మాత్రమే కాదు, వ్యవసాయానికి ఒక వరప్రసాదం. ప్లాంట్ నుంచి వచ్చే 'స్లరీ' భూమికి అద్భుతమైన ఎరువుగా పనిచేస్తుంది, తద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణ ద్వారా గ్రామీణ యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. వ్యర్థాల నిర్వహణ సులభతరం కావడంతోపాటు కాలుష్యం తగ్గుతుంది. ఈ వ్యవస్థలో మార్పు రావాలంటే కేవలం రాయితీలు ఇస్తే సరిపోదు. సర్పంచులు, పంచాయతీ సభ్యులు బయోగ్యాస్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. పట్టణవాసులు సోలార్ ప్యానెల్స్, ఇండక్షన్ స్టవ్‌లపై దృష్టి పెట్టాలి. ఐఐటీ హైదరాబాద్ రూపొందించిన రూ.500 చౌక సోలార్ కుక్కర్ వంటి ఆవిష్కరణలను ప్రభుత్వం భారీగా ప్రోత్సహించాలి. ఇంధన స్వావలంబన అనేది దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది. ఎల్పీజీపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ బయోగ్యాస్, సోలార్, విద్యుత్ వంట వ్యవస్థలను ఏకోన్ముఖంగా ముందుకు తీసుకెళ్లాలి. ప్రతిగ్రామం తనవంట అవసరాలకు స్వయంసమృద్ధి సాధించినప్పుడే, దేశం నిజమైన ప్రగతి పథంలో పయనిస్తుంది. ఇది కేవలం వంటగది సమస్య కాదు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన అడుగు. ●

# కృత్రిమ మేధ ప్రజాశ్రేయస్సుకేనా?

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

పారిశ్రామిక విప్లవం నుండి ఐటీ రంగం వరకు జరిగినవన్నీ సాంకేతిక విప్లవాలు ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నూతన నాగరికత కూడా ప్రపంచ దేశాల దిశా, దశ మార్చబోయే శక్తిగా ఉన్నది. ఇప్పటివరకు ఐటీ రంగంలో ప్రపంచ దేశాలకు వెన్నెముకగా ఉన్న మన నిపుణులు ఇప్పుడు ఏఐ రంగంనుకూడా నడిపించగలగాలి. ఆనాడు ఐఐటీలను స్థాపించగలిగినందువల్లనే నేడు ఐటీ దిగ్గజ కంపెనీలకు సీఈవోలుగా మనవారు ఉన్నారు. ఈపునాదుల పైననే ఏఐ రంగాన్ని కూడా మనం శాసించగలగాలి. లేకపోతే అమెరికా చైనా ఆధిపత్య ధోరణలను అరికట్టలేం. ఏఐ ప్రపంచంలో మనుగడ సాగించేందుకు అత్యవసరమైన వివిధ రకాల నైపుణ్యాలను విద్యార్థులు ఒంటబట్టించుకునే విధంగా దేశంలోని విద్యా వ్యవస్థలను తీర్చిదిద్దాలి. ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా మనమే ముందుండాలి. మనకు కావలసినంత డెమోగ్రాఫిక్ డివిడెంట్ సాంకేతిక నిపుణత మన దేశానికి ఉంది. కావలసినదల్లా ప్రభుత్వ పాలన సహాయ సహకారాలు మాత్రమే. మన ప్రధాని ఏఐ రంగాన్ని దేశ భవిష్యత్తు కోసం ఉపయోగించాలని ఇది మానవ కేంద్రీకృతంగాను సమ్మిళిత అభివృద్ధి గాను ఉండాలని ఢిల్లీలో జరిగిన ఏఐ ప్రభావం అనే సదస్సులో నొక్కిచెప్పారు. కృత్రిమ మేధస్సు పరిశోధనా రంగంగా ప్రారంభమై, ఇప్పుడు ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే ప్రాథమిక సాంకేతికతగా వేగంగా అభివృద్ధి చెందింది. ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థ, విద్య, భద్రత ప్రజావిధానాలు వంటి కీలక రంగాల్లో ఏఐ ఆధారిత వ్యవస్థలు కీలక నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బాధ్యతాయుత అభివృద్ధి, పరిపాలన అత్యంత అవసరంగా మారింది. ఏఐ సాంకేతికత వినియోగమూ బాధ్యతాయుతంగానే ఉండాలి. బాధ్యతాయుత ఏఐ అనేది నైతికత, పారదర్శకత, సామాజిక విలువలకు అనుగుణంగా రూపకల్పన చేసి అమలు చేయాల్సిన ఒక సాంకేతిక వ్యవస్థ ప్రజాప్రయోజనాలకు హాని లేకుండా, పక్షపాతాన్ని తగ్గించే, గోప్యతను రక్షించే సమానత్వం, భద్రతను ప్రోత్సహించే విధంగా ఏఐ వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ఉపయోగించడం లక్ష్యంగా ఉండాలి. ఇది కేవలం సాంకేతిక పనితీరుకే పరిమితం కాకుండా, సమాజంపై విస్తృత ప్రభావం, చట్టపరమైన అనుసరణ, నైతిక సమన్వయాన్ని కూడా కలిగి ఉండాలి. ప్రధానంగా న్యాయం, మానవ హక్కులు వంటి నైతిక అంశాలపై దృష్టిపెట్టాలి. బాధ్యతాయుత ఏఐ అనేది నైతికత, ప్రమాద నియంత్రణ, అనుసరణ, కార్యాచరణ బాధ్యతలను సమగ్రంగా కలిగిన పరిపాలనా నమూనా. ఇదంతా ప్రభుత్వ నియంత్రణలోనే జరగాలి. పలువురు దేశాధినేతలతో అంతర్జాతీయ స్థాయి ఏఐ సారథులు, సీఈఓలు విద్యావేత్తలు, పరిశోధకులు, దాతలు సదస్సులో పాల్గొన్నారు. ఏఐ రంగంలో భారతన్ను సారథ్య స్థానంలో నిలిపే లక్ష్య సాధనలో భాగంగా ఈ సదస్సును కేంద్రం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంతోనే ఏఐ రంగాన్ని ఆనాటి ఐటీ లాగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది. దేశంలో ఉన్న నిరుద్యోగ సమస్యను కూడా పరిగణలోకి తీసుకోవా



ల్సి ఉన్నది. అభివృద్ధి చెందుతున్న ఏఐ ద్వారా నిరుద్యోగ సమస్య ఏర్పడకూడదు. మనప్రభుత్వ పెట్టుబడులుమాత్రం ఓమోస్తరుగానే ఉన్నాయి. గత ఏడాది రూ. 2,000 కోట్లు కేటాయిస్తే, తాజా బడ్జెట్ ప్రతిపాదనల్లో అవి అందులో సగానికి తగ్గిపోయాయి. అత్యధునాతన టెక్నాలజీపై పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉన్న సమయంలో కోత పెట్టడం నివ్వెరపరుస్తోంది. ఏఐ ప్రవేశం వలన మన దేశంలో 15లక్షల ఉద్యోగాలు పోతాయని నీతి ఆయోగ్ అంచనా వేసింది. దశాబ్దాలుగా సాగుతున్న సాంకేతిక అభివృద్ధినేడు పరాకాష్టకు చేరింది. మానవ శారీరక శ్రమను రోబోలు ఆక్రమిస్తుంటే, మేధా శ్రమ స్థానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కైవసం చేసుకుంటోంది. ఫలితంగా బ్లూ కాలర్, వైట్ కాలర్ రంగాల్లో మనిషికి స్థానం లేకుండా పోతోంది. ఉదాహరణకు, ఒక సంస్థలో 30వేలమంది వరకూ ఉద్యోగులను తొలగించనున్నారు. దీనికి కారణం ఆ కంపెనీ ఒక ఉద్యోగస్థుడికి సాలీనా సగటున 36వేల డాలర్ల వేతనం చెల్లించవలసి ఉంటే అదే స్థానంలో మర మనిషిని (రోబో) పెట్టుకుంటే అయ్యే ఖర్చు 3,600 డాలర్లు మాత్రమే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సో తన సంస్థకు సంబంధించిన కొత్త కోడ్‌ను గూగుల్ 2025 నాటికి 30 మేరకు రాయగలుగుతోంది. అంటే, ఆ మేరకు సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగాల కోతలు అనివార్యమన్నమాట. వేలాది మంది ఉద్యోగుల తొలగింపులు సాఫ్ట్వేర్ రంగంలో పెను సంచలనాన్ని సృష్టిస్తున్నాయి. ఈ భారీ లేఆఫ్స్ వెనుక రాజకీయ కారణాల కంటే కూడా కృత్రిమ మేధస్సు రంగంలో ఆధిపత్యం సాధించాలనే కంపెనీ వ్యూహాత్మక నిర్ణయమే ప్రధానంగా కనిపిస్తోంది. దాదాపు ముప్పై వేలమంది వరకు, అంటే సంస్థలోని మొత్తం సిబ్బందిలో సుమారు పద్దెనిమిది శాతం మందిని తొలగించాలని ఓ సంస్థ నిర్ణయించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏఐ మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులను మళ్లించడమే. కంపెనీ ఆదాయం బలంగానే ఉన్నప్పటికీ, భవిష్యత్తులో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రత్యర్థులతో పోటీ పడాలంటే ఏఐ డేటా సెంటర్ల నిర్మాణం అత్యవసరమని యాజమాన్యం భావిస్తోంది. ఇందు కోసం వెచ్చించాల్సిన వేల కోట్ల నిధులను సమకూర్చుకోవడానికి మానవ వనరుల ఖర్చును తగ్గించుకోవడం తప్పనిసరి అని కంపెనీ భావించడం వల్లనే ఈ అకస్మాత్తు తొలగింపులు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్వేర్ రంగం ఇప్పటికే ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో, ఇలాంటి దిగ్గజ సంస్థలు తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగులలో తీవ్ర ఆందోళనను నింపుతున్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల మధ్య ఉద్యోగులు తమ ఉనికిని కాపాడుకోవాలంటే కేవలం పాతతరం సాఫ్ట్వేర్ నైపుణ్యాలపై ఆధారపడటం సరిపోదు. ఏఐ విప్లవం వల్ల వస్తున్న మార్పులను గమనిస్తూ, కొత్త సాంకేతికతలలో నైపుణ్యాన్ని పెంచుకోవడం ఒక్కటే ప్రస్తుతానికి కనిపిస్తున్న పరిష్కారం. సంస్థలు లాభాలకోసం మనుషుల కంటే యంత్రాలకే ఎక్కువ విలువ ఇస్తున్న ఈ రోజుల్లో, సాఫ్ట్వేర్ ఉద్యోగులు నిరంతరం తమను తాము అప్‌డేట్ చేసుకోవడం ద్వారా మాత్రమే ఈ ఉపాధి గండం నుండి బయటపడగలరు. మనిషితో పని లేకుండా ఉత్పత్తుల నుండి యుద్ధరంగం వరకు ఏఐ తోనే నిర్వహించుకుంటే నిరుద్యోగ సమస్య ఎక్కువ అవుతుందని పాలకులు పెట్టుబడిదారులు గమనించాలి. ఆధునికయుగంలో ఎప్పటికప్పుడు సాంకేతికత అభివృద్ధి చెందుతూ వస్తుంది. ఆ సాంకేతికత వల్ల మానవాళి శ్రేయస్సుకు మేలు జరగాలి. వారికి కీడు జరిగే అవకాశాలుంటే ప్రభుత్వం నివారించాలి. పారిశ్రామిక విప్లవం నుండి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వరకు సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతూ వాటిని ఉపయోగించడం వలన వివిధ దేశాల ఆదాయాలు పెరిగిన మాట వాస్తవమే కానీ దీనితో పాటు నిరుద్యోగ సమస్య కూడా గణనీయంగా పెరిగింది. లాభాపేక్ష, ఖర్చులు తగ్గింపు నెపంతో కార్పొరేట్ సంస్థలు ముఖ్యంగా సాఫ్ట్ వేర్ రంగం లేఆఫ్ల మంత్రం జపిస్తోంది. ఇది మౌళికంగా మానవ శ్రేయస్సుకు విరుద్ధం. ●

# ప్రజావాక్కు



## కర్కశత్వానికి తగిన శిక్ష

తమిళనాడులో ఆరేళ్ళ క్రితం జరిగిన పాశవిక ఘటన 'లాకప్ డెత్' కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించిన తీర్పు. కరోనా సమయంలో సదరు లాక్ డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్‌చేశారు. వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా వారిరువురూ ప్రాణా లు కోల్పోయారు. కస్టడీలోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరుపౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేటతెల్లం. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగామద్రాస్ హైకోర్టు సూమోటోగా కేసుని స్వీకరించింది. సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

## నిర్ణయం తీసుకోవడంలో జాప్యం

ఆదాయానికి మించినఆస్తులు, అవినీతికేసుల్లానే ఎమ్మెల్యే, ఫిరాయింపులు కూడా ఏళ్లతరబడి సాగుతున్నాయి. చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికలవరకు పరిస్థితి ఇలానే ఉండేలా ఉంది. నిజానికి ఇది చాలా చిన్నపని. స్పీకర్ తల్చుకుంటే ఒక్కరోజులో తేలిపోతుంది. అయినా ఎటూ తేలటంలేదు. కోర్టువారు జోక్యం చేసుకుని పరిష్కారం చేయమన్నా స్పీకర్‌నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

- రాశి, హైదరాబాద్

## సైబర్ వేధింపుల ముప్పు

నేటిడిజిటల్ యుగంలోసాంకేతికత విస్తరించినకొద్దీ మహిళలకు సైబర్ వేధింపుల ముప్పు కూడా అధికమవుతోంది. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం, ఫోటోలను దుర్వినియోగంచేయడం, సైబర్ స్టాకింగ్ వంటివి ప్రధాన సవాళ్లుగా మారాయి. ముఖ్యంగా డీప్ ఫేక్ వంటి ఆధునిక సాంకేతికత ద్వారా మహిళల చిత్రాలను మార్ఫిడి చేయడం తీవ్రమైన నేరంగా పరిగణించబడుతోంది. అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌ల ద్వారా స్మార్ట్‌ఫోన్‌లను హ్యాక్ చేసి బ్లాక్ మెయిల్ చేయడం వల్ల మహిళలు మానసిక వేదనకు గురవుతున్నారు. డిజిటల్ భద్రత కోసం మహిళలు బలమైన పాస్‌వర్డ్‌లు, టూస్టెప్ వెరిఫికేషన్ వంటి జాగ్రత్తలు పాటించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మాటలు ఫుల్, చేతలు నిల్

కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కేంద్ర మంత్రులు ఎమ్‌పిలు, మాజీ ముఖ్యమంత్రులు జగన్‌మోహన్ రెడ్డి ఇలా వెళ్లి అలా వచ్చేశారు. వారి కేసుల్లో ఎటువంటి పురోగతి లేదు. ఇప్పటి వరకు శిక్షపడలేదు. అప్పట్లో అంతా హడావిడి చేసి ఏవేవో కుంభకోణాలు చేశారంటూ నానా రచ్చ చేసి ఇప్పుడు వారి ఊసే ఎత్తటం లేదు. దీంతో వారు నిజంగా అవినీతి పనులు చేసి కోట్ల రూపాయలు కూడా బెట్టారా లేక వారి ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రత్యర్థులు కుట్రచేశారా అనేది సంవత్సరాలు గడిచిపోతున్నా ఎవరికి తెలియడంలేదు. ఇప్పటికీ సస్పెన్స్ వీడటంలేదు. గత 12సంవత్సరాలుగా బిజెపి అధికారంలో ఉంది. దర్యాప్తు సంస్థలన్నీ ఆ పార్టీకి విధేయులాగా ఉంటాయి. వారు కనుసన్నల్లో పనిచేస్తుంటాయి. అయినా ఏమీ చేయడం లేదు. అవినీతిపరుల అంతు చూస్తామని చెబుతుందే కానీ ఆ పని చేయలేకపోతోంది.

- శాస్త్రి, హైదరాబాద్

## ఇది అన్యాయం, అప్రజాస్వామికం

కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా సమయంసందర్భం వచ్చినప్పుడు బిఆర్ఎస్‌పై ఎన్నో విమర్శలు చేస్తున్నారు. ఉప ఎన్నికలు వస్తే తాను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్టేషన్ ఘనాపూర్‌లో ఘనవిజయం సాధిస్తానని కడియం ఎన్నోసార్లు అన్నారు. దానం ఏకంగా కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశాడు. వారు పార్టీ ఫిరాయించారనటానికి ఇంతకన్నఆధారాలు ఏంకావాలి. అయినా స్పీకర్ పార్టీ ఫిరాయించలేదంటూ ఇద్దరు ఎమ్మెల్యేలకు క్లీన్‌చిట్ ఇచ్చారు. ఇది అన్యాయం అప్రజాస్వామికం.

- ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## గొప్ప ముందడుగు

కేంద్రం ఉపాధి హామీలో చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలి అనినిర్ణయించడం గొప్ప ముందు అడుగు. తెలంగాణ లాంటి రాష్ట్రానికి ఇది నిజంగా మంచి అడుగు. నీళ్లను ఆగబట్టి రైతులు ఎక్కడికక్కడ పంటలు వేసుకునేందుకు అవకాశం దొరుకుతుంది. ఇది పంటల వృద్ధికి చోదక శక్తి లాగ పనిచేస్తుంది. అంత మాత్రమేకాదు రైతులకోణంలో ఆలోచించినప్పుడు ఇది నిజమైన ఆస్తి లాగ పని చేస్తుంది. కేంద్రం కొత్తగా తలపెట్టిన స్కీమ్‌లో ఎలాగూ ఆస్తుల సృష్టే ప్రధానం అన్నారు కాబట్టి ఇది ఒక మంచి ఉదాహరణ కాగలదు. దీనివల్ల మరోక ఉపయోగం నీటిని వడిసి పట్టడం కూడా వీలు అవుతుంది. ఒక్కొక్క దానికి 6.50 లక్షల ఎస్టిమేషన్ ఇచ్చారు.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# బెజవాడలో రూ.2కోట్ల హవాలా సొమ్ము పట్టివేత

**-ఇద్దరు నిందితుల అరెస్ట్ -నేడు ఇన్‌కంటాక్స్ అధికారులకు స్వాధీనం చేయనున్న వైనం**

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** బెజవాడలో గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.2 కోట్ల హవాలా సొమ్ము మంగళవారం అర్ధరాత్రి బయటపడింది. గుణదల సిఐ తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్‌కు చెందిన బలవంత్‌సింగ్ సోలంకి,చోహాన్ అల్పేష్‌కుమార్‌లు గుజరాత్‌లో అమిత్ అనే సేట్ వద్ద పనిచేస్తున్నారు. ఆయన ఆదేశాల ప్రకారం మంగళవారం రాత్రి టాటా నెక్సాన్ కారులో విజయవాడ నగరానికి వచ్చారు. తిరిగి ఆ సేట్‌ను సంప్రదిస్తే ఆ రూ.2 కోట్ల హవాలా సొమ్ము ఎవరికివ్వాలో తెలియచేస్తాడని, ఆయన ఫోన్ కోసం వేచి చూస్తుండగా గుణదల ప్రాంతంలో గుణదల సిఐ వారి కారును పట్టుకుని తనిఖీ చేశారు. ఆ తనిఖీలో రూ.2 కోట్ల సొమ్ము బయటపడింది. దానికి సంబంధించి ఏ విధమైన పత్రాలు, కాని బిల్లులు కాని చూపించక పోవడంతో దానిని హవాలా సొమ్ము అని పోలీసులు నిగ్గు తేల్చారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. వీరిని నేడు ఇన్‌కంటాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన సేఠ్ అయిన గుజరాత్‌కు చెందిన అమిత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతను పట్టుబడితో ఈ కేసులో మరిన్ని వివరాలు దొరకవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# ద్విచక్ర వాహనం ఢీకొని ఇరువురికి గాయాలు

**కంచికచర్ల ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పట్టణంలో జుజ్జూర్ రోడ్‌లోని భావన థియేటర్ దాటిన తర్వాత ఫౌండరీల వద్ద వసంత కాలనీలో నుండి రోడ్డు దాటుతున్న వసంత కాలనీకి చెందినకొండా నాగేశ్వరావు అనే వ్యక్తిని జుజ్జూరువైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గాయాలు అయ్యాయి. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహన సంఘటన స్థలానికి చేరుకొని వాహన నడుపుతున్న వ్యక్తిని చికిత్స నిమ్తిం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని అదుపులోకి తీసుకొని చేసిన తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పోలీసు కమీషనరేట్ పరిధిలో సెక్షన్30 యాక్ట్ ఆమలు

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం నిషేధాజ్ఞలు అమలు చేయనున్నట్లు సిపి రాజశేఖరబాబు వెల్లడించారు. ప్రజా జీవనానికి,ప్రజలకు ఇబ్బందులు లేకుండా,శాంతి భద్రతలకు విఘాతం కల్గకుండా ఉండేందుకు,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సజావుగా శాంతి భద్రతలు పరిరక్షించడానికి పోలీస్ కమీషనర్,మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మెజిస్ట్రేట్ రాజశేఖరబాబు పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఈ నెల 10వ తేదీ నుండి జులై 9వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ ప్రకారం నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు.ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉన్న సమయంలో పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఎటువంటి సభలు,సమావేశాలు,ఊరేగింపులు,నిరసన,ధర్నా కార్యక్రమాలను పోలీసు వారి ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని, నిషేధాజ్ఞలు అతిక్రమించి నిర్వహిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# నిబంధనలు పాటించని ప్లాంట్ల పై కఠిన చర్యలు : కలెక్టర్ లక్ష్మీశ

## నీటి నాణ్యత విషయంలో రాజీపడేది లేదు

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** నిబంధనలు పాటించని ప్లాంట్లపై కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. బుధవారం ఆయన ముత్యాలంపాడు,సత్యన్నారాయణపురం,ఆర్‌వో ప్లాంట్లను



ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ప్లాంట్లకు నీరు ఎక్కడ నుండి వస్తుంది?అనుమతుల వివరాలు,ఉపయోగిస్తున్న సాంకేతిక పరికరాలు,పరిశుభ్రతా ప్రమాణాలు,నాణ్యత పరీక్షల వ్యవస్థ తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో జల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని నగరపాలక సంస్థ పరిదిలో ఆర్‌వో నీటి శుద్ధి ప్లాంట్లు,త్రాగునీటి సరఫరా వ్యవస్థల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని,నిరంతర పర్యవేక్షణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి త్రాగునీటి సరఫరా వ్యవస్థ నిర్దేశ ప్రమాణాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన,నాణ్యమైన త్రాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యమని,అన్ని ఆర్‌వో ప్లాంట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, షెడ్యూల్ వివరాలను ప్లాంట్ల వదద్ద ప్రదర్శించాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా నీటి నాణ్యతా ప్రమాణాలు,ఫిల్టరేషన విధానం,యంత్రాల పనితీరు,శుభ్రతా పరిస్థితులు,నిర్వహణా విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా నడుస్తున్న లేదా నిబంధనలు పాటించని ప్రమాణాలకు విరుద్దంగా పనిచేస్తున్న ఆర్‌వో ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేసవిలో త్రాగునీటి వినియోగం గణనీయంగా పెరుగుతున్నందున,ప్రజలు ఉపయోగించే నీటి నాణ్యతపై ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారులు,సిబ్బంది దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు కార్పొరేషన్ ఇన్‌ఛార్జి సీఈ పి.సత్యకుమారి,సిఎంహెచ్‌వో కె.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# పాషా మృతి వైకాపాకు తీరని లోటు

## - పలువురు మైనార్టీ నేతల నివాళులు

**ఎ కొండూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** వైసిపి అధినేత మాజీ సిఎం జగనన్నకు పార్టీ ఆవిర్భావం నుండి వీరాభిమానిగా ఉంటూ పార్టీ పటిష్ఠతకు అభివృద్ధికి కృషి చేస్తున్న నియోజక వైసిపి మైనార్టీ అధ్యక్షుడు జాకీర్ భాయ్ సోదరుడు మజహార్ పాషా-52 బుధవారం తిరువూరులో హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. మజహార్ పాషా మృతి నియోజకవర్గ మైనార్టీ వర్గాలకు పార్టీకి తీరని లోటని పలువురు వైసిపి నేతలు నివాళులర్పించారు. నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు జాకీర్ బాయ్‌తో పాటు పలువురు వైసిపి మైనార్టీ నేతలు మజహార్ పాషా మృతదేమాన్ని సందర్శించి నివాళులర్పించారు. సందర్శించి నివాళులర్పించారు. మజహార్‌పాషా కుటుంబానికి అల్లా మనోధైర్యం కల్పించాలని పలువురు దువా (వేడుకోలు) చేశారు.



# స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సమిష్టి కృషితో ముందుకు సాగాలి : కలెక్టర్ లక్ష్మీశ

## -సమిష్టిగా పనిచేసి ర్యాంకుల సాధనకు కృషి చేయాలి

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** స్వచ్ఛ సర్వేక్షన్‌లో సూపర్ స్వచ్ఛ లీగ్ అవార్డు నిలబెట్టుకోవడంలో క్షేత్రస్థాయిలో సిబ్బందిది ప్రధాన పాత్రని జిల్లా కలెక్టర్,మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వివిధ శాఖాధిపతులు,స్వర్ణ వార్డు సిబ్బందితో స్వచ్ఛ సర్వేక్షన్,సమ్మర్ యాక్షన్ ప్లాన్,సెన్సెస్‌పై జిల్లా కలెక్టర్ లక్ష్మీశా,మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్రల అధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ వేసవికి సమ్మర్ యాక్షన్ ప్లాన్ భాగంలో త్రాగునీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ,జనగణనలో భాగంగా ప్రతి ఒక్కరూ చురుగ్గా పాల్గొని దేశాభివృద్ధిలో తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్లు డాక్టర్ డి.చంద్రశేఖర్.ఎ.రవీంద్రరావు,చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్,చీఫ్ ఇంజనీర్ ఇన్చార్జి సత్యకుమారి, డిప్యూటీ కమీషనర్(రెవిన్యూ) జి.సృజన,జోనల్ కమీషనర్లు రమ్య కీర్తన,కె.ప్రభుదాస్,కె.షమ్మీ,ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




# ఎరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు హరితాన్ని పెంచండి : కమీషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** నగర అందాన్ని పెంచేలా విన్యూత్న అంశాలతో నూతన వాల్ పెయింటింగ్‌లు,పెరుగుతున్న ఉష్ణోగ్రతను తగ్గించేందుకు వాతావరణంలో కాలుష్యాన్ని నివారించేందుకు హరితాన్ని పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, భవానీపురం ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్ర స్థాయిలో పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అందాన్ని పెంచేలా, హరితాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షిం చేందుకు ప్రతి రోజు మొక్కలకు నీరు పోస్తుండాలని ఇప్పటి వరకు నాటిన మొక్కలను సురక్షితంగా చూసుకోవాలన్నారు. ఘాట్లలో పారిశుధ్య నిర్వహణ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె,శ్రీనివాస్,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ,సిబ్బంది పాల్గొన్నారు.



# 7గురు వ్యక్తులకు జైలు,జరిమానా

**గుంటూరు క్రైమ్,ఏప్రిల్8,ప్రభాతవార్త:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఏడుగురు వ్యక్తులకు 6వ న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు ట్రాఫిక్ డిఎస్పీ బెల్లం శ్రీనివాస్ పరియవేక్షణలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తమ సిబ్బందితో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేశారు. వారిని 6వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు.న్యాయ మూర్తి ఇరువురుకి ఏడురోజులు జైలు శిక్ష, ఐదుగురుకి ఒక్కకరికి 10,000 చప్పున జరిమానా విధించారు.

# తడిచెత్త,పొడిచెత్తను వేరుచేసి ఇవ్వండి

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

కంకిపాడు/మచిలీపట్నం ఏప్రిల్8,ప్రభాతవార్త : నెప్పల్లి గ్రామ ప్రజలు తమ ఇంటిలోని చెత్తను తడిచెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి గ్రామపంచాయతీకి అందజేయాలని చెత్తచెదారాలు పేరుకుపోకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు.బుధవారం



మధ్యాహ్నం జిల్లాకలెక్టర్ కంకిపాడు మండలంలోని నెప్పల్లి గ్రామంలో పర్యటించి చెత్త నుండి సంపద తయారీకేంద్రాన్ని పరిశీలించారు.గ్రామస్థులు అరుణ్‌ప్రసాద్,డాక్టర్ చంద్రమోహన్ తో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలోని చెత్తనంతటిని తీసుకువచ్చి చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద గత 15సంవత్సరాలుగా వేస్తున్నారని అక్కడ దుర్గంథం వెదజల్లి చాలా అధ్వాన్నంగా ఉండటంతో తాము ఎంతో శ్రమనోర్చి 4లక్షల రూపాయలు ఖర్చుచేసి అక్కడ ఉన్న చెత్త చెదారాన్ని అంతటిని పూర్తిగా తొలగించామని ఆ ప్రాంతంలో గ్రామ ప్రజలకు ఎంతో ఆహ్లాదకర వాతావరణం కలిగించే విధంగా పార్కును అభివృద్ధి పరచాలని మొక్కలు పెంచాలని అనుకుంటున్నామని ఆ ప్రాంతంలో చెత్త వేయకుండా చూడాలని తమకు అన్నివిథాలా సహకరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసారు.కలెక్టర్ స్పందిస్తూ ఏ గ్రామంలో చెత్త అక్కడే ఉండాలని వేరే గ్రామం తరలిస్తే అక్కడివారు అభ్యంతరాలు తెలుపుతారని స్పష్టం చేస్తూ ప్రజలు వారి ఇంటి నుండి చెత్తను గ్రామపంచాయతీకి ఇచ్చే సమయంలో ముందుగానే తడిచెత్తను,పొడిచెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు.తడిచెత్తను కాంపోస్టు ఎరువుగా తయారుచేసుకొని మొక్కలు పెంపకానికి వినియోగిస్తామన్నారు.పొడిచెత్తను తరలించేందుకు కొన్ని రోజులు ఆగాలని ఇబ్రహీంపట్నంలో ఘనవ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రం త్వరలో నెలకొల్పుతున్నారని అక్కడికి తరలించే ఏర్పాటు చేస్తామన్నారు.,గ్రామంలో శ్మశాన వాటికల నిర్మాణానికి గ్రామస్థులు ముందుకువస్తే ప్రభుత్వం తరపున అన్నివిథాల సహకారం అందిస్తామన్నారు.ఆఖరి మజిలీ స్మశానం బాగుండాలని ప్రహరీ,దహనవేదిక,కర్మలషెడ్డు,మొక్కల పెంపకం కుటుంబ సభ్యులను గౌరవంగా సాగనంపే విథానానికి స్థానిక ప్రజలు ముందుకువస్తే అన్నివిథాలా సహాయసహకారాలు అందిస్తామన్నారు.కలెక్టర్ వెంట కంకిపాడు తహశీల్దారు భావనారాయణ,డిఎల్‌పిఓ సంపత్‌కుమారి,కార్యదర్శి రాజశేఖర్,సచివాలయ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

# డంపింగ్‌యార్డుగా మారిన ఇబ్రహీంపట్నం జగదల్‌పూర్ ఎన్‌హెచ్

**ఎ కొండూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మైలవరం ఎ కొండూరు తిరువూరు మీదుగా జగదల్‌పూర్ వెళ్లే జాతీయ రహదారి-30 ఎ కొండూరు చీమలపాడు నుండి ఎ కొండూరు కంభంపాడు కాకర్ల లక్ష్మీపురం గ్రామాల్లో ఎన్‌హెచ్-30 రెండు మార్జిన్‌లు డంపింగ్ యార్డులుగా మారడంతో ప్రజలు ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ జాతీయ రహదారిపై రామచంద్రాపురం గ్రామంలో దశాబ్దకాలం క్రితం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన గృహాల తొలగింపులో అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. చీమలపాడు కృష్ణారావుపాలెం, ఎ కొండూరు క్రాస్ రోడ్డు, కంభంపాడు లక్ష్మీపురం కాకర్ల గ్రామాల్లో హైవే రెండు పక్కల మార్జిన్లలో వ్యర్థాలు పశు జంతు కళేబరాలు మృత్యువాతపడిన కుక్కలు కోతుల కళేబరాలతో దుర్గందం వెదజల్లుతూ ప్రయాణీకులు ముక్కుపుటాలు పగిలిపోతున్నా సంబంధిత హైవే అధికారులు గాని మైలవరం మరియు బాడవ టోల్‌ప్లాజా అధికారులు గాని ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని అందువల్ల హైవే అస్తవ్యస్త నిర్వాహణలో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఈ జాతీయ రహదారి-30పై డంపింగ్ యార్డులా మారిన రెండు పక్కల మార్జిన్లలో చెత్త ఇతర వ్యర్థాలను వెంటనే తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడి ఇబ్బందులు తొలగించి, ఆదుకోవాలని తిరువూరు నియోజకవర్గ ప్రజలు ప్రయాణీకులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.





# పరిశుభ్రతతో పాటు హరిత విస్తీర్ణం,టెర్రస్ గార్డెనింగ్‌పై దృష్టి పెట్టాలి : కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త :** పరిశుభ్రతతో పాటు హరిత విస్తీర్ణం,టెర్రస్ గార్డెనింగ్ పైనా దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన బుధవారం 30కు పైగా



రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు,టెర్రస్ గార్డెన్ అసోసియేన్ల ప్రతినిథులతో సమావేశం జరిగింది. మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర తో కలిసి స్వచ్ఛతలో నగర కీర్తి ప్రతిష్టలను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలు,ప్రణాళికల అమల్లో ఆర్‌డబ్ల్యూఏల భాగస్వామ్యంపై సమావేశంలో చర్చించారు. అసోసియేషన్ల ప్రతినిథుల సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ర్యాంకును కైవసం చేసుకోవడం కంటే ఆ ర్యాంకును సుస్థిరం చేసుకుంటూ ముందుకెళ్ళడం కష్టమని,చేయీ చేయీ కలిపితే లక్ష్యాల సాధన అసాధ్యమేమీ కాదని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడను దేశంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ భాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన నగరం అనేది ప్రభుత్వ భాధ్యతతో పాటు ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. ఇంటి స్థాయిలోనే తడి,పొడి చెత్తను వేరు చేయడం ద్వారా శుభ్రతకు పునాది వేయవచ్చన్నారు. ప్రజలు స్వచ్ఛతపై చైతన్యంతో వ్యవహరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రభుత్వ స్వచ్ఛతా కార్యక్రమాల అమలులో భాగస్వాములు కావాలన్నారు. అదేవిధంగా నగరంలో హరిత విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించంతో పాటు టెర్రస్ గార్డెనింగ్‌ను ప్రత్సోహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్యకర జీవనశైలిని స్వంతం చేసుకోవచ్చన్నారు. పార్కులు,పట్టణ ప్రజల శారీరక,మానసిక ఆరోగాయనికి ముఖ్య ఆధారాలని పేర్కొన్నారు.వాటి అభివృద్ధి,నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. కాలనీల్లో ఉన్న పార్కులను శుభ్రంగా,ఆకర్షణీయంగా ఉంచేందుకు అభివృద్ధికి ఆర్‌డబ్ల్యుఏలు చొరవ చూపాలని, నవ్య రాజధాని అమరావతికి గేట్‌వే అయిన విజయవాడ సమగ్రాభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలని కోరారు.

**వార్డు స్థాయిలోనూ అవగాహనా కార్యక్రమాలు : మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర**

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రజల భాగస్వామ్యంతో ఇప్పటికే మంచి ర్యాంకులు సాధించామని, 2025-26కు సంబంధించి కూడా ముందంజలో నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఇందుకు వార్డు స్థాయిలోనూ జన జాగృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవాడను గ్లోబల్ సిటీగా,హ్యాపీ సిటీగా తీర్చిదిద్దేందుకు సమిష్టి కృషి అవసరమని, ఇందులో భాగంగా భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.సమావేశంలో కార్పొరేషన అదనపు కమీషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్,చీఫ్ మెడికల్ హెల్త్ ఆపీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ ఇంజనీర్ పి.సత్యకుమారి,డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) జి.సృజన,డిప్యూటీ డైరెక్టర్(ఉద్యాన)చంద్రశేఖర్,రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ,టెర్రస్ గార్డెన్ అసోసియేషన్స్,ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# విధులో అంకితభావానికి ఎంపిడివో బొజ్జగానికి ప్రజల ప్రశంశలు

**ఎ కొండూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో ఎంపిడివో పనిచేస్తున్న బొజ్జగాని శ్రీనివాసరావు కింద స్థాయి వివిధ శాఖల అధికారులు ఎంపిపి ఎంపిటిసి వివిద పార్టీల ప్రజా ప్రతినిధుల సమన్వయంలో నిబద్దతతో విధి నిర్వాహణలో అంకితభావంలో సమన్వయంతో పనిచేస్తూ మండలాభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ మండల ప్రాంత ప్రజలకు ఎంపిడివో ప్రజలతో సత్సంబందాలు పెట్టుకొని వెంటనే ఫోన్‌లకు రెస్పాండ్ అయ్యి గ్రామ పంచాయతీల్లో ఏదైనా సమస్య వస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయడం గతంలో పనిచేసిన ఎండివో కంటే భిన్నంగా నిరాడంబరంగా అన్యోన్యంగా ఉంటూ పని చేయడం పట్ల మండల ప్రాంత ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల ప్రజలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రశంసించడం ఎంపిడివో విధి నిర్వాహణలో సేవాభావానికి నిదర్శనం గ్రామాల్లో స్థానిక సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెల 2 నుండి పూర్తవడంతో ఎంపిడివో తహసీల్దార్ ఇంకా ఇతర శాఖల అధికారులకు ప్రత్యేక అధికారుల బాధ్యతలు అప్పగించడంలో ఆయా గ్రామాల్లో 21 గ్రామ పంచాయతీల్లో నియమించిన ప్రత్యేక అధికారుల పనితీరును తిరువూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జిల్లా పశు సంవర్ధక శాఖ జెడి పర్యవేక్షిస్తూ ఇబ్బందులు సమస్యలు లేకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరారు.

# రాథాకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**పెనమలూరు ఏప్రిల్8 ,ప్రభాతవార్త :** వైయస్‌ఆర్‌సిపి నేతల భార్యలను కించపరుస్తూ రాథాకృష్ణ చేసిన వ్యాఖ్యలకు వైయస్‌ఆర్‌సిపి నేతలు తీవ్ర నిరసనలు తెలియజేసారు. ముస్తాబాద్ రోడ్‌లోని కార్యాలయం ముందు బుథవారం ఆందోళన ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు.కృష్ణాజిల్లా వైయస్‌ఆర్‌సిపి అధ్యక్షులు పేర్నినాని,ఎన్టీఆర్ జిల్లా వైయస్‌ఆర్‌సిపి అధ్యక్షులు దేవినేని అవినాష్,వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు,ఎమ్మెల్సీ లు,సమన్వయకర్తలు ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రతీకుటుంబాన్ని అవమానించారంటూ ఆందోళనలు చేసారు.ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ రోతపత్రిక రోతఛానెల్ అయిన రాథాకృష్ణ మహిళలను కించపరచాడని అన్నారు.ప్రజానీకానికి ఉపయోగపడే విథంగా మావిగన్‌ను జగన్ ప్రతిపాదించాడన్నారు.రాథాకృష్ణ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు.అమరావతిలో అవినీతికోసం చంద్రబాబు ప్రాకులాడుతున్నాడని ఎద్దేవా చేసారు. వైయస్‌ఆర్‌సిపిపార్టీ నేతల భార్యలను దుర్భాష లాడితే చంద్రబాబు,పవన్‌కళ్యాణ్,లోకేష్ ఏమి అయిపోయారని ప్రశ్నించారు.రాజకీయవిమర్శ పేరుతో మహిళలను అవమానించడం అంటే అది అత్యంత నీచమైన ప్రవర్తన అని వైయస్‌ఆర్‌సిపిని ఎదుర్కోలేక దిగజారుడు మాటలకు దిగుతున్నారని తెలిపారు.ఇది ఒక్క పార్టీని అవమానించడం కాదని ప్రతి కుటుంబాన్ని అవమానించడ మేనని మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం ప్రజాసమస్యలు అభివృద్ధి పాలన గురించి మాట్లాడే సామర్థ్యం లేక అవినీతి దోపిడీ నుంచి అమరావతి అవినీతి కోట నుంచి డైవర్ట్ చేయటానికి వ్యక్తిగత దూషణలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేసారు.పేర్నినాని మాట్లాడుతూ అమరావతి పేరుతో చేస్తున్న దోపిడీ చంద్రబాబు ఆపాలన్నారు.మచిలీపట్నం విజయవాడ గుంటూరు మధ్యప్రాంతాన్ని రాజథానిగా పెట్టాలి పేరు ఏది పెట్టినా ప్రాంతం ఇదే ఉండాలి గంజాయి పంట పండించే వ్యక్తి లాంటివాడు రాథాకృష్ణ అని గుర్తుచేసారు. వైయస్‌ఆర్‌సిపి నేతల భార్యల గురించి రాథాకృష్ణ నీచంగా మాట్లాడారని వాలంటీర్ల గురించి అప్పుడూ అసభ్యంగా మాట్లాడారన్నారు. మోదీగురించి నీచంగా మాట్లాడించి ఇప్పుడు పొగుడుతున్నారన్నారు. రెండేళ్ళు గడవకముందే నాలుగులక్షల కోట్లు అప్పుచేసారన్నారు.నీతులు చెపితే చాలదు వాటిని ఆచరించాలి అన్నారు.జగన్ మాట్లాడిన దానిలో తప్పుఏముంది రాష్ట్రప్రజలు అప్పులు పాలవకూడదు. నిజం చెప్పే ధైర్యం రాథాకృష్ణకి లేదన్నారు.పామర్రు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాథాకృష్ణ దిగజారుడు వ్యాఖ్యలని ఖండించారు.నీచరాతలపై శాంతియుత నిరసన తెలిపితే పార్టీకార్యాలయంపై దాడిగా చిత్రీకరించడం దారుణమని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబు, లోకేశ్ రాథాకృష్ణ వ్యాఖ్యలను సమర్థించడం సిగ్గుచేటని విమర్శించారు.



# అల్యూమినా నాణ్యతకు రుసాల్ న్యూరల్ నెట్‌వర్క్

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారులలో ఒకటైన రుసాల్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ కణాల భాగాలను నియంత్రించడానికి ఒక యాజమాన్య న్యూరల్ నెట్‌వర్క్‌ఆధారిత సాంకేతికతను అమలు చేస్తూ బాక్సైట్ ఖనిజం నుండి అల్యూమినియం ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేసే బహుళదశల ప్రక్రియలో వియోగంలో ఏర్పడే మధ్యంతర పదార్థం తుది నాణ్యమైన అల్యూమినా వియోగ బ్యాటరీలో బాక్సైట్ ప్రాసెసింగ్ నుండి లభించిన అల్యూమినేట్‌క్షార ద్రావణం వియోగం చెంది, అల్యూమినియం హైడ్రాక్సైడ్‌ను అవక్షేపిస్తుంది. ఈ హైడ్రాక్సైడ్‌ను ఈ చక్రం యొక్క చివరి దశలో అల్యూమినాను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తారు.

# స్కోడా ఆటో ఇండియా రికార్డు స్థాయి విక్రయాలు

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** స్కోడా ఆటో ఇండియా 2026 తొలి త్రైమాసిక జనవరి-మార్చి కాలంలో 20,028 కార్లను విక్రయించి తన చరిత్రలోనే అత్యధిక త్రైమాసిక అమ్మకాలను నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో విక్రయించిన 17,138 యూనిట్లతో పోలిస్తే 17 శాతం వృద్ధిని సాధించింది.2025లో సాధించిన రికార్డు స్థాయి వార్షిక విక్రయాల జోరును ఈ ఏడాదిలోనూ కొనసాగిస్తున్న సంస్థ, భారత మార్కెట్లో తన స్థిరమైన పురోగతిని మరింత బలపరుచుకుంటూ కైలాక్ మోడల్‌కు పెరుగుతున్న డిమాండ్ కుషాక్ తాజా వెర్షన్ స్లావియా అలాగే ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో కోడియాక్‌లకు గణనీయ ఆదరణతో స్కోడా ఆటో ఇండియా తన స్వంత రికార్డులను తానే అధిగమిస్తూ భారత ఆటోమొబైల్ మార్కెట్లో బలమైన స్థానంలో ముందుకు సాగుతోంది.

# ప్రజలు చీత్కరించినా వైకాపాకి బుద్ధి రాలేదు

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే విధ్వంసంతో మొదలు పెట్టిందని, అందుకే ప్రజలు చీత్కరించి తరిమికొట్టినా వారి తీరు మారకపోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నేతల తీరు మార్చుకోకపోవడం, అదే పంథాలో అసత య ప్రచారాలు, అసత్య వీడియోలతో కూటమిపై బురద చల్లడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. పొన్నూరులో జరిగిన సంఘటనలో వంశీ అనే యువకుడిపై అనేక కేసులు పోలీస్ స్టేషన్‌లో నమోదు అయ్యాయన్నారు. దేవరకొండ గోపిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అనేక కేసులు నమోదు అయినట్లు చెప్పారు. కానీ నేడు అలాంటివారిపై కూటమి ప్రభుత్వం కేసులు నమోద చేశారని అనడం చూస్తే మతి ఉండి మట్లాడుతున్నారా..? అనిపిస్తుందన్నారు. మద్యం సేవిస్తూ జరిగిన దాడిలో రాజకీయ రంగు పులిమి కూటమి నేతలపై బురదజల్లడానికి అనేక ప్రచారాలు చేస్తున్నారన్నారు. కులాల ప్రస్తావన లేకుండా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వైసీపి నేతలు చూడడం చూస్తే ఏమి చేయాలో అర్థం కావడం లేదన్నారు. ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌పై దాడి చేయడానికి వస్తే ఊరుకుంటామా, మాకు రాజకీయాలు ఎన్నికల వరకే కానీ అస్తిత్వం కాపాడుకోవడం కోసం వైకాపా నేతలు ఇలాంటి రౌడీ షీటర్ల కోసం రావడం తగునా..?అని ప్రశ్నించారు.మనుగడ కోల్పోతున్నామనే సమయంలోనే వైకాపా నేతలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల అభివృద్ధి కోసం మాత్రమే పనిచేస్తామన్నారు. వైకాపా నేతలు పరిధి దాటి ప్రవర్తించినా చట్టాలు వాటి పని అవి చేసుకుంటూ పోతాయన్నారు.వైకాపా హయాంలో టిడిపి నేతలపై అనేక కేసులు నమోదు చేశారన్నారు. గుడికి వెళ్ళినా, బడికి వెళ్ళినా, బయట కనపడినా కేసులు నమోదు చేశారన్న సంగతి గుర్తు తెచ్చుకోవాలనా న్నరు. గతంలో మీడియా వారిపై రాజద్రోహం కేసులు నమోదు చేసిన సంగతి గుర్తు చేశారు.మీడియా కార్యాలయాలపై, మీడియా వారిపై దాడులు చేసే సంస్కృతి వైసీపి నాటి నుండి నేటి వరకు మానుకోలేదన్నారు. వైకాపా మానస పుత్రిక సాక్షిలో అనేక మందిపై తప్పుడు రాతలు వ్రాసి సీబిఐ కేసుల వరకు వెళ్ళిన సంగతి మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. భౌతిక దాడులకు దిగడానికి ఎవరైనా వెళితే వైకాపా నాయకులు నోరుంది కదా అని అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని, తగిన శాస్తి చేస్తామని హెచ్చరించారు. చిన్న చిన్న సంఘటనలు సైతం రాజకీయ రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని అంబటి మురళీకృష్ణ చూస్తున్నారన్నారు. వైకాపా నేతలు 2.0,4.0 అంటూ ఏదో ప్రజలను తప్పుదారి పట్టించడానికి మాత్రమే మాట్లాడుతున్నారన్నారు. వైకాపా నేతలు గంజాయి వ్యాపారం చేసి డబ్బులు సంపాదించుకుంటే టీడీపి అధికారంలోకి రాగానే గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. వైకాపా వాళ్ళుఅడ్డుకున్నాం, అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ చెప్పుకొంటున్నారు. మేము భయం అనేది తెలియని కుటుంబం నుంచి వచ్చానని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ స్పష్టం చేశారు. సిద్దాంతాలకు కట్టుబడి పనిచేసేవాళ్ళం, కానీ గొడవలకు దిగడం మా నైజం కాదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు ముక్కల ఆట ఆడారు. నేడు మావిగన్ అని అనడం చూస్తే వీళ్ళకి ఏమీ మాట్లాడాలో తెలియక పిచ్చి పిచ్చి ప్రకటనలు చేస్తున్నారన్నారు.



# దివ్యాంగుల సంక్షేమానికి రోటరీ సంస్థ కట్టుబడి ఉంది

## - రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సోమవరపు రాంప్రసాద్

**పొన్నూరు, ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు రోటరీ సంస్థ కూడా దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సోమవరపు రాంప్రసాద్ అన్నారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వికలాంగులకు మూడుచక్రాల బండ్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సోమవరపు రాంప్రసాద్ మాట్లాడుతూ రోటరీ విద్యా, వైద్య రంగాలలో విశిష్టమైన సేవలను అందిస్తుందన్నారు. గతంలో పోలియో మహమ్మారిని అంతం చేసేందుకు అవిశ్రాంతంగా తమ సేవలను అందించిందన్నారు. వికలాంగుల కోసం మంగళగిరి ప్రాంతంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రిహాబిలిటేషన్ హాస్పిటల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.రోటరీక్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. పొన్నూరులో నూతనంగా నిర్మాణం చేస్తున్న రోటరీక్లబ్ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న షటిల్ టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, అధ్యక్ష, కార్యదర్శులు గుప్తా, యాసం వీరయ్య, మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేష్‌దేవ్, అసిస్టెంట్ గవర్నర్ ఇవి పూర్ణచంద్, రోటరీక్లబ్ సీనియర్ సభ్యులు పి.రవీంద్రనాథ్, బీవి చౌదరి, ఎస్ రమేష్, నారాయణం మేఘనాథ్, నన్నపనేని బాలకృష్ణ, బి.రామారావు, జానీబాషా, కొత్తమాసు రామకృష్ణ, జి.రాధాకృష్ణ, నరేష్ తదితరులున్నారు.



# విద్యార్థులు మంచి నైపుణ్యాలు కలిగి ఉండాలి

## -డాక్టర్ ఎన్ రమణయ్య

**చేబ్రోలు(పొన్నూరు), ఏప్రిల్ 8,ప్రభాతవార్త:** నేటి ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు పోటీలో నిలవాలంటే తప్పని సరిగా మంచి నైపుణ్యాలను కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ హెచ్ఈఆర్ఎంసీఈ అకడమిక్ మెంబర్ డాక్టర్ ఎన్.రమణయ్య సూచించారు. మండల కేంద్రమైన ఆర్వీఐటీలో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించాలంటే మంచి నైపుణ్యాలతోపాటు విలువలను కూడా కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు ఎక్కువ పుస్తకాలను చదవడం ద్వారా జ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చన్నారు. అనంతరం ఆర్వీఐటిలో ఎంసిఏ, ఎంటెక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు అందుకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్వీ కృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మల్లికార్జున, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి.దినేష్‌బాబు, ఎంసిఏ విభాగాధిపతి డాక్టర్ బి.శ్రీనివాస రామానుజన్, సీఈఓ డాక్టర్ కె.వి.లక్ష్మి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# సమస్యలు ఉంటే చెప్పండి పరిష్కరించుకోండి

## -ఎంపీడీవో విజయలక్ష్మి

**కొల్లిపర,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** సచివాలయంలో సమస్యలు ఉన్నట్లయితే వాటిని తన దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు.బుధవారం మండల కేంద్రం కొల్లిపర సచివాలయాలను తనిఖీ నిర్వహించి సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించి బాధ్యతాయుతంగా పనిచేయాల న్నారు. మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. సచివాలయం సిబ్బంది ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా ఉత్తమ సేవలు అందించాలన్నారు.



# ఎస్‌ఆర్‌ఎం స్టూడెంట్ కౌన్సిల్ నూతన అధ్యక్షునిగా రాకేశ్

## -విద్యార్థుల పక్షాన సమన్వయకర్తగా నందన్ చౌదరి -202627 సంవత్సరానికి నూతన కౌన్సిల్ ఎంపిక

**మంగళగిరి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా శెట్టిపల్లి రాకేశ్ ఎంపికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ గా వేదాంశ్. ప్రధాన కార్యదర్శిగా కొమ్ముపల్లి సాత్విక్, కోశాధికారిగా హర్షితారెడ్డిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం ఉదయం అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో జరిగిన పాత కౌన్సిల్ వీడ్కోలు కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య చెట్లపల్లి సతీష్ కుమార్ నూతన కమిటీని ప్రకటించారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నేరుగా వైస్ ఛాన్సలర్ దృష్టిలో పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేసే సమన్వయకర్తగా నందన్ చౌదరిని వీసీ సతీష్ కుమార్ స్వయంగా ఎంపిక చేశారు. ఏడాది కాలం పాటు వీరు స్టూడెంట్ కౌన్సిల్ వ్యవహారాలను, వివిధ స్టూడెంట్స్ క్లబ్స్ కార్యకలాపాలను పర్యవేక్షి స్తుంటారని వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి హోదాల్లో బాధ్యతల్ని నిర్వర్తించిన విద్యార్థి సంఘ నాయకులు నివేదా శ్రీరామ్, రిషబ్ రంజన్, సాయి నితిన్ రెడ్డి తదితర కోర్ కమిటీ సభ్యులతో పాటు వివిధ క్లబ్ ల కార్యవర్గ సభ్యులందరికీ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వీరికి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

**నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలి : వీసీ**

చదువుతో పాటు విద్యార్థులు సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని, యూనివర్సిటీ అభివృద్ధికి సహకారం అందించాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. నివేదా శ్రీరామ్ టీమ్ లోని ప్రతి ఒక్కరూ బాగా పనిచేశారనీ, క్లిష్ట సమయంలోనూ మంచి సహకారాన్ని అందించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రెజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూర్, విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్ సింగ్ నారంగ్, అసోసియేట్ డైరెక్టర్ రేవతి పాల్గొన్నారు.



# ఓబీసీల ప్రధాన డిమాండ్లు పరిష్కరించేందుకు కృషి చేయాలి : కేసన శంకరరావు

**మంగళగిరి ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** దేశాభివృద్ధికి ఏమాత్రం దోహదపడని సంఘ పరివార్ ఏజెండాని అమలు పరచడమే కాదని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం ఓబీసీల ప్రధాన డిమాండ్లు పరిష్కరించేందుకు కూడా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. బుధవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గత అనేక దశాబ్దాలుగా ఓబీసీలు పోరాడుతున్న జనాభా దామాషా మేరకు చట్టసభలలో ఓబీసీల రిజర్వేషన్ల కోసం, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు సబ్ కోటా కోసం, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖసబ్ ప్లాన్‌ప్రత్యేక బడ్జెట్ కేటాయింపుల కోసం, రక్షణ చట్టం వంటి ఎంతో ప్రాధాన్యత గల డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోకుండా మోనవహించడం బిజెపి పార్టీకి ప్రభుత్వాధినేత నరేంద్ర మోడీకి తగదన్నారు. బిజెపి పార్టీ దాని అనుబంధ సంఘాలలో ఓబీసీ నాయకులు కార్యకర్తలు ఎంతోమంది ఉండి కూడా తమ వర్గ ప్రయోజనాలపై మోనం వహించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో విధించిన ఎమర్జెన్సీ సందర్భంగా బిజెపి నాయకులు, కార్యకర్తలపై జరిగిన అణచివేత చర్యల గురించి మహాసభలో చెప్పడం మంచిదేనని,అదే సందర్భంలో ఈనాటికీ దేశవ్యాప్తంగా అణగారిన వర్గాలపై ముఖ్యంగా ఓబీసీలపై జరుగుతున్న అణచివేతపీడనదోపిడీల గురించివీరికి రక్షణ చట్టం ఏర్పాటు గురించి ఎందుకు పట్టించుకోవడం లేదో ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. తను ఓబీసీ నంటూనే ఓబీసీల సమస్యల పరిష్కారానికి ప్రధాని నరేంద్ర మోడీ ఏ మాత్రం చొరవ చూపకపోవడానికి కారణాలేంటో అర్థం కావడం లేదన్నారు.ఆనాడు పార్లమెంటులో యాదవత్రయం లాలూములాయం శరద్ లు లేవనెత్తిన ప్రధాన డిమాండ్ మహిళా రిజర్వేషన్ల బిల్లులో ఓబీసీ మహిళకు సబ్ కోటా కేటాయించాలని నిలదీసిన విషయం నేటి ఓబిసి ప్రధానికి తెలియదా అన్నారు.ఇంకా మిగిలి ఉన్న సంఘ పరివార్ లక్ష్యాలైన జమిలి ఎన్నికలు ఉమ్మడి పౌరసత్వాల ఏర్పాటు గురించిన శ్రద్ధలో ఇసుమంతైనా ఓబీసీల డిమాండ్ల పరిష్కారంలో చూపకపోవడాన్ని ఓబీసీ సమాజం గర్హిస్తుందని శంకరరావు అన్నారు.



# మంత్రి లోకేష్ చొరవతో దుగ్గిరాల మండలానికి అభివృద్ధి బాట

## రూ.2.88 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**దుగ్గిరాల,ఏప్రిల్8,(ప్రభాతవార్త):** దుగ్గిరాల మండలం అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో పెదపాలెం–పెదకొండూరు– గొడవర్రు గ్రామాల మధ్య రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.రూ.2.88 కోట్ల నాబార్డ్ నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు పెదకొండూరు సచివాలయం వద్ద ఘనంగా బుధవారం శంకుస్థాపన నిర్వహించారు.ఈ రహదారి పెదపాలెం అడ్డరోడ్డు వద్ద నుంచి ప్రారంభమై, పెదకొండూరు మీదుగా గొడవర్రు కరకట్ట వరకు నిర్మించబడనుంది. దీని ద్వారా స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరం అవుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపిస్తున్నారని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధికి కూడా తోడ్పడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి,మండల టీడీపీ అధ్యక్షులు కేసంనేని శ్రీ అనిత, మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు,మండల బీజేపీ అధ్యక్షులు అడపా వెంకటరావు,ఎంపీటీసీ పుతుంబాక సాయికృష్ణ, ఎంపీటీసీ విశ్వనాథపల్లి శివకుమార్,నాయకులు పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఏళ్ల జయలక్ష్మి, కోరిటాల సురేష్, జెముడుగాని భుజంగరావు, సురగాని రవికిషోర్,మొలబంటి ధనుంజయరావు,కుంపటి వెంకటరత్నం,కొండూరి నరసింహ,తోట పిచ్చయ్య, నంబూరి యాకోబు,హరికృష్ణ రెడ్డి, కాబోతు దేవదాసు,జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు హేమంత్,చిలువూరి శేషగిరి, చిలువూరి యేసుపాదం, వాసుబాబు,సురేష్ అధికారులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జిల్లా మలేరియా అధికారి రాజు నాయక్‌కు పౌరసన్మానం

## తెనాలి సహాయ మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్8(ప్రభాతవార్త):** ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి ధరావత్ రాజు నాయక్‌ను తెనాలి సహాయ మలేరియా అధికారి కార్యాలయము పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం నందు మలేరియా మరియు ఫైలేరియా సిబ్బంది ఆధ్వర్యంలో, ధరావత్ రాజు నాయక్ గుంటూరు జిల్లా సహాయ మలేరియా అధికారిగా పనిచేసి ఉద్యోగున్నతిపై గుంటూరు పట్టణం బయాలజిస్టుగాను,ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి గాను ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా, పౌరసన్మానం ఏర్పాటు చేసినట్లు,సహాయ మలేరియాఅధికారి చిరసాని ప్రభాకరరెడ్డి తెలిపారు. ధరావత్ రాజు నాయక్ గుంటూరు జిల్లా మలేరియా అధికారి వారి కార్యాలయంలో విశేషమైనమైన సేవలు అందించారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు .అనంతరము మలేరియా సబ్ యూనిట్ అధికారులు వంగల పున్నారెడ్డి ,శ్రీకంఠ ఉమాకాంత్ , పట్టణ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమోళి ,ఫైలేరియా యూనిట్ సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ రవికుమార్ వారిని శాలువాతో పూలమాలతో సత్కరించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ,భవిష్యత్లో గుంటూరు జిల్లాకి వారి విలువైన సలహాలను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్స్ దీపాల శ్రీనివాసరావు,బండారు మల్లేశ్వరరావు,దాసరి శివ నాగమల్లేశ్వరరావు, ఫైలేరియా సూపర్వైజర్ తిరువీధుల శివరామ ప్రసాద్, విశ్రాంత సూపర్వైజర్స్ కుర్రా రామారావు,ముక్కాల వీరయ్య,నీలా ప్రసన్నబాబు,హెల్త్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రముఖ ఆయుర్వేద వైద్యులు సత్యన్నారాయణమూర్తికి

# దేశీయ ఉత్తమ వైద్య అవార్డు ప్రధానం

**తెనాలి టౌన్ ఏప్రిల్8(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం రామలింగేశ్వర పేట కు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జూటూరి సత్యనారాయణమూర్తి కి "దేశీయ ఉత్తమ వైద్య" అవార్డును ప్రధానం చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు లోని రెవిన్యూ కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో, గుంటూరు తూర్పు శాసనసభ్యులు నసీర్ అహ్మద్,తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడి.జనార్ధన్ చేతుల మీదుగా సత్యనారాయణమూర్తి ని ఘనంగా సన్మానించారు. తెనాలి పట్టణంలో గత నాలుగు దశాబ్దాలుగా దేశీయ ఆయుర్వేద రంగంలో విశేష సేవలందిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో చేసిన నిస్వార్థ సేవకు మరియు దేశీయ వైద్య విధానాలను ప్రజల్లో ప్రాచుర్యం చేస్తూ అనేకమంది రోగులకు ఉపశమనం కలిగిస్తూ వైద్య సేవలను ధర్మంగా భావించి నిరంతరం కృషి చేస్తున్న వైద్య శ్రీ జూటూరి సత్యనారాయణమూర్తి ని ఈ సందర్భంగా సన్మానించుకోవడం గొప్ప విషయమని,అంతేకాకుండా సేవాభావము వైద్యంలో నైపుణ్యత మరియు సంఘ అభివృద్ధికి డాక్టర్ సత్యనారాయణమూర్తి చేస్తున్న అమూల్యమైన సేవలను గౌరవిస్తూ వారికి దేశీయ ఉత్తమ వైద్య అవార్డును ప్రధానం చేయటం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.ఆయుర్వేదవైద్య వ్యాప్తికి ఇతోధికంగా తోడ్పడుతున్నందుకు డాక్టర్ సత్యనారాయణమూర్తి కి శ్రీ ధన్వంతరి భగవానుడు శతాయురారోగ్యం, ఐశ్వర్య ఆరోగ్య సంపదలను ఇచ్చి రక్షించాలని, కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆయుర్వేద వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.



## న్యాయవాది హత్యకు నిరసనగా

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**తెనాలి టౌన్ ఏప్రిల్8(ప్రభాతవార్త):** బుధవారం తెనాలి కోర్టు ప్రాంగణం నందు న్యాయవాదులు విధులు బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన న్యాయవాది ఎల్లయ్యను దుండగులు అతికిరాతకంగా హత్య చేయడాన్ని వారు ఈ సందర్భంగా తీవ్రంగా ఖండించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాద రక్షణచట్టాల్ని తీసుకురావాలని అలాగే న్యాయవాదుల మీద జరిగేటువంటి దాడులను ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా విచారించాలని, త్వరితగతిన నిందితులని శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా న్యాయవాదుల మిద జరిగే దాడులను,ప్రజలు,మేధావి వర్గాలు ఖండించాలని, న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని, చనిపోయిన న్యాయవాది కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే నిందితుని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని,ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీ శంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు,రాతంశెట్టి సుబ్బారావు,షేక్ కరీమున్, మధిర సురేష్ కుమార్,ఆర్. వెంకటేశ్వరావు, గ్రంధి జయరామకృష్ణ, స్టాలిన్, షేక్ షంషాద్ బాషా,రవికృష్ణ, వెంకటేశ్వరరావు,చందు మోహన్ గాంధీ, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం,పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



# పట్టణంలో మున్సిపల్ కమీషనర్ విస్తృత పర్యటన

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్8,(ప్రభాతవార్త):** మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడు బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని 1,2,4,6 వార్డుల్లో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతను గమనించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్య పనులు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ప్రజలు ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే పారిశుద్ధ్య సిబ్బందికి తడి చెత్త పొడి చెత్త విడివిడిగా అందించాలని సిబ్బందికి సహకరించి స్వచ్ఛ తెనాలికి తమ వంతు కృషిని చేయాలని కమిషనర్ కోరారు. కమిషనర్ వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె శ్రీనివాసరావు,అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## హోదా పెంచారు..జీతం తగ్గించారు..

# కుటుంబాన్ని ఎలా నడపాలి...

## వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేసిన కార్యదర్శులు

**కొల్లిపర,ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** పంచాయతీల్లో కష్టపడుతున్నాం..ప్రభుత్వం నిభంధనలు ప్రకారం నడుచుకుంటున్నాం..ఇంటిపన్నులు నూరుశాతం వసూళ్ళు చేసాం..హోదా పెంచారు..అంతవరకు బాగానే ఉంది..కానీ కార్యదర్శులకు జీతం తగ్గించారు..పెరిగిన ఖర్చులతో కుటుంబాన్ని ఎలా నడపాలని మండల గ్రామాల్లో కార్యదర్శులు ఆవేదనకు గురయ్యారు.దీనిపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కలసుకుని సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తయారు చేసి ఎంపీడీవో విజయలక్ష్మికి అందజేసారు.వినతి పత్రం అందించిన వారిలో బద్దిగం మాధవి,అడపాల నాగేశ్వరరావు,కూరపాటి ఉషా,కె.హరిబాబు,మోర్ల జగదీష్,ఆరిమండ లక్ష్మీ,కల్లెంపూడి లక్ష్మీ,సురేష్ తదితరులు ఉన్నారు.



# వైకుంఠపురం దేవస్థాన దుకాణాలకు లీజు హక్కుల వేలం

**తెనాలి మున్సిపాలిటీ ఏప్రిల్8(ప్రభాతవార్త):** తెనాలి పట్టణం వైకుంఠపురం లో వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో,2026 ఏప్రిల్ 8 నుండి 2028 మార్చి 31 వరకు రెండు సంవత్సరాల కాలపరిమితికి, ఫ్యాన్సీ బొమ్మలు అమ్ముకొనుటకు,పార్కింగ్ ఫీజు వసూలు చేసుకొనుటకు,క్యాటరింగ్,గ్యాస్ పొయ్యిల నిర్వహణ, పాదరక్షలు భద్రపరచుటకు,కూల్ డ్రింక్స్ అమ్ముకొనుటానికి లీజు హక్కులను,ఈటెండరు,సీల్డ్ టెండర్ ద్వారా బహిరంగ వేలం నిర్వహించారు. అనంతరం హెచ్చు పాట ద్వారా లీజు హక్కులు స్వాధీనం చేసుకున్న పాటదారులు,నేటి నుండి వారి వ్యాపారాలు నిర్వహించుకోవచ్చునని, ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ తెలియజేశారు.

## ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఖిపోషణ్ పక్వాడఖికార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ

**తెనాలి టౌన్ ఏప్రిల్8(ప్రభాతవార్త):** ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌తెనాలి, పరిధిలో ఏప్రిల్ 9 నుంచి 23వ తారీకు వరకు జరిగే పోషణ్ పక్వాడ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లు, తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో, ఇంచార్జి సబ్ కలెక్టర్ ఏ. లక్ష్మీకుమారి,ఆవిష్కరించారు ఇందులో తల్లి మరియు శిశుపోషణ,ఎప్పుట్టినప్పటి నుండి మూడు సంవత్సరాల వయసులో మెదడు అభివృద్ధి గురించి, ఆట ఆధారిత విద్య గురించి, స్క్రీన్ టైమ్ తగ్గించడంలో తల్లిదండ్రులు మరియు సమాజం పాత్ర గురించి,బలమైన అంగన్వాడీల కోసం సమాజం మద్దతు సమీకరించడం, ఈ విషయాల గురించి సమాజంలో ఉన్న ప్రజలందరికీ అవగాహన కల్పించటమే ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమని సబ్ కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ సబ్ కలెక్టర్ ఏ.లక్ష్మి కుమారి,మహిళా శిశు సంక్షేమ శాఖ పీడి పీజీబీ. ప్రసూన,మండల తాహశీల్దార్ కె వి గోపాలకృష్ణ, సిడిపిఓలు,పి..విజయ గౌరీ, అరుణ,డాక్టర్ శారద,సూపర్వైజర్ కే. సౌజన్యశ్రీ, ఓఎస్సీ సెంటర్ లాయర్ ఏ.విజయలక్ష్మి, పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు వరం : ఎమ్మెల్యే రామాంజనేయులు

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు వరంలాంటిదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని



కాకుమాను, ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాలు మరియు గుంటూరు డివిజన్లోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయాన్ని చెక్కులు తన చేతుల మీదుగా అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..వివిధ ఆరోగ్య సమస్యలతో సాయం కోసం దరఖాస్తు చేసుకున్న పది మందికి గాను రూ.23,74,897లు, 72 ఈ నెంబర్స్ మెంట్ చెక్కులకు గాను రూ.41,05,691 లక్షల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను 25 సార్లు లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. ఆకస్మిక అనారోగ్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు రూ.పది కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించామన్నారు. ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కిన గౌరవమని వివరించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 169 మంది లబ్ధిదారులకు ఎల్ఓసి చెక్కులకు గాను రూ.3,87,36,274 కోట్లు, 721 మంది రియంబర్స్మెంట్ చెక్కులకు గాను రూ.6,09, 47,147కోట్ల చెక్కులను అందజేశా మని పేర్కొన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. చెక్కులు పొందిన లబ్ధిదారులందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, స్థానిక శాసనసభ్యులు రామాంజనేయులుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మర్రి సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు గోగినేని కళ్యాణ్ చక్రవర్తి, నియోజకవర్గ మీడియా సెల్ ప్రతినిధి గింజపల్లి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నార్నె బాబు, టిడిపి సీనియర్ నేత గొట్టిముక్కల సుబ్బారావు, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, గుంటూరు రూరల్ మండలం అధ్యక్షులు, కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా మనోభావాల్ని దెబ్బతీస్తే సహించం : వైకాపా సమన్వయకర్త బలసాని

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త : వైఎస్సార్ సీపీ మనోభావాల్ని దెబ్బతీసేలా, మహిళలను కించపరిచేలా వార్తలు రాస్తే క్షమించేది లేదని, దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ హెచ్చరించారు. గుంటూరు బ్రాడీపేట శంకర్ విలాస్ సెంటర్ వద్ద గల ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ కార్యాలయం



వద్ద జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో బలసాని పాల్గొన్నారు. కార్యాలయం ఎదుట వైసీపీ శ్రేణుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొని, పరిస్థితి వేడెక్కింది. వైసిపి మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, ఓ మాజీ ఎంపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసనలో బలసాని పాల్గొని మాట్లాడుతూ.. మహిళలపై అవమానకరమైన వ్యాఖ్యలు ప్రచురించారని ఆరోపిస్తూ ఆంధ్రజ్యోతి పత్రికపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. అలాగే వైసిపి పార్టీ మనోభావాలు దెబ్బతినే విధంగా వార్తలు ప్రశ్నించడంతో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రాజధాని అమరావతి కుట్రలను ఆధారాలతో చూపిస్తే అసత్య వార్తలు ప్రచురించడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తంచేశారు. అమరావతి రాజధాని విషయంలో చంద్రబాబు వ్యవహరిస్తున్నారు తీరును ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. మావిగాన్ తో రాజధాని వైభవం కనిపిస్తుందని తెలియజేశారు. ఇప్పటికైనా యాజమాన్యం అసత్య వార్తలు రాయడం విరమించుకోవాలని హెచ్చరించారు. అనంతరం మహిళలను గౌరవించాలని, అసత్య వార్తలు ఆపాలంటూ బిగ్గరగా నినాదాలు చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్ మండలాల నుండి నిరసనకారులు పెద్దసంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసారు. అయినప్పటికీ ఆందోళనకారులు కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనలు కొనసాగించారు. నిరసనకారులతో తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు నిరసనకారులను పంపించే చర్యలు చేపట్టడంతో పరిస్థితి క్రమంగా అదుపులోకి వచ్చింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి వైసీపీ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు ఆధునీకరణ పనులు పూర్తి చేయాలి : సిపిఎం డిమాండ్

పెదనందిపాడు ఏప్రిల్ 8 (ప్రభాతవార్త) గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించేందుకు వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని, నల్లమడ వాగు ఆధునీకరణ, ఏర్పడిన గండ్లను వెంటనే పూడ్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పెదనందిపాడు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పెదనందిపాడు పరిసర ప్రాంతాల ప్రజలు 85 సంవత్సరాలుగా త్రాగునీరు, సాగునీరు కోసం నిరంతరం పోరాడుతున్నారని తెలిపారు. సిపిఎం పార్టీ, రైతు సంఘాల ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాల నుంచి ఆందోళనలు జరుపుతూనే ఉన్నామని చెప్పారు. ఈ ప్రాంతం కరువులు, వరదలకు ప్రసిద్ధన్నారు. పూర్తిగా వర్షాధారంగా రైతులు పంటలు పండిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు ఛానల్ పొడిగిస్తామని హామీలు అయితే ఇచ్చారు కానీ, అమల్లోకి రాలేదన్నారు. 2018 వ సంవత్సరంలో టిడిపి ప్రభుత్వం గుంటూరు ఛానల్ పొడిగింపునకు పరిపాలన అనుమతులు మంజూరు చేశారని 378 కోట్లు మంజూరు చేస్తూ జి.వో ఇచ్చారని తెలిపారు. 2019 సంవత్సరం లో వైసిపి ప్రభుత్వం వచ్చాక పనులు ముందుకు సాగలేదన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని రెండు సంవత్సరాల కాలం ముగుస్తున్నా పనులు ప్రారంభం కాలేదు అన్నారు. తక్షణమే భూ సేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభించి, 50 గ్రామాల ప్రజల త్రాగు, 50 వేల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చాలని కోరారు. భూసేకరణ పూర్తి చేసి రైతులకు డబ్బులు వెంటనే జమ చేయకపోతే కేటాయించిన నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా నల్లమడ వాగు వరదల కారణంగా ఆరు నియోజకవర్గాల పరిధిలో వేలాది ఎకరాలు మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం పోరాటాల ఫలితంగా నల్లమడ వాగు సామర్థ్యాన్ని 300 సి కు పెంచారని గుర్తు చేశారు. 2013 నుండి 2016 సంవత్సరాల మధ్యలో వచ్చిన భారీ వరదల వల్ల ఈ సామర్థం చాలని పరిస్థితి నెలకొంది అన్నారు. కమిటీల నివేదికల ప్రకారం నల్లమడ వాగు సామర్థం 500 సి వాల్యూ కు పెంచాలని నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు 2016 లో కాకుమానులో జరిగిన బహిరంగ సభలో వాగు సామర్థం పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. గత సంవత్సరం వరదల కారణంగా ఏర్పడిన వాగు గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని డిమాండ్ చేశారు. మార్కు ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు



కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 2,400 రూపాయలు ఉన్నా ప్రైవేటు వ్యాపారస్తులు 1,500 నుండి 1,700 లోపు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులు క్వింటాలుకు 800 రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనగ మద్దతు రేటు 5,875 రూపాయలు ప్రకటించారని, బహిరంగ మార్కెట్లో 5,000 రూపాయలు లోపు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మార్కు ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాలు 20 శాతం లోపు శనగల కొనుగోలు చేయకముందే మూసివేశారని చెప్పారు. రైతుల వద్ద ఉన్న శనగ పంట మొత్తం కొనుగోలు చేయాలని కోరారు. సిపిఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ వంటి ఇతర ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు అందజేయాలని కోరారు. కౌలు రైతులు సమస్యల పరిష్కారం కోసం 9 తేదీ గురువారం పెదకాకాని లో జరిగే కౌలు రైతుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, పి. భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల విక్రయాలు ఈపాస్ మిషన్ ద్వారానే జరగాలి : వ్యవసాయ ఏడిఏ మోహన్‌రావు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు), ఏప్రిల్ 8, ప్రభాతవార్త : ఎరువుల విక్రయాలు తప్పనిసరిగా ఈపాస్ మిషన్ ద్వారా ఆధార్ ప్రామాణికరణతో జరగాలని గుంటూరు వ్యవసాయశాఖ ఏడిఏ ఎన్.మోహన్ రావు తెలిపారు. ప్రత్తిపాడు మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లతో సమీక్ష సమావేశం



నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడిఏ మోహన్ రావు పాల్గొని మాట్లాడుతూ. చెల్లుబాటులో ఉన్న రిటైల్ /హోల్ సేల్ లైసెన్స్ దుకాణంలో అందరికీ కనిపించేలా ఉండాలని, దుకాణం బయట బోర్డుపై డీలర్ పేరు, లైసెన్స్ నెంబర్ స్పష్టంగా ఉండాలని సూచించారు. ధరల పట్టికలో ప్రతిరోజు స్టాకు వివరాలు రైతులకు కనిపించేలా ప్రదర్శించాలని తెలియజేశారు. ఎరువుల విక్రయాలు ఆధార్ అనుసంధానంతో ఈపాస్ మిషన్ ద్వారానే జరగాలని, రైతులకు ఒరిజినల్ బిల్లు ఇవ్వాలని, రైతు సంతకం /వేలిముద్ర తీసుకోవాలని, ఎంఆర్పి కంటే ఎక్కువ ధరకు అమ్మరాదని వెల్లడించారు. దుకాణంలో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతు సంబంధిత బిల్లు అడగకపోయినా తప్పనిసరిగా అతని బిల్లు ఇవ్వాలని తెలిపారు. ఎరువులు, విత్తనాల స్టాక్ మరియు నిల్వలు లైసెన్స్‌లో పేర్కొన్న అధికారిక గోదాముల్లో మాత్రమే నిల్వ చేయాలని, అనుమతిలేని ప్రదేశాల్లో నిల్వ చేయడం నేరమని ఉద్ఘాటించారు. తనిఖీ సమయంలో ఫిజికల్ స్టాక్, ఈ పాస్ స్టాక్, రిజిస్టర్ స్టాక్ సమానంగా ఉండాలని, తేడాలు ఉంటే స్టాక్ సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. స్టాక్ నివేదికలు ప్రతివారం మండల వ్యవసాయ అధికారి, మరియు ఏడిఏ కార్యాలయాలకు సమర్పించాలన్నారు. ఈ పాస్ డేటా, రిజిస్టర్లు, గోదాం నిల్వలు సమానంగా ఉండాలని తెలిపారు. రైతులకు మార్గదర్శకాలతో పాటు సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నేల పరీక్షలు ప్రోత్సహించి, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా రైతులకు తగు సూచనలు అందించాలని చెప్పారు. ఎరువుల డీలర్స్ 2026/27 ఖరీఫ్ సీజన్లో యూరియా మరియు డిఏపి ఎరువులను రైతు పట్టాదారు పాస్ పుస్తకాన్ని పరిశీలించి, నకలు కాపీ తీసుకొని విస్తీర్ణము, విడతల వారీగా ఇవ్వవలని సూచించారు. నిషేధిత ఎరువులు, తగ్గింగ్ నిషేధం యూరియా/కాంప్లెక్స్ ఎరువులతో పాటు అవసరంలేని బయోప్రొడక్ట్ లు, మైక్రోన్యూట్రియెంట్లు, బలవంతంగా అమ్మరాదన్నారు. బ్లాక్ మార్కెటింగ్, హోర్డింగ్ పూర్తిగా నిషేధమని, అనుమతి లేని గోదాముల్లో నిల్వ చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన డీలర్ల లైసెన్స్ రద్దు, స్టాక్ సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల ఉల్లంఘనపై ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, 1955 మరియు ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్, 1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, పెదనందిపాడు మండల వ్యవసాయాధికారులు షేక్.సుగుణబేగం, చందవోలు సునీత, ఐ.సుబ్రహ్మణ్యం, మూడు మండలాల డీలర్లు పాల్గొన్నారు.

# కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు మంగళగిరి శాఖ నూతన ప్రాంగణం ప్రారంభం

గుంటూరు,ఏప్రిల్8,ప్రభాతవార్త : ఖతాదారులకు మరింత చేరువగా వినూత్న సేవలందించేందుకు గాను ప్రస్తుతం గుంటూరు జిల్లా గౌతమ్ బుద్ద రోడ్డు,జాతీయ రహదారి ప్రక్కనున్న తమ మంగళగిరి శాఖను తెనాలి రోడ్డు, నారాయణ కళాశాల ప్రక్కన ఏర్పాటు చేయడమైనది ది కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. జాతీయరహదారి ప్రక్కన,మొదటి అంతస్తులో ఉండడం వలన ఖాతాదారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రౌండ్ ఫ్లోర్‌కు శాఖను మార్చడం జరిగిందన్నారు. మంగళగిరిలో తమ శాఖను ప్రారంభించినప్పటి నుంచి సుమారు రూ.22కోట్ల వ్యాపారాన్ని చేసిందన్నారు. కోఆపరేటివ్ బ్యాంకింగు రంగంలోనే అధునాతన,సాంకేతిక పరిజ్ఞానంతో ఖాతాదారులకు సత్వర



సేవలందిస్తున్నామని,వారి ఆదరణతో రాష్ట్రంలో 11జిల్లాలో 38 శాఖలను ఏర్పాటు చేసుకున్నామని,రానున్న రోజుల్లో వినుకొండ శాఖతో పాటు మరిన్ని శాఖలను ప్రారంభించనాన్నామని ఖాతాదారులకు సద్వినియోగం చేసుకుని,బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ముఖ్యకార్యనిర్వాహణాధికారి కె.శ్యామ్‌కిషోర్,రీజనల్ మేనేజరు జాస్తి మురళి,మంగళగిరి శాఖ మేనేజరు మమత,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# పల్నాడులో తల్లీ కూతుళ్ళ ఆత్మహత్య

గుంటూరు ఏప్రిల్ 8, ప్రభాతవార్త ప్రతినిధి: పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలో తల్లీకూతుళ్ళ ఆత్మహత్య కలకలం రేపింది. ఓ మహిళ తన మూడేళ్ళ కూతురును నడుముకు కట్టుకొని మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామ సమీపంలోని నాగార్జున సాగర్ కుడి కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తల్లీకూతుళ్ళను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే వారు మృతి చెందారు. స్థానిక విజయపురిసౌత్ పోలీసు స్టేషన్ ఎస్సై అశోక్ తెలిసిన వివరాల ప్రకారం 23 ఏళ్ల ఆరే అమరేశ్వరి అనే మహిళ తన భర్త వెంకట శివతో కలిసి మాచర్ల పట్టణంలో నివాసం వుంటుంది. వీరికి లతిక శ్రీ అనే మూడేళ్ళ కూతురుతో పాటు మరో చిన్న పాప కూడా వుంది. అయితే చిన్న పాప రెండు నెలల క్రితం అనారోగ్యం కారణంతో మృతి చెందింది. అప్పటి నుండి తీవ్ర మనోవ్యధకు గురైన అమరేశ్వరి తన పాప లేని జీవితం తనకు వద్దంటూ.. తన పాప దగ్గరికి వెళ్లిపోతాను అంటూ చెబుతుండేది. ఈ క్రమంలో అమరేశ్వరి మానసిక పరిస్థితిని అర్థం చేసుకున్న కుటుంబ సభ్యులు ఆమె ఇంటినుండి బయటకు వెళ్లకుండా కాపలా వుండేవారు. అయితే మంగళవారం స్థానికంగా అమ్మవారి తిరునాళ్ళు జరగడంతో అమరేశ్వరి తిరునాళ్ళకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని క్షేమంగా ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో కూతురు చనిపోయిన





బాధను అమరేశ్వరి మరిచిపోయిందని భావించిన కుటుంబ సభ్యులు ఆమెను ఒంటరిగా వదిలి ఎవరి పనులను వారు వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించిన అమరేశ్వరి తన మరో కూతురు లతిక శ్రీని తీసుకొని వెళ్లి సాగర్ కుడి కాల్వలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. అమరేశ్వరి తండ్రి మారెబోయిన పెద మదార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

# యార్డులో అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా వుండాలి

## గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ కుర్రా అప్పారావు

గుంటూరు ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి : వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గుంటూరు మిర్చి యార్డ్‌లో బీడీ, సిగరెట్, మట్టు వంటి అగ్ని సంబంధిత



పదార్థాల వినియోగాన్ని కఠినంగా నిషేధించినట్లు యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు తెలిపారు. బుధవారం మిర్చి యార్డ్ లో వున్న ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఫైర్ ఇంజిన్ వసతులు, అగ్నిమాపక పరికరాల పనితీరును సమీక్షించారు. అవసరమైన చోట తగిన సూచనలు చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మిర్చి యార్డ్‌కు వచ్చే వ్యాపారులు, రైతులు, కార్మికులు అందరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిషేధిత పదార్థాలను ఉపయోగించకూడదని ఆయన సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మిర్చి సరుకు సురక్షితంగా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని యార్డ్ నిర్వహణ పూర్తిగా భద్రతా ప్రమాణాల ప్రకారం కొనసాగుతుందని చైర్మన్ స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ సహకరించి యార్డ్‌ను సురక్షితంగా ఉంచాలని అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చైర్మన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మిర్చి యార్డ్ డైరెక్టర్లు, ఎడిఎం సత్యనారాయణ చౌదరి, గ్రేడ్ 1 సెక్రటరీ సుబ్రహ్మణ్యం , డి ఈ నారాయణ, జిల్లా ఫైర్ అధికారి ఎం. శ్రీనివాస రెడ్డి ,అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లాలాపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

గుంటూరు క్రైమ్,ఏప్రిల్8,ప్రభాతవార్త: గుంటూరు నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సందర్శించి,సాధారణ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పనితీరు,రికార్డులు,భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గుంటూరు నగరంలో క్రైమ్ పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ చట్టం శాంతి భద్రత సమస్యలను పరిశీలిస్తూ,ఎక్కడ నేరాలు జరుగుతున్నాయి,ముఖ్యంగా క్రైమ్ స్పాట్స్ ఏవో గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే డ్రగ్స్,గంజాయి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి,హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తిస్తున్నామని తెలిపారు. ఇటీవల గుంటూరు పోలీసులు డ్రగ్ పెడ్లింగ్ గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నారని,గత ఆరు నెలల్లో సుమారు 300 మందిని గంజాయి ఇతర డ్రగ్ కార్యకలాపాలలో పాల్గొన్నందుకు గుర్తించామని వెల్లడించారు. యువతను మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు పాఠశాలలు,కళాశాలల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,ఈ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు. అదేవిధంగా,పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ



షీటర్లు,సస్పెక్ట్ షీటర్లపై కఠిన నిఘా ఉంచి,వారి కదలికలను పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. నేరాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఈస్ట్ డిఎస్పీ అబ్దుల్ అజీజ్,ట్రాఫిక్ డిఎస్పీ బెల్లం శ్రీనివాస్,లాలాపేట సీఐ శివప్రసాద్,కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు..

# నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థినికి జాతీయ స్థాయి గౌరవం



మంగళగిరి,ఏప్రిల్ 8, ప్రభాతవార్త : మంగళగిరిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో బి ఫార్మసీ ఆఖరి సంవత్సరం చదువుతున్న జాతీయ సేవా పథకం విద్యార్థిని జి. స్నేహ జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచి అరుదైన గౌరవాన్ని అందుకుంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన మై భారత్ బడ్జెట్ క్వెస్ట్ కార్యక్రమంలో 12 లక్షలకుపైగా పాల్గొన్న వారిలో జి. స్నేహ ఫైనల్ రౌండ్‌కు ఎంపిక కావడం విశేషం. ఈ ఫైనల్ రౌండ్‌లో భాగంగా భారత ప్రధానమంత్రి తో జాతీయ స్థాయి వర్చువల్ సంభాషణలో పాల్గొనే అవకాశం ఆమెకు లభించింది. ఈ కార్యక్రమం ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించబడనుంది. ఈ విజయంతో స్నేహ తన ప్రతిభ, విశ్లేషణా సామర్థం, దేశ అభివృద్ధికి సంబంధించిన తన ఆలోచనలను జాతీయ వేదికపై వ్యక్త పరచనుంది ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డా. బి. పాముల రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. నరేష్ బాబు రేఖా, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను అభినందించారు.

# మానవీయ సంబంధాలే సంతోషానికి కొలమానం : పి4 చైర్మన్ చెరుకూరి కుటుంబరావు

తాడేపల్లి,ఏప్రిల్ 8,ప్రభాతవార్త : సమాజంలో శరవేగంగా వస్తున్న మార్పులు మానవుడి జీవన పద్ధతిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. రోజు రోజుకి మనిషిలో కారణం తెలియని అసంతృప్తి పెరిగిపోతుంది. దీనికి ఒక



కారణం మనుషుల మధ్య అన్ని విషయాల్లో సంపద,ధనసంపాదన, విద్య,ఉద్యోగం ఇలా అనేక అంశాల్లో తీవ్రమవుతున్న అసమానతలే అన్నారు. పి-4చైర్మన్ చెరుకూరి కుటుంబరావు,కెఎల్ యూనివర్సిటీలో బిఏ (ఐఏఎస్) విభాగం ఆధ్వర్యంలో జిడిపి-హాపీనెస్ అనే అంశంపై ప్రారంభమైన రెండురోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతోష సూచికలను పరిశీలించినప్పుడు మనదేశం 116వ స్థానంలో ఉందని,కానీ పాకిస్థాన్ 104వ స్థానంలోనూ,ప్రస్తుతం యుద్ధంతో అల్లాడుతున్న ఇరాన్ వంటి దేశాలు 97వ స్థానంలోను మనకన్నా ముందు స్థానంలో ఉన్నాయి. దీన్ని బట్టి సంతోషాన్ని అంచనా వేసి కొలమానాలు అన్ని దేశాలకు,అందరూ మనుషులకు ఒకే రకంగా వుండవు. సంతోషానికి ప్రస్తుతం ఉన్న కొలమానాలు అంత శాస్త్రీయాలు అనలేము. ప్రపంచ సంతోష సూచికల్లో మొదటి 5స్థానాల్లో ఫిన్లాండ్,డెన్మార్క్,ఐర్లాండ్,స్వీడన్,నెదర్లాండ్ వంటి దేశాల జనాభా మనదేశంలోని ఒక ప్రధాన రాష్ట్ర జనాభా అంత ఉండదు. కానీ 140కోట్ల జనాభా కలిగిన అతిపెద్ద దేశమైన భారతదేశ సంతోష సూచికను లెక్కించడం అంత సులువు కాదు. దేశమంటే మట్టికాదు-దేశమంటే మనుషులు కాబట్టి మనుషులందరూ ఉత్తమ,ఉన్నత,అనుకూలమైన మానవ సంబంధాలను కలిగి ఉన్నప్పుడే మాత్రమే సంతోష భారతం సాధ్యమవుతుందన్నారు. కీలకోపన్యాసం చేసిన సెంటర్ ఫర్ ఫీల్డ్ లెర్నింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆల్క ఫరిఖ్ మాట్లాడుతూ సంపద మాత్రమే సంతోషానికి కారణం కాదన్నారు. అంతర్జాతీయ హాపి ప్లానెట్ ఇండెక్స్‌ను వివరిస్తూ ఈ ఫార్ములాపై చాలా విమర్శలు వున్నాయన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కెఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ మాట్లాడుతూ సమాజంలో అసహనం పెరిగిపోవడానికి కారణం మనుషుల్లో సంతోషం లేకపోవడమే అన్నారు. వర్సిటీ ఎంహెచ్ఎస్ విభాగం డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం బిఏ(ఐఏఎస్) ఆధ్వర్యంలో వర్తమాన సమాజానికి అవసరమైన ఇలాంటి అనేక సదస్సులు జరగాలని ఆకాంక్షించారు. బిఏ (ఐఏఎస్) విభాగాధిపతి,సదస్సు ఛైర్‌పర్సన్ డాక్టర్ కె.అనిల్‌కుమార్ సదస్సు లక్ష్యాన్ని వివరిస్తూ సంతోషమే సగం బలం అనే సామెత సంతోషం యొక్క ప్రాధాన్యతను వివరిస్తుందన్నారు. కార్యక్రమానికి ప్రాయోజకులుగా వ్యవహరించిన మార్స్ 2 ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ దాసరి సుబ్బారావును,అతిధులను నిర్వాహకులు దుశ్శాలువా,జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ డాక్టర్ అలిఖ్ బెనర్జి వందన సమర్పణ చేశారు.

# జీసికేవిఎన్ డిగ్రీ కళాశాలలో ఏఐ పై శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానము

గుంటూరు విద్య ఏప్రిల్ 7 ప్రభాతవార్త : గుంటూరు స్థానిక సంగడిగుంట లోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న మంగళవారము తృతీయ సంవత్సరము బీ.ఎస్సీ., బీ.కాం., మరియు బీ.సీ.ఏ., విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి డిజిటల్ మార్కెటింగ్ పై గత మూడు నెలలుగా ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమము ముగింపు మరియు సర్టిఫికెట్స్ పంపిణీ జరిగినది. ఈ కార్యక్రమమునకు జి.సి.కే. వీ. ఎన్. డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ అధ్యక్షత వహించగా, బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు ముఖ్య అతిథిగా విచ్చేసినారు. బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నేడు ప్రపంచంలో శరవేగంగా అనేక మార్పులు జరుగుతున్నాయని, ఇట్టి మార్పులకు ప్రధాన కారణం ఐ.టీ. రంగంలో వస్తున్న సమూల మార్పులే అని అన్నారు. నేడు ఐ.టి. మరియు డిజిటల్ మార్కెటింగ్ లు ప్రపంచాన్ని శాసిస్తున్నాయని అన్నారు. గతంలో కంప్యూటర్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనేది కేవలం ఉన్నత చదువులు చదివిన వారికి మాత్రమే అందుబాటులో ఉండేదని, నేడది ప్రాథమిక స్థాయి అనగా ఎల్. కే. జి. చదువుతోనే ప్రారంభమవుతున్నదని అన్నారు. మనము ఇక్కడ ఉండి ప్రపంచంలోని ఏ ప్రదేశంతోనైనా సంబంధాలను క్షణాలలో కలిగి ఉండడానికి దోహదపడుతుందని అన్నారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ నేడు ప్రపంచంలోని అన్ని లావాదేవీలు కూడా కరెన్సీ తో నిమిత్తం లేకుండా డిజిటల్ రూపంలోనే జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతము మీకు ఇవ్వబడిన ట్రైనింగ్ బిజినెస్ ట్రెండ్ కి ఏ. ఐ. సాఫ్ట్వేర్ ని ఎలా ఉపయోగించాలి, ఎలా డెవలప్ చేసుకోవాలి అనేది ఎంతో విలువైన శిక్షణ అని, దీనిని బయట ట్రైనింగ్ సెంటర్స్ లో నైనట్లయితే వేల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, కానీ కాలేజీ కమిటీ వారు ఖర్చుకు వెనుతీయకుండా విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా చూడాలనే సదుద్దేశంతో ఉచితంగా ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులు శిక్షణా కాలములో తాము పొందిన అనుభవాలను



తెలియజేశారు. బీ.కాం., విద్యార్థి నాగ సాయి మాట్లాడుతూ డిగ్రీ అనంతరము మా కాళ్లపై మేము నిలబడడానికి దోహదపడే ప్రోగ్రాం ఏ.ఐ. ని ఉపయోగించి డిజిటల్ మార్కెటింగ్ పై శిక్షణ ఇప్పించిన కళాశాల కమిటీ వారికి, మరియు ప్రిన్సిపల్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. చివరిగా కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని వాటన్నిటిని ఉపయోగించుకుని జీవితములో స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ జయ ప్రకాష్, ఎన్.ఎస్.ఎస్. అధికారులు ఏ. శ్రీధర్, వై. చంద్రశేఖర్, అధ్యాపకులు రాజేశ్వరి, ఇందిర, హరిలాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవాడలో లులుమాల్‌కు స్థలం కేటాయింపు రద్దు

**విజయవాడ, ఏప్రిల్ 8 (ప్రభాతవార్త) :** విజయవాడలో ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ మాల్ కు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్లు, బుధవారం హైకోర్టులో ప్రభుత్వం తరఫున ఏజీ రాతపూర్వకంగా తెలిపారు. లులు కి భూముల కేటాయింపును వ్యతిరేకిస్తూ పార్లమెంటు మాజీ సభ్యులు, రైతు నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు హైకోర్టులో పిల్ వేయగా, ఈ కేసులో ప్రభుత్వం భూ కేటాయింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు రాతపూర్వకంగా కోర్టుకు తెలిపింది. విజయవాడలోని ఆర్టీసీ పాత బస్టాండ్ లోని 400 కోట్ల రూపాయల విలువైన 4.17 ఎకరాలను భూమిని లులు మాల్ నిర్మాణం కొరకు 99 సంవత్సరాలు లీజుకిస్తూ 2025, జూలై 5వ తేదీన ప్రభుత్వం జి.ఒ.నెం. 137 నెంబర్ జీవో విడుదల చేసింది. చదరపు అడుగు కు రూ 1.50 పైసలు చొప్పున కారు చౌకగా 2,32,000 చదరపు అడుగుల మూడంతస్తుల భవన నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం జీవోలో పేర్కొంది. 25 దేశాలలో 66 వేల కోట్ల రూపాయల టర్నోవర్ తో నడిపే నడిచే లులు ఇంటర్నేషనల్ అనే బడా బహుళ జాతి సంస్థకు ప్రభుత్వ స్థలాలను కట్టబెట్టడం తగదని నగరంలో పలు ప్రజా సంఘాలు వ్యతిరేకించాయి. వామపక్షాలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రముఖులు ఐక్య ఉద్యమాలను సాగించారు. పౌరవేదిక ఏర్పడి ఉద్యమాన్ని ఐక్యంగా కొనసాగించారు. ఆర్టీసీ సంస్థను నాశనం చేస్తూ, మరోవైపు చిన్న, మధ్య తరగతి వ్యాపారాలను దెబ్బతీసే విధంగా నగరం నడిబొడ్డున ఉన్న ఈ స్థలాన్ని బడా కంపెనీకి కేటాయించడం అక్రమం అని ప్రజలంతా ఐక్యంగా వ్యతిరేకించారు. ఒకవైపున ప్రజా ఉద్యమం, మరొకవైపున న్యాయపోరాటంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు, ఎట్టకేలకు హైకోర్టులో భూ కేటాయింపును ఉపసంహరిస్తూ రాతపూర్వకంగా తెలిపింది.

**ఇది ప్రజాపోరాట విజయం : సిపిఎం నేత బాబురావు**

లులు కంపెనీకి ఆర్టీసీ స్థలం కేటాయింపు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ప్రజాపోరాట విజయమని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు అన్నారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, కార్పొరేట్లకు భూముల పందారంపై ఉద్యమం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# సిఎం పర్యటనతో వాహనాల దారిమళ్ళింపు

**రేపల్లె, ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం భట్టి ప్రోలు మండలంలోని సూరేపల్లికి వస్తున్న సందర్భంగా వాహనాల దారిమళ్ళింపు చర్యలు చేపడుతున్నట్లు రేపల్లె డిఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు.బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు భట్టి ప్రోలు శివారులోని వేమవరం జంక్షన్ వద్ద ఎన్‌హెచ్-216ఎ మార్గం ద్వారా వాహనాలను దారిమళ్లిస్తున్నామని తెలిపారు.రేపల్లె వైపు నుండి పల్లెకోన మీదుగా కోనేటిపురం వైపుకు వచ్చే వాహనాలను పడమటిపాలెం జంక్షన్ రహదారి నుండి జిల్లేపల్లి,పెద్దవరం మీదుగా కనగాల వద్ద ఎన్‌హెచ్ 216ఎ మార్గంలో దారిమళ్లిస్తున్నామని చెప్పారు.వాహన చోదకులు,ప్రజలు ఈ మార్పును గమనించాలని డిఎస్పీ శ్రీనివాసరావు కోరారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన పూర్తయ్యాక ఆయా మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరిస్తామని ఆయన వెల్లడించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట నిఘా

**డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**
**విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు**
**భట్టిప్రోలులో పోలీస్ సిబ్బందికి భారీ బ్రీఫింగ్**

**బాపట్ల, ఏప్రిల్ 8, ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెంచామని జిల్లా ఎస్పీ శ్రీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ గురువారం వేమూరు నియోజకవర్గం





భట్టిప్రోలు మండలం సురేపల్లి గ్రామంలో నిర్వహించనున్న పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం భట్టిప్రోలు మార్కెట్ యార్డ్‌లో బందోబస్తుకు వచ్చే పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.

**మ్యాప్‌తో విడమరిచిన ఎస్పీ..**

బ్రీఫింగ్ సందర్భంగా ఎస్పీ మ్యాప్‌ను ప్రదర్శిస్తూ సెక్టార్ల వారీగా సిబ్బందికి కేటాయించిన బాధ్యతలను వివరించారు. ముఖ్యంగా హెలిప్యాడ్, ప్రజా వేదిక, ఫీల్డ్ విజిట్ ప్రదేశాలతో పాటు కాన్వాయ్ ప్రయాణించే మార్గాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్ల వద్ద ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. బీడీ టీమ్స్ ద్వారా ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే అనుమతించాలన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిఘాఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ కీ పాయింట్ల వద్ద నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి డ్రోన్ విజువల్స్, సీసీ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తాం. అక్కడి నుంచి అందే సూచనల మేరకు క్షేత్రస్థాయి సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు.

**సమయపాలన తప్పనిసరి...**

విధుల నిర్వహణలో సమయపాలన పాటించాలని, డ్యూటీ పాస్‌పోర్ట్‌లో సూచించిన ప్రదేశాల్లోనే అధికారులు అందుబాటులో ఉండాలని ఎస్పీ ఆదేశించారు. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహించినా లేదా గైర్హాజరైనా శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సత్య బాబు, రేపల్లె డిఎస్పీ ఏ.శ్రీనివాసరావు, బాపట్ల డిఎస్పీ పి.జగదీష్ నాయక్, చీరాల డిఎస్పీ ఎండి.మోయిన్ మరియు ఇతర పోలీసు అధికారులు, భారీ సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లెళ్ళమూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంను ఆకస్మిక తనిఖీ చేసిన డి.డి.వో

**బాపట్ల,ఏప్రిల్8, ప్రభాతవార్త ప్రతినిధి:** బాపట్ల మండలంలోని జిల్లెళ్ళమూడి గ్రామ పంచాయతీలో ఉన్న ఖిచెత్త నుండి సంపదఖి తయారీ కేంద్రాన్ని బాపట్ల డి.డి.వో సిహెచ్. విజయలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె షెడ్డు నిర్వహణ తీరును పరిశీలించారు.

అసంతృప్తి వ్యక్తం చేసిన డి.డి.వోషెడ్డు నిర్వహణ పూర్తిస్థాయిలో జరగడం లేదని గమనించిన ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి షెడ్డుకు అవసరమైన నీరు, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని, వర్మీ కంపోస్టు తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శి గాయత్రిని ఆదేశించారు. దాతల సహకారంతో గతంలో ఏర్పాటు చేసిన రోటో కంపోస్ట్ మిషన్‌ను నిరుపయోగంగా వదలకుండా, వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ ఎరువు తయారు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. అభివృద్ధిపై గ్రామ పెద్దలతో చర్చనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్థానిక గ్రామ పెద్దలతో భేటీ అయ్యారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, అభివృద్ధి పనుల్లో అందరూ



సహకరించాలని ఆమె కోరారు. అనంతరం చెరువు స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని సందర్శించి, ఏకీకృత కుటుంబ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు పద్ధతిగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి.డి.వోతో పాటు జిల్లెళ్ళమూడి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి, బాపట్ల మండల స్వర్ణ గ్రామ అధికారి పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు

# ప్రజా సమస్యల తోరణం

**-అభివృద్ధికి నిధుల ప్రకటనపైనే అందరి చూపు**

**-సమస్యల నివేదనకు ప్రజా సంఘాల సమాయత్తం**

**రేపల్లె-ప్రభాతవార్త**

వేమూరు నియోజకవర్గంలోని భట్టి ప్రోలు మండలం సూరేపల్లిలో గురువారం పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ప్రజా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.కనీసం రూ.100 కోట్లు నిధులు సాధించుకుంటేనే వేమూరు నియోజకవర్గం అభివృద్ధి నెరవేరుతుందని ఏ మేరకు చంద్రబాబు నాయుడు స్పందిస్తారోనని అధికార పక్షం ఆలోచన చేస్తోంది.నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళాలని స్థానిక శాసన సభ్యుడు నక్కా ఆనందబాబు పార్టీ శ్రేణులతో నిర్వహించిన పలు సమావేశాలలో నిర్ణయించారు.ఈ మేరకు పార్టీ శ్రేణుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కార్మిక,ప్రజా సంఘాలు సైతం సిఎం దృష్టికి సమస్యలను తీసుకువెళ్ళేందుకు సమాయత్తమవుతున్నాయి.దాదాపు 5 గంటల సేపు సూరేపల్లిలో ప్రజలకు అందుబాటులో ముఖ్యమంత్రి ఉంటున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కార మయ్యేలా ప్రయత్నాలకు పూనుకుంటున్నారు. వేమూరు నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో రహదారుల అభివృద్ధి నెరవేరాల్సి ఉంది.





తెనాలి-రేపల్లె,తెనాలి- బాపట్ల,తెనాలి-పొన్నూరు, తెనాలి-చెరుకుపల్లి ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో పెదరావూరు-కూచిపూడి మధ్య రహదారి ప్రాణ సంకటంగా మారింది.వేమూరు నియోజకవర్గంలోని మూల్పూరు,పెరవలి,చావలి,కోడిపర్రు,భట్టి ప్రోలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు.సంవత్సరాల తరబడి రహదారి అధ్వాన్నస్థితిలో ఉంది.చుండూరు, అమృతలూరు మండలంలోని రహదారులు అభివృద్ధిని కోరుకుంటున్నాయి.తెనాలి నుండి రెండు కాల్వల మధ్యగా ముందుకు సాగిన రహదారి మార్గానికి యుద్ధప్రాతిపదికన సైడ్ రివిట్మెంట్స్‌తో సహా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.పెనుమూడి-ఒలేరు,పెనుమూడి-విజయవాడ కరకట్ట రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది.తెనాలి మీదుగా కాకుండా తక్కువ సమయంలో విజయవాడకు చేరుకునే రహదారి మార్గం ప్రమాదకరంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.216-ఎ జాతీయ రహదారి నుండి అమరావతి వెళ్ళేందుకు కరకట్ట రహదారిని అనుసంధానం చేస్తూ అవసరమైన నిధులను మంజూరు చేయాలని,కృష్ణా నది వెంట సాగే ఈ రహదారి పర్యాటకులను ఆకర్షించే విధంగా ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు.ఈ మార్గంలో రేపల్లె డిపోకు చెందిన కరకట్ట ఎక్స్‌ప్రెస్ సర్వీసులు తిరుగుతున్నప్పటికీ అవి ఏ మాత్రం సరిపోనందున మరిన్ని బస్సుల సంఖ్యను పెంచేందుకు రేపల్లె ఆర్టీసీ డిపో అధికారులను ఆదేశించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించు కుంటున్నారు.రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి అంతర్గత రహదారుల అభివృద్ధి జరగాల్సి ఉంది.వాణిజ్య పంటల తరలింపుకు రహదారుల అభివృద్ధిని రైతులు కోరుతున్నారు. సాగునీటి కాల్వలను పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని కృష్ణా పశ్చిమ బ్యాంకు కెనాల్ కరకట్ట కోతకు గురికాకుండా రక్షాకవచం ఏర్పాటు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.బ్యాంక్ కెనాల్‌లోని ఇసుక మేటలను తొలగించి కరకట్టలను అభివృద్ధి చేసి ఉప కాల్వల ద్వారా వ్యవసాయ భూములకు సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.పోతార్లంక నీటి పథకాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో వేమూరు,రేపల్లె నియోజకవర్గాలు ఉన్నందున రెవెన్యూ డివిజన్ కేంద్రమైన రేపల్లెలో మోటార్ వెహికల్ అధికారి,విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.రేపల్లె-తెనాలి మధ్య రైల్వే రెండో లైన్ ఏర్పాటు చేసి ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు జిల్లా కేంద్రమైన బాపట్లకు రైళ్ళు నడిచేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.రైలు, రహదారి రవాణా సదుపాయాలను మెరుగుపర్చాలంటున్నారు.విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు వదిలే కృష్ణా నది నీరు వృధాగా సముద్రంపాలవుతున్నందున పెనుమూడి వద్ద నీటిని నిల్వ చేసే ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు సూచిస్తున్నారు. సముద్రంలోని పాటుపోట్ల కారణంగా కృష్ణా జలాలు 25 కి.మీ దూరం ఉప్పుగా మారాయని లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే కృష్ణా నది జలాలతో పాటు భూగర్భజలాలకు ముప్పు ఉండదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రజలు సైతం మినరల్ వాటర్ బాటిల్స్ కొనుగోలు చేసుకుని దాహార్తిని తీర్చుకుంటున్నారు.రక్షిత మంచినీటి పథకాలు సవ్యంగా పనిచేస్తూ తమకు తాగునీరు అందిస్తే మంచినీరు కొనుక్కోవాల్సిన ఆర్థిక భారం తప్పుతుందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.రేపల్లె మెయిన్,భట్టి ప్రోలు మెయిన్ డ్రెయిన్‌లను అభివృద్ధి చేస్తే పొలాల్లో,గ్రామాలలో వదలిన మురుగునీరు సజావుగా బంగాళాఖాతంలోకి చేరగలదు.రెవెన్యూ డివిజన్ కేంద్రం స్థాయికి రేపల్లె చేరినందున పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు సూచిస్తున్నారు.చేనేత సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని,చేనేతపై జిఎస్టీని రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.మెరుగైన సంక్షేమ పథకాలను అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు.ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా దారిమళ్ళుతున్న రేషన్ జిల్లాలు దాటిపోతున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అడ్డుకట్ట వేయాలని రేషన్‌కార్డుదారులు కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును,రేపల్లెలో జిల్లా కోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలని కక్షిదారులు,న్యాయవాదులు సూచిస్తున్నారు. భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రాన్ని అభివృద్ధి చేసి 50 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.నూతనంగా నగర పంచాయతీలు ఏర్పాటు చేయాలని,అప్పుడే వేగంగా అభివృద్ధి నెరవేరుతుందని విజ్ఞప్తి చేస్తున్నారు.రేపల్లె పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించాలని కార్మికవర్గం కోరుతోంది.తమ ఆరోగ్య ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వైద్యశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రజలు సూచిస్తున్నారు.వేమూరు నియోజకవర్గంలో ఉపాధిమార్గాలు పొందేందుకు ప్రణాళికాబద్ధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.ప్రజల సంక్షేమంలో భాగంగా సిఎం ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# నేడు భట్టిప్రోలులో ముఖ్యమంత్రి పర్యట

**భట్టిప్రోలులో ట్రాఫిక్ మళ్లింపులు.. వాహనదారులు గమనించాల్సిన వివరాలు**

**బాపట్ల,ఏప్రిల్ 8, ప్రభాతవార్త ప్రతినిధి :** నువ్వు అంతా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు గురువారం భట్టిప్రోలు మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బాపట్ల జిల్లా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం ఉదయం నుండి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం ప్రకటించింది.ఈ మార్పులను ప్రజలు, ముఖ్యంగా భట్టిప్రోలు, వేమవరం, సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన, రేపల్లె పరిసర ప్రాంతాల ప్రజలు గమనించాలని పోలీసులు కోరారు.

**ట్రాఫిక్ మళ్లింపుల వివరాలు ఇవే:**

నేషనల్ హైవే మార్గంలో: భట్టిప్రోలు శివారులోని ఎన్ హెచ్216ఎ వద్ద గల వేమవరం జంక్షన్ నుంచి సూరేపల్లి మీదుగా రేపల్లె వైపు వెళ్లే వాహనాలు వేరే మార్గాలకు వెళ్లకుండా, నేరుగా నేషనల్ హైవే మీదుగానే రేపల్లెకు చేరుకోవాలని సూచించారు. రేపల్లె నుంచి కోనేటిపురం వైపు: రేపల్లె నుంచి పల్లెకోన మీదుగా కోనేటిపురం రావాల్సిన వాహనాలను పడమటిపాలెం జంక్షన్ ఆర్చి వద్ద నిలిపివేసి మళ్లిస్తారు. ఈ వాహనాలు జిల్లేపల్లి, పెద్దవరం మీదుగా ప్రయాణించి కనగాల వద్ద ఎన్ హెచ్216ఎ లోకి చేరుకోవాల్సి ఉంటుందనీ తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటనకు సహకరిస్తూ, పోలీసుల సూచనలను పాటిస్తూ, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించ వలసిందిగా అధికారులు విజ్ఞప్తి చేశారు.

# రెడ్డి మిత్ర సేవ కార్యాలయం ప్రారంభం

**కర్లపాలెం. ఏప్రిల్ 8. ప్రభాతవార్త:** కర్లపాలెం గణపవరం రోడ్లో నూతనంగా రెడ్డి మిత్ర సేవా సంఘం కార్యాలయంలో జ్యోతి వెలిగించి ప్రారంభించారు .ఈ సందర్భంగా జడ్పిటిసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఇందులో పార్టీలకు అతీతంగా రెడ్డి సామాజిక వర్గములో గాని ఇతర సామాజిక వర్గంలో గాని



ఆపదలో ఉన్నవారికి చేయూతని ఇవ్వటం, మెడికల్ క్యాంపులు నిర్వహించుట, సేవ చేయటం ఉంటుందని తెలిపారు.అట్ల హరిబాబు రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజిక వర్గం అందరు కూడా ఈ వేదిక మీదకు వచ్చిపార్టీలు కి అతీతంగా పనిచేయాలనన్నారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు నంగు గోవర్ధన రెడ్డి, సెక్రెటరీ ప్రసాద్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు చేరాల శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ ఆట్ల హరిబాబు రెడ్డి, పెద్దలు సుభాష్ రెడ్డి, శ్రీనివాసు రెడ్డి, ఆట్ల బాలాజీ రెడ్డి, పిట్టు చంద్రశేఖర రెడ్డి , మాజీ జెడ్పిటిసి శివారెడ్డి ,తదితరులు పాల్గొన్నారు..

# సిఎం పర్యటన షెడ్యూల్ విడుదల



**భట్టి ప్రోలు(రేపల్లె), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి మండలంలోని ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరి గుంటుపల్లి సిఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే వివాహ కార్యక్రమంలో ఉదయం 10 గంటల 10 నిమిషాల నుండి 10 గంటల 20 నిమిషాల వరకు పాల్గొంటారు.ఉదయం 10.30 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.ఉదయం 10.35 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 10.50 గంటలకు భట్టి ప్రోలు మండలంలోని సూరేపల్లికి చేరుకుంటారు.ఉదయం 11 గంటల వరకు కొనసాగే ప్రజాప్రతినిధుల,అధికారుల స్వాగత కార్యక్రమం అనంతరం రహదారి మార్గంలో ఉదయం 11.10 గంటలకు సూరేపల్లిలోని ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు.మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావేదిక సభలో పాల్గొంటారు.మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 వరకు విశ్రాంతి తీసుకుంటారు.మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 1.35 గంటలకు రహదారి మార్గం ద్వారా సూరేపల్లి రైతుల పంట భూముల వద్దకు చేరుకుంటారు.రైతులు,అధికారులతో రెవెన్యూ సమస్యల గురించి మధ్యాహ్నం 2.05 గంటల వరకు చర్చిస్తారు.అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 3.40 గంటల వరకు జరిగే కేడర్ మీటింగ్‌లో పాల్గొంటారు.మధ్యాహ్నం 3.45 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.మధ్యాహ్నం 3.50 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి సాయంత్రం 4.05 గంటలకు ఉండవల్లికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేరుకుంటారు.ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌ను సిఎం ప్రైవేట్ సెక్రటరీ ఆర్.కృష్ణ కపర్ధి విడుదల చేశారు.

# అమెజాన్ విక్రయ రుసుముల సవరణకు ఎస్ఎంఈ ఫోరం స్వాగతం

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** భారతదేశంలో సూక్ష్మ చిన్న మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈలు) ఊతమిచ్చే నిర్ణయంగా అమెజాన్ ఇండియా తీసుకున్న విక్రయ రుసుముల సవరణను ఇండియా సూక్ష్మ చిన్న మధ్య తరహా సంస్థల ఫోరం స్వాగతించి, ఆన్‌లైన్ మార్కెట్‌లో చిన్న విక్రేతల లాభదాయకతకు ఇది సమయోచిత చర్య అని అమెజాన్ ఇండియా సేల్స్ డైరెక్టర్ గౌరవ్ భట్నాగర్ ఈ మార్పుల ప్రయోజనాలను సభ్యులకు వివరించారు. చిన్న వ్యాపారులు ఎదుర్కొంటున్న తక్కువ లాభాలు పెరుగుతున్న ఖర్చుల ఒత్తిడి వంటి సమస్యలను తగ్గించేందుకు ఈ నిర్ణయం దోహదం చేస్తుందని తెలిపారు.

# తనిష్క్ కొత్త ప్రచార ముఖచిత్రంగా రుక్మిణి వసంత్

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** పవిత్రమైన అక్షయ తృతీయ పండుగ సమీపిస్తున్న తరుణంలో టాటా సంస్థకు చెందిన భారతదేశపు ప్రముఖ ఆభరణాల బ్రాండ్ తనిష్క్, సహజ రత్నాల విభాగంలో తమ తాజా ఆభరణాలను రుక్మిణి వసంత్‌తో కలిసి ఆవిష్కరించింది. సంప్రదాయపు నిత్యజీవితపు సొగసుకు కెంపులు పచ్చలు ఇతర ప్రకాశవంతమైన రాళ్ల వైభవాన్ని ఒక ప్రధాన భాగంగా దక్షి ణ భారతదేశంలో రుక్మిణి వసంత్‌ను తనిష్క్ కొత్త ముఖ చిత్రంగా సమకాలీన దక్షి ణ భారత మహిళకు ప్రతీకగా పరిచయం చేశారు.

# రాజస్థాన్‌లో టాఫే యొక్క జెఫార్మ్ ప్రారంభం

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ఒకటైన 1964లో చెన్నైలోని కేలంబాక్కంలో స్థాపించబడి ప్రపంచంలోని అతిపెద్ద ట్రాక్టర్ తయారీదార్లలో ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ లిమిటెడ్ (టాఫే) భవానీ మండిలో తన అనుకూల పరిశోధనా కేంద్రమైన టాఫే జెఫార్మ్ రాజస్థాన్‌ను ప్రారంభించి స్థిరమైన వ్యవసాయ పద్ధతులను పంచుకోవడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను మరియు రైతుల శ్రేయస్సును పెంచడంలో నిబద్ధతను పునరుద్ఘాటించింది. టిఆర్.కేశవన్, గ్రూప్ ప్రెసిడెంట్ కార్పొరేట్ రిలేషన్స్ అండ్ అలయన్స్ స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు రాజస్థాన్ డీలర్ భాగస్వాములు ప్రముఖ అతిథులు మరియు వినియోగదారుల సమక్షంలో సందీప్ సిన్హా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టాఫే, ఈ ఫెసిలిటీని ప్రారంభించారు.

# ఎల్‌పీజీ కొరతకు గోద్రెజ్ జెర్సీ స్మార్ట్ మార్గం

**విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సరఫరా జాప్యాలు రీఫిల్లింగ్ పరంగా పరిమితులు సుదీర్ఘ వెయిటింగ్‌తో పలు ప్రాంతాల్లో ఎల్‌పీజీ సిలిండర్ల కొరత వల్ల ప్రజల రోజువారీ వంటపనులకు ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (జీఏవీఎల్) అనుబంధ సంస్థ గోద్రెజ్ జెర్సీ భారతీయ కుటుంబాలు ఎల్‌పీజీపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో వంటపనులను అధిగమించడంలో గోద్రెజ్ జెర్సీ సూచనలిస్తూ వంటగదిలో చిన్న చిన్న మార్పులతో మైక్రోవేవ్స్, ఎయిర్ ఫ్రయర్స్, ఎలక్ట్రిక్ కెటిల్స్‌లాంటి ప్రత్యామ్నాయ ఉపకరణాలను ఉపయోగించి సంతృప్తికరమైన ఆహారాన్ని సిద్ధం చేసుకొంటూ భారతీయ కుటుంబాలు ఫుడ్ డెలివరీపై ఆధారపడకుండా కలిసికట్టుగా వంటకాలను చేసుకుంటూ బంధాలను మరింత పటిష్టం చేసుకోవచ్చు.

# ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధం

## సర్వం అగ్నికి ఆహుతి

**చెరుకుపల్లి, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు పూరింటికి నిప్పంట్టుకొని అగ్నికి ఆహుతి అయిన సంఘటన మండలంలోని కుంచలవారిపాలెంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పంచాయతీ శానిటేషన్ సిబ్బంది రోడ్డుపై చెత్తను ఒకచోటకు పోగు చేసి నిప్పంటించగా నిప్పు రవ్వలు ప్రమాదవశాత్తు గాలికి దగ్గర్లో ఉన్న పిట్టు కృష్ణారెడ్డి కి చెందిన పూరి ఇంటిపై పడటంతో ఒక్కసారిగా మంటలు ఉధృతంగా వ్యాపించాయి. తీవ్రమైన ఎండ , గాలి ఉన్న కారణంగా ఇంట్లోని వస్తువులను బయటకు తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలియజేస్తున్నారు. అగ్ని ప్రమాద



సమయంలో ఇంట్లో ఏడు సవర్ల బంగారం, 14 తులాలు వెండి, గొర్రెలను అమ్మగా వచ్చిన 60 వేల రూపాయలు నగదు, ఇంటిలోని సామాన్లు మొత్తం ప్రమాదంలో ఖాళీ బూడిద అయ్యాయని బాధితులు వాపోయారు. అగ్ని ప్రమాదానికి కారణమైన పంచాయతీ సిబ్బందిని బాధితులు నిలదీయగా మీ ఇల్లు పోరంబోకులో ఉందంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రమాదవశాత్తు ఇటువంటి సంఘటనలు జరిగితే ప్రభుత్వం తక్షణమే ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం, బియ్యం, నిత్యవసర సరుకులు ఇచ్చేదని కానీ తమను అధికారులు ఎవరు పరామర్శించడం గాని, ఎటువంటి ఆర్థిక సహాయం చేయడం గానీ చేయలేదని కనీసం వండుకొని తినటానికి వస్తువులు సామాగ్రి కూడా లేవని బాధిత కుటుంబ సభ్యులు కన్నీళ్ల పరాంతమయ్యారు.

# బందోబస్తు విధులలో సమయపాలన పాటించాలి : జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్

**భట్టి ప్రోలు(రేపల్లె), ఏప్రిల్ 8, ప్రభాతవార్త:** భట్టిప్రోలు మండలంలోని సూరేపల్లిలో గురువారం నాటి ముఖ్యమ ంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పోలీసులు బందోబస్తు విధులలో సమయపాలన పాటించాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ స్పష్టం చేశారు.బుధవారం భట్టి ప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ధేశించిన ప్రదేశాలలో విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని చెప్పారు.సెక్టార్ల వారీగా నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు.హెలిప్యాడ్,ప్రజా వేదిక,ఫీల్డ్ విజిట్,పార్టీ క్యాడర్ మీటింగ్ ప్రదేశాలు,కాన్వాయ్ ప్రయాణించే మార్గం,రూఫ్‌టాప్‌లు, పార్కింగ్ ప్రదేశాలు,ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లలో విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని సిపి కెమెరాలు,డ్రోన్లు ద్వారా ప్రజావేదిక,సిఎం కాన్వాయ్ ప్రయాణించే మార్గం,ఇతర కీలకమైన ప్రదేశాలలో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.వీటి ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ఎప్పటి కప్పుడు పరిస్థితులను పరిశీలి స్తుంటామని తెలి పారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని ఆయన చెప్పారు.విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా విధులకు గైర్హాజరైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉమామహేశ్వర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ సత్యబాబు,రేపల్లె,బాపట్ల,చీరాల డిఎస్పీలు ఆవుల శ్రీనివాసరావు,పి.జగదీష్ నాయక్,ఎండి మోయిన్,సిఐలు, ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఫిట్‌నెస్‌లా మౌఖిక సంరక్షణకు రిసెట్ ఎందుకు ఉండదు

విజయవాడ, ఏప్రిల్ 8, ప్రభాతవార్త : వ్యక్తిగత ఆరోగ్య ప్రాధాన్యతల్లో ఉన్న అసమానతను మరియు ఆధునిక మౌఖిక పరిశుభ్రతలో ఆయుర్వేద జ్ఞానపు పాత్రను ప్రముఖ ప్రజారోగ్య నిపుణురాలు డా. సోనియా దత్తా ప్రస్తావిస్తూ చాలా మంది జిమ్‌లో చేరడం, కొత్త ఆహారపు అలవాట్లు అవలంబించడం ద్వారా తమ ఫిట్‌నెస్‌ను తరచుగా రిసెట్ చేస్తారు. అయితే మౌఖిక సంరక్షణకు పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డా.సోనియా దత్తా ఎండిఎస్ పిహెచ్‌డి ఈ అసమానతను ప్రస్తావిస్తూ, చిన్నప్పటి నుంచే ఏర్పడిన బ్రషింగ్ అలవాట్లు జీవనశైలి ఆరోగ్య అవసరాలు మార్చుకుని ఆయుర్వేదం లవంగం, శుంఠి వంటి పదార్థాల ద్వారా యాంటీబ్యాక్టీరియల్ మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలతో డాబర్ రెడ్ పేస్ట్ ఆయుర్వేద జ్ఞానాన్ని ఆధునిక దంత శాస్త్రంతో కలిపి ఈ లోటును పూరిస్తుంది.

9-4Pg5 9_9-4Pg5.qxd 08/Apr/26 10:44 PM Page 1



# కాల్పుల విరమణలో ఇరాన్‌కు చైనా సాయం: ట్రంప్

**బీజింగ్, ఏప్రిల్ 8:** అమెరికా, ఇరాన్‌ల మధ్య 40వ రోజుకు చేరిన యుద్ధ జ్వాలలు ఎట్టకేలకు చల్లారాయి. ఇరాన్‌పై జరిపే భారీ సైనిక దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గి, రెండు వారాల షరతులతో కూడిన కాల్పుల విరమణను ప్రకటించారు. ఈ నిర్ణయానికి, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికీ మార్గం సుగమం అయ్యింది. ఈ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా ఉపశమనాన్ని కలిగించింది. ఈ కాల్పుల విరమణకు పాకిస్తాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ క్రెడిట్ తీసుకుంటున్నారు. కాల్పుల విరమణకు అంగీకరించేలా ఇరాన్‌ను ఒప్పించడంలో చైనా కీలక పాత్ర పోషించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా దీనిని ప్రకటించారు. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్ వివాదం



ప్రారంభమైనప్పటి నుండి, చైనా శాంతిని ప్రోత్సహించడానికి, శత్రుత్వాలను నివారించడానికి చురుకుగా కృషి చేస్తోందని అన్నారు. కాల్పుల విరమణకు అంగీకరించడానికి ఇరాన్‌కు చైనా సహాయం చేసిందని తాను నమ్ముతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఉద్దేశించి ఆయన ఈ విధంగా స్పందించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించి, చర్చల వేదిక వద్దకు తీసుకురావడానికి ఇరాన్‌కు చైనా సహాయం చేసిందని అమెరికా అధ్యక్షుడు అన్నారు.

చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి సంబంధిత దేశాల విదేశాంగ మంత్రులతో 26 సార్లు ఫోన్ సంప్రదింపులు జరిపారని, అదే సమయంలో మధ్యప్రాచ్య సమస్యపై చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి సంబంధిత పక్షాల మధ్య దౌత్యం నిర్వహించారని మావో అన్నారు. గల్ఫ్-మధ్యప్రాచ్య ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి చైనా, పాకిస్తాన్‌లు సంయుక్తంగా ఐదు సూత్రాల ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి అని మావో తెలిపారు. ఒక బాధ్యతాయుతమైన ప్రధాన దేశంగా, గల్ఫ్ -మధ్యప్రాచ్యంలో శాంతి భద్రతలను పునరుద్ధరించడంలో చైనా తన పాత్రను కొనసాగిస్తూ, తోడ్పాటు అందిస్తుందని మావో అన్నారు.

## దాడులు నిలిపివేస్తేనే శాంతి నిర్ణయానికి మద్దతు: ఇజ్రాయెల్

**టెల్ అవీవ్, ఏప్రిల్ 8:** అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రపంచవ్యాప్తంగా ఆశలు చిగురిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఒక కీలక ప్రకటన చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ శాంతి నిర్ణయానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలుపుతూనే మరో సంచలన విషయాన్ని బయట పెట్టారు. హర్మ్యూజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై దాడులను నిలిపి వేయడం వంటి షరతులకు ఇరాన్ అంగీకరించిన నేపథ్యంలోనే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని ఇజ్రాయెల్ పేర్కొంది. ఇరాన్ అణు కార్యక్రమం, క్షిపణి ప్రయోగాలు, ఉగ్రవాద కార్యకలాపాల నుంచి ప్రపంచానికి ముప్పు కలగకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తాము సమర్థిస్తున్నట్లు నెతన్యాహు వెల్లడించారు. ఇరాన్‌తో జరగబోయే చర్చల్లో ఇజ్రాయెల్, దాని మిత్ర దేశాల ప్రయోజనాలకు భంగం కలగకుండా చూస్తామని అమెరికా తమకు హామీ ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రకటనకు, ఇజ్రాయెల్ వైఖరికి మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. లెబనాన్ సహా అన్ని ప్రాంతాల్లో కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని షెహబాజ్ షరీఫ్ ప్రకటించగా నెతన్యాహు మాత్రం లెబనాన్‌ను ఈ పరిధి నుంచి మినహాయించారు అని తెలిపారు. అంటే ఇరాన్‌తో యుద్ధం ఆగినా లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతాయనేది స్పష్టం అవుతోంది. మరోవైపు ఇరాన్ ప్రతిపాదించిన తన 10 సూత్రాల శాంతి ప్రణాళికలో తమ మిత్రదేశాలపై కూడా దాడులు చేయకూడదని ఒక ప్రధాన షరతును విధించింది. ఇజ్రాయెల్ మాత్రం ఈ షరతును ఏమాత్రం పట్టించుకోకుండా దక్షిణ లెబనాన్‌లోని ప్రధాన నగరాల లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలతో భీకర దాడులు చేస్తోంది. కాల్పుల విరమణ చర్చలు జరుగుతున్నప్పటికీ లెబనాన్ సరిహద్దులో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత ఉధృతం చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## సీజ్ ఫైర్‌ను స్వాగతించిన భారత్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** అమెరికా- ఇరాన్ సంఘర్షణలో కాల్పుల విరమణ ప్రకటనపై భారత ప్రభుత్వం తొలిసారి స్పందించింది. బుధవారం విదేశాంగ మంత్రిత్వ శాఖ కాల్పుల విరమణను స్వాగతిస్తూ ఒక ప్రకటనను జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ పశ్చిమ ఆసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పుతుందని ఆశిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఉద్రిక్తతలకు చర్చల ద్వారా పరిష్కారం లభించాలని భారతదేశం మొదటి నుంచీ వాదిస్తోందని విదేశాంగ ప్రతినిధి రణదీప్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత సంఘర్షణకు త్వరితగతిన ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం అత్యవసరమని, శాంతిని నెలకొల్పడానికి చర్చలు, దౌత్యం కీలకమని మేము నిరంతరం చెబుతూనే ఉన్నామని ఆ ఆయన అన్నారు. నెల రోజులకు పైగా కొనసాగుతున్న అమెరికాఇజ్రాయెల్ఇరాన్ ఘర్షణ వల్ల జరిగిన నష్టంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘర్షణ ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలకు, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగింది. పౌరులకు తీవ్ర ఇబ్బందులు కలిగించిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. హోర్ముజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరాలు, ప్రపంచ వాణిజ్యం ఇకపై కొనసాగుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొంది.

**తక్షణమే ఇరాన్ విడిచి వెళ్లండి:** మరోవైపు, కాల్పుల విరమణ ప్రకటన అనంతరం, ఇరాన్‌లో చిక్కుకుపోయిన తమ పౌరులు



వెంటనే దేశం విడిచి వెళ్లాలని భారత్ సూచించింది. ఇరాన్‌లోని తమ రాయబార కార్యాలయం అందించిన మార్గాలను ఉపయోగించుకోవాలని భారత్ తన పౌరులకు సలహా ఇచ్చింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం బుధవారం ఒక సలహాలో పేర్కొంది, ఏప్రిల్ 7నాటి సలహాకు కొనసాగింపుగా ఇటీవలి పరిణామాల దృష్ట్యా, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుని, అది సూచించిన మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించింది. రాయబార కార్యాలయంతో ముందస్తు సంప్రదింపులు, సమన్వయం లేకుండా ఏ అంతర్జాతీయ భూ సరిహద్దును సమీపించడానికి ప్రయత్నించవద్దని పునరుద్ఘాటించిందని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. ఈ సలహాలో, రాయబార కార్యాలయం తన పౌరుల కోసం అత్యవసర నంబర్లను అందుబాటులో ఉంచింది.

## లెబనాన్‌కు వర్తించదు: నెతన్యాహు

### దాడులు ఆపకుంటే మీపై దాడులుచేస్తాం: ఇరాన్

**టెల్ అవీవ్, టెహ్రాన్, ఏప్రిల్ 8:** ఇరాన్‌అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా తగ్గినట్లు కనిపించడం లేదు. ఈ ఒప్పందాన్ని స్వాగతించిన ఇజ్రాయెల్ ఇది లెబనాన్‌కు మాత్రం వర్తించబోదని చెప్పింది. దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తూనే ఉంది. దీనిపై ఇరాన్ స్పందించింది. లెబనాన్‌పై దాడులు ఆపకుంటే ఇజ్రాయెల్‌పై తాము కూడా దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరానియన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మరికొన్ని గంటల్లోగా దక్షిణ లెబనాన్‌పై దాడులు ఆపకపోతే మేం ఇజ్రాయెల్‌పై వైమానిక, క్షిపణి దాడులు చేస్తామని హెచ్చరించింది. అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో ఇరాన్ తమతోపాటు లెబనాన్ వంటి తమ మిత్ర దేశాలపై కూడా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ఆపాలని డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని మధ్యవర్తిత్వం వహించిన పాక్ కూడా ధృవీకరించింది. లెబనాన్‌కు కూడా కాల్పుల విరమణ ఒప్పందం వర్తిస్తుందని పాక్ ప్రధాని షెహబాజ్ కూడా స్పష్టం చేశాడు. కానీ, ఇజ్రాయెల్ దీన్ని ఖండించింది. ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేసింది. లెబనాన్‌లోని ఇరాన్ మద్దతుగా ఉన్న హెజ్బొల్లా తీవ్రవాద స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా, లెబనాన్‌లోని ఒక పట్టణానికి ఇజ్రాయెల్ హెచ్చరిక జారీ చేసింది.



అక్కడి ప్రజలందరూ నగరం నుంచి తరలి వెళ్లాలని సూచించింది. ఇప్పటిదాకా అటు ఇరాన్‌పై విరుచుకుపడుతూనే, ఇటు లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడులకు బదులుగా హెజ్బొల్లా కూడా ఎదురు దాడికి దిగింది. కానీ, అమెరికాతో ఇప్పుడు కుదిరిన కాల్పుల ఒప్పందం ప్రకారం హెజ్బొల్లా కూడా కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇరాన్ కూడా బుధవారం ఉదయం దుబాయ్, సౌదీ, కువైట్ వంటి గల్ఫ్ దేశాలపై కొన్ని క్షిపణుల్ని ప్రయోగించినట్లు సమాచారం. అయితే, వాటిని క్షిపణి రక్షక వ్యవస్థలు అడ్డుకున్నట్లు ఆ దేశాలు ప్రకటించాయి.

## అటు కాల్పుల విరమణ.. ఇటు క్షిపణి దాడులు

**టెహ్రాన్, ఏప్రిల్ 8:** అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. పశ్చిమాసియాలోని పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగడం ఆందోళన రేకెత్తిస్తోంది. తమ దేశానికి చెందిన లావన్ ద్వీపంపై బుధవారం దాడులు జరిగినట్లు ఇరాన్ వెల్లడించింది. ఈ దీవిలోని చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడి కారణంగా ఆయిల్ రిఫైనరీలో మంటలు చెలరేగాయని, అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఇరాన్ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడిలో ఆస్తి, ప్రాణ నష్టం వివరాలు తెలియరాలేదు. మరోవైపు ఈ దాడులు ఎవరు చేశారన్న దానిపై కూడా స్పష్టత లేదు.

**కువైట్‌లోనూ దాడులు:** అటు కువైట్‌లోని పలు చమురు, విద్యుత్ క్షేత్రాలపైనా బుధవారం దాడులు కొనసాగాయి. దాదాపు 28 ఇరాన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుందని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ



అధికార ప్రతినిధి వెల్లడించారు. చమురు శుద్ధి కేంద్రాలు, విద్యుత్ ప్లాంట్లపై డ్రోన్ దాడులు జరగడంతో భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని కొన్ని ప్రాంతాలపై క్షిపణి దాడులు జరిగాయి. వీటిని సమర్థంగా అడ్డుకున్నట్లు ఆ దేశ అధికారులు వెల్లడించారు. రెండు వారాల కాల్పుల విరమణకు అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గందరగోళానికి దారితీసింది.

## ఆందోళన రేకెత్తిస్తోన్న ఇజ్రాయెల్ చర్యలు



**టెల్‌అవీవ్, ఏప్రిల్ 8:** ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణకు అంగీకారమే కానీ.. లెబనాన్‌పై మాత్రం దాడులు ఆపబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే ప్రకటించారు. అయితే ఈ ప్రకటనను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఖండించిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 'కొన్ని గంటల్లో లెబనాన్‌లో కాల్పులు ఆపకపోతే.. టెల్‌అవీవ్(ఇజ్రాయెల్)లో బాంబుల మోత మోగుతుంది' అని హెచ్చరించినట్లు వెల్లడించాయి. కాల్పుల విరమణపై నెలకొన్న అనిశ్చితే ఇరువర్గాల ప్రకటనలకు కారణం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా గ్రూప్ ఇప్పటికే కాల్పుల విరమణకు అనుకూలంగా సంకేతాలు పంపింది. కానీ ఇజ్రాయెల్ స్పందన భిన్నంగా ఉంది. ఈ సీజ్‌ఫైర్‌లో లెబనాన్ కూడా భాగమని మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ప్రకటించింది. అమెరికాతో కుదిరే ఏ ఒప్పందంలో అయినా లెబనాన్‌లో కాల్పుల ఆగాలనే క్లాజ్ ఇరాన్ కోరుకుంది. కానీ ఇజ్రాయెల్ దానిని వ్యతిరేకిస్తోంది.

# ఎడప్పాడిలో టివికె అరుణ్ నామినేషన్ తిరస్కృతి

**చెన్నై, ఏప్రిల్ 8:** తమిళనాడు రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేయాలని తమిళగ వెట్రి కళగం పార్టీని స్థాపించిన విజయ్‌కు అదృష్టం ఈసారి అస్సలు కలిసి రాలేదు. ప్రతిష్టాత్మకమైన ఎడప్పాడి నియోజకవర్గంలో పోటీ చేసి తన సత్తా చాటాలని ఆశించిన దళపతికి, నామినేషన్ల పర్వంలోనే చుక్కెదురైంది. తన అభ్యర్థి అరుణ్ కుమార్ నామినేషన్ తిరస్కరణకు గురవ్వడమే కాకుండా, ఆయన అదృశ్యం కావడం విజయ్ అభిమానులను, పార్టీ శ్రేణులను షాక్ కు గురి చేస్తోంది. రాజకీయాల్లోకి రావడం ఒకెత్తయితే, అక్కడి క్లిష్టమైన నిబంధనలను అర్థం చేసుకోవడం మరో ఎత్తు. కనీసం 10 మంది ప్రతిపాదకుల సంతకాలు ఉండాలనే చిన్న నియమాన్ని పాటించకపోవడంతో ఎడప్పాడి టీవీకే అభ్యర్థి అరుణ్ కుమార్ నామినేషన్ వీగిపోయింది. ఎన్నికల యుద్ధ భూమిలోకి కత్తి పట్టకుండానే విజయ్ సైన్యం ఓటమిని అంగీకరించినట్లయింది. ప్రత్యామ్నాయ అభ్యర్థి నిత్యా నామినేషన్ కూడా ఇదే కారణంతో రిజెక్ట్ అవ్వడం పార్టీలోని అజాగ్రత్తను ఎత్తి చూపుతోంది. హేమాహేమీలు పోటీ పడే చోట ఇంతటి చిన్న తప్పులు చేయడం విజయ్ రాజకీయ భవిష్యత్తుపై విమర్శలకు తావిస్తోంది. అభ్యర్థి అరుణ్ కుమార్ మాయం కావడం ఈ కథలో అసలైన ట్విస్ట్. నామినేషన్ల పరిశీలన సమయంలో ఆయన కనిపించకపోవడంతో ప్రత్యర్థి పార్టీల వారు కిడ్నాప్ చేశారంటూ టీవీకే కార్యకర్తలు రోడ్లపైకి



వచ్చి ఆందోళన చేపట్టారు. సినిమాటిక్ స్టైల్‌లో జరిగిన ఈ అదృశ్యం వెనుక రాజకీయ కుట్ర ఉందా లేక నామినేషన్ రిజెక్ట్ అవుతుందని తెలిసి అభ్యర్థే తప్పుకున్నారా అన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది. అభ్యర్థిని కాపాడుకోలేకపోవడం విజయ్ లీడర్‌షిప్ కు పరీక్షగా నిలుస్తోంది. అన్నాడీఎంకే దిగ్గజం ఎడప్పాడి పళనిస్వామిని ఆయన సొంత గడ్డపై ఢీకొట్టాలని భావించిన విజయ్ ప్లాన్ ఇప్పుడు రివర్స్ అయింది. నియోజకవర్గంలో టీవీకే జెండా ఎగిరే అవకాశం కూడా లేకుండాపోవడంతో, విజయ్ తొలి ఎన్నికల సమరంలోనే ఒక కీలక స్థానాన్ని కోల్పోయారు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదు, విజయ్ రాజకీయ ప్రయాణంలో ఎదురైన మొదటి పరాజయం అని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ప్రజల్లో విపరీతమైన క్రేజ్ ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో యంత్రాంగం లోపించడం వల్లే విజయ్ ఈ షాక్ తిన్నట్లు కనిపిస్తోంది.

## ఓటు హక్కుపై చైతన్యపరుస్తూ కేరళం సిఇఒ డ్యాన్స్

**తిరువనంతపురం, ఏప్రిల్ 8:** కేరళ సహా నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేరళ ఓటర్లలో ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సిఇఒ) రతన్ యూ కేల్కర్ డ్యాన్స్ చేశారు. ఈ డ్యాన్స్ నెటిజన్‌లను తెగ ఆకట్టుకుంటున్నది. ఇటీవల కొచ్చిలో భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ విడుదల చేసిన వీడియోలో ఆ డ్యాన్స్‌కు సంబంధించిన దృశ్యాలు ఉన్నాయి. మొత్తం 1.33 నిమిషాల నిడివిగల ఈ వీడియోలో కేల్కర్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి సముద్ర తీరంలో డ్యాన్స్ చేస్తున్నారు. తిరువనంతపురం కలెక్టర్ అనుకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివశక్తివేల్ తదితర



అధికారులు వీడియోలో ఉన్నారు.ఇది మీ ఓటు మన రాష్ట్రానికి మీ ఓటు అవసరం ఉంది. ఒకే లక్ష్యం ఆటను మార్చగలదు. ఒక ఓటు తలరాతను మార్చగలదని ఈ వీడియో సాంగ్‌లో ఉంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ విడియో కేరళ ఓటర్లను కూడా విపరీతంగా ఆకట్టుకుంటోంది.

## తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బదలీ

### డివిఎసి చీఫ్‌గా సందీప్ మిట్టల్

### ఎన్నికల సంఘం తక్షణ ఆదేశాలు

**చెన్నై, ఏప్రిల్ 8:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) ఎన్. మురుగానందంను తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారి ఎం. సాయికుమార్‌ను కొత్త సీఎస్‌గా నియమించింది. ఈ మార్పులను వెంటనే అమలు చేసి, బుధవారం సాయంత్రం 6 గంటలలోపు నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరి, పారదర్శకత కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఈ మార్పులతో పాటు పరిపాలనలో మరో కీలక మార్పు కూడా చేసింది. డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ




కరప్షన్ (డీవీఏసీ) చీఫ్‌గా ఉన్న దేవిడ్సన్ దేవశిర్వతంను బదిలీ చేసి, ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ మిట్టల్‌ను నియమించింది. మిట్టల్, డీవీఏసీతో పాటు ఆర్మ్‌డ్ పోలీస్ విభాగం అధిపతిగా కూడా వ్యవహరిస్తారు. బదిలీ అయిన అధికారులకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎలాంటి ఎన్నికల సంబంధిత విధులు కేటాయించవద్దని ఎన్నికల సంఘం తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరుకున్న తరుణంలో అధికార యంత్రాంగం దుర్వినియోగం కాకుండా, ప్రజలకు స్వేచ్ఛాయుత ఎన్నికలపై నమ్మకం కలిగించేందుకే ఈసీ ఇలాంటి కఠిన చర్యలు తీసుకుంటున్నది.

## టిఎంసి నేతలకు సిఇసి సీరియస్ వార్నింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జరుగుతాయని పేర్కొంది. ఈసీ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ పోస్టు చేస్తూ హింస లేకుండా, బెదిరింపులు లేకుండా, తనిఖీలు లేకుండా, పోలింగ్ బూత్‌ల్లో జామ్ లేకుండా ఎన్నికల నిర్వహణ జరగనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఇక ఆ రాష్ట్రానికి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కూడా ఈసీ గట్టి వార్నింగ్ ఇచ్చింది. టీఎంసీకి సూటిగా హెచ్చరిక చేస్తున్నట్లు తన ట్వీట్‌లో ఈసీ చెప్పింది. కచ్చితంగా ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు నిర్భయంగా, స్వేచ్ఛగా జరుగుతాయని పేర్కొన్నది. బుధవారం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తృణమూల్ నేతలు కలిశారు. అక్కడ టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ సీఈసీపై గట్టిగా అరి చినట్లు




తెలిసింది. ఆ సమయంలో సీఈసీ జ్ఞానేశ్, డెరిక్ ఒబ్రెయిన్ మధ్య వాగ్వాదం నడి చింది. తమను వెళ్లిపోవాలని సీఈసీ అరిచినట్లు ఒబ్రెయిన్ ఆరోపించారు. టీఎంసీ నేత చేసిన వ్యాఖ్యలను ఈసీ కొట్టిపారేసింది. సీఈసీని కలిసినవారిలో మేనకా గురుస్వామి, సాగరికా ఘోష్, సాకేత్ గోకలే ఉన్నారు. 27 లక్షల మంది ఓటర్ల తొలగింపు అంశంలో ఈసీతో చర్చించేందుకు టీఎంసీ ప్రయత్నించింది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## గుజరాత్ ప్రజలకు క్షమాపణలు చెప్పిన ఖర్గే

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** గుజరాత్ ప్రజల గురించి తాను చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే క్షమాపణలు చెప్పారు. గుజరాత్ ప్రజల పట్ల నాకు ఎప్పుడూ అత్యంత గౌరవం ఉంది, ఎప్పటికీ ఉంటుంది. వారి మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం కాదని అన్నారు. ఆదివారం కేరళలోని ఇడుక్కి జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఖర్గే మాట్లాడుతూ, గుజరాత్‌లోని నిరక్షరాస్యుల వలె కాకుండా, రాష్ట్ర ప్రజలు విద్యావంతులు, తెలివైనవారని, వారిని తప్పుదోవ పట్టించలేరని అన్నారు. ఆయన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. దీంతో మల్లిఖార్జున ఖర్గే వివరణ ఇచ్చుకున్నారు. గుజరాత్ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. బీజేపీ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, ఖర్గే ప్రకటనతో రాహుల్ గాంధీ ఏకీభవిస్తున్నారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి కించిత్ ఇంగితజ్ఞానం ఉంటే, ఆయన ఆ వ్యాఖ్య నుండి తనను తాను దూరం చేసుకోవాలి, దానిని ఖండించాలి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లిఖార్జున ఖర్గే నేడు నిర్వహిస్తున్న పదవిని గతంలో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, మోలానా ఆజాద్, సోనియా



గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, చివరికి రాహుల్ గాంధీ వంటి నాయకులు కూడా నిర్వహించారని రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఇంతటి ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి ఎలాంటి భాషను ఉపయోగిస్తున్నారు ఖర్గే వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయంటూ ఖండించారు. వివాదం ముదిరిపోతుండటాన్ని చూసి, మల్లిఖార్జున ఖర్గే బుధవారం క్షమాపణ చెప్పారు. కేరళలో ఇటీవల చేసిన ఎన్నికల ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారు. నేను బాధ్యతాయుతంగా విచారం వ్యక్తం చేస్తున్నాను. గుజరాత్ ప్రజల పట్ల నాకు ఎల్లప్పుడూ అత్యంత గౌరవం ఉంది, ఎప్పటికీ ఉంటుంది. వారి మనోభావాలను దెబ్బతీయడం నా ఉద్దేశం ఎప్పుడూ కాదంటూ వారికి క్షమాపణలు చెప్పారు.

# తమిళనాట అభ్యర్థుల్లో సూపర్‌రిచ్ లీమా రోజ్

## మొత్తం రూ.6 వేల కోట్ల విలువైన ఆస్తులున్నట్లు అఫిడవిట్



**చెన్నై, ఏప్రిల్ 8:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 58 ఏళ్ల అన్నాడీఎంకే అభ్యర్థిని లీమా రోజ్ అత్యధిక సంపన్నురాలిగా నిలిచారు. ఆమె కుటుంబ ఆస్తుల విలువ రూ.5,863 కోట్లు కాగా, స్వయంగా ఆమె ఆస్తుల విలువే రూ.1,049 కోట్లుగా ఉన్నది. తిరుచ్చి జిల్లా లాల్గుడి నియోజకవర్గం నుంచి లీమా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. లీమా లాటరీ టికెట్ల విక్రయ సంస్థ అధినేత మార్టిన్ సతీమణి. ఆమె ఇటీవలే అన్నాడీఎంకే పార్టీలో చేరారు.

లీమా తన నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను వెల్లడించారు. తన పేరిట 19 కిలోల బంగారం, 1,217 క్యారెట్ల వజ్రాలు, 13 కిలోల వెండి, 33 గ్రాముల ప్లాటినం ఉన్నాయని ఆమె తెలిపారు. తనకు రూ.139.63 కోట్ల చరాస్తులు, రూ.909.94 కోట్లు స్థిరాస్తులు, రూ.8.57 కోట్ల అప్పులు ఉన్నాయని తెలిపారు.

తన భర్త మార్టిన్ పేరిట రూ.4,100 కోట్ల పైచిలుకు ఆస్తులు ఉన్నాయని వెల్లడించారు. అందులో రూ.887.36 కోట్ల విలువైన చరాస్తులు, రూ.3,262 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నాయన్నారు. తన భర్త పేరిట 281 గ్రాముల బంగారం, 9.83 క్యారెట్ల వజ్రాలు, 21 కిలోల వెండి, 321 గ్రాముల విలువైన ముత్యాలు ఉన్నాయని లీమా తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. కుమారుడు జోస్ చార్లెస్ మార్టిన్ పేరిట కూడా రూ.655 కోట్లు విలువైన ఆస్తులు ఉన్నాయని పేర్కొన్నారు. తన కుటుంబం మొత్తం ఆస్తుల విలువ సుమారుగా రూ.6 వేల కోట్లు ఉంటుందని తెలిపారు.

అదేవిధంగా ఆమె ఆరో తరగతి వరకు మాత్రమే చదువుకున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తనపై నాలుగు పెండింగ్ కేసులు కూడా ఉన్నట్లు వెల్లడించారు.



## మమత నామినేషన్ దాఖలు

**కోల్‌కతా, ఏప్రిల్ 8:** పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీ పుర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితం అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే అన్నారు. ఇక బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23,29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.



## మొహిసినా కిద్వాయ్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి మొహసినా కిద్వాయ్ కన్నుమూశారు. ఆమె వయస్సు 94 సంవత్సరాలు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె బుధవారం తెల్లవారు జామున నోయిడాలోని మెట్రో ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆమె పార్థివ దేహానికి ఈ సాయంత్రం 5 గంటలకు దేశ రాజధానిలోని నిజాముద్దీన్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ మంత్రివర్గాల్లో కీలకశాఖలు నిర్వర్తించారు. మొహసినా కిద్వాయ్ మరణం పట్ల కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంతాపం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి విధేయురాలిగా అభివర్ణించారు. ఈ కష్టసమయంలో ఆమె కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. 1932 జనవరి 1న ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో జన్మించిన మొహసినా కిద్వాయ్, చిన్న వయసులోనే ప్రజా జీవితంలోకి వచ్చారు. తొలుత రాష్ట్రం, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు.

9-4Pg6exHMNWJQE 10_9-4Pg6exHMNWJQE.qxd 08/Apr/26 10:57 PM Page 1



# సిఆర్ఓ పరిపాలన భవనం కోసం వెదుకులాట!



## - పాత అన్నపూర్ణక్యాంటీన్ స్థలానికి గ్రహణం!
## - రాంభగీచా బస్టాండ్ సమీపంలో సేకరణ

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి: :** రోజువారీగా లక్షమంది వరకు తిరుమలకు వస్తున్న భక్తులకు సకాలంలో మరింత సంతృప్తికరంగా వసతి, దర్శనం సేవలందించే దిశగా టిటిడి అధికారులు చూస్తున్నారు. ఇప్పటికే బాలాజీ ఆర్టీసి బస్టాండ్‌కు సమీపంలో పాత సిఆర్ఓ కార్యాలయం నడుస్తోంది. ఇప్పటి అవసరాలకు తగ్గట్లు అక్కడ భవనం పాతబడటం, సరిపోవకపోవడంతో కొత్తగా నిర్మించాలని బోర్డు పెద్దలు, టిటిడి అధికారులు ఆలోచన. ఇందుకు బోర్డు కూడా అనుమతించడంతో అవసరమైన స్థలం కోసం వెదుకులాట మొదలుపెట్టారు.కొండపై కేంద్రీకృత టిటిడి పరిపాలనా భవనాన్ని (సిఆర్ఓ)నిర్మించేందుకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మంగళవారం తనిఖీలు నిర్వహించడం విశేషం.

రామ్ భగీచా బస్టాండ్ కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని కూడా పరిశీలించడం జరిగింది.

రాష్ట్రప్రభుత్వం తరహాలో అనేక శాఖలతో పాలనసాగించే సచివాలయం తరహాలో టిటిడిలో మినీసచివాలయం(తిరుపతిలోని పరిపాలనభవనం)లాగే తిరుమలలో కూడా మరో మినీసచివాలయం నిర్మాణానికి అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. నూతన సిఆర్ఓ భవనాన్ని అత్యాధునిక హంగులతో అన్ని విభాగాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా నిర్మాణం చేయనున్నారు. తిరుమలలో ప్రధానంగా వసతి కల్పన, దర్శనం, పరకామణి పర్యవేక్షణ, అదనపు ఇఒ కార్యాలయం, జెఇఒ కార్యాలయం ,డిప్యూటీ ఇఒలు, రెవెన్యూ,పంచాయతి విభాగాలు,కీలకమైన విజిలెన్స్ విభాగం, కమాండ్ కంట్రోల్ రూమ్ ఇతరత్రా విభాగాలు పలు చోట్ల దూరందూరంగా విసిరేసినట్లున్నాయి.వీటన్నిటినీ ఒకే గొడుగుక్రిందకు తీసుకురావాలని ఆలోచనతో ఉన్నారు. అధికారులు ఒకేప్రాంగణంలో అందుబాటులో ఉండి భక్తులకు సేవలందించడంలో సమన్వయంగా పనిచేసేలా చూడాలనేది ప్రస్తుత బోర్డు ,అధికారుల ఆలోచన. ఇందుకు గతంలోనే తీసుకున్న నిర్ణయం మేరకు డిఎంబి రోడ్డులోని పాత అన్నపూర్ణక్యాంటీన్ భవనాన్ని సిఆర్ఓగా అధునాతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారుచేశారు. ఈభవనం చుట్టూ సరైన పార్కింగ్ సౌకర్యం కూడా కల్పించేదిశగా ప్రణాళిక. అయితే 7,700మంది శాశ్వత ఉద్యోగుల్లో 2వేలమంది వరకు తిరుమలలోనే ఉంటున్నారు. దేవస్థానం యొక్క రోజువారీ పరిపాలన, కార్యకలాపాలు ఇక్కడ నుండే నిర్వహించేందుకు సులభమవుతుంది. ఆలయ నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, దేవస్థానం సంబంధిత పనులను పర్యవేక్షించేందుకు అన్ని విభాగాలు, అధికారులు ,ఉద్యోగులు ఉంటారని, తిరుమలలో కూడా మినీసచివాలయం అవసరం ఉందని భావించారు. ఈ భవనం నిర్మాణం పూర్తయితే సామాన్యభక్తులకు కొండపై గదులు సులభంగా కేటాయించే విధంగా నూతన విధానాన్ని అమలుచేయాలని ఆలోచనతోఉన్నారు.

-వసతికల్పన ధ్యేయంగా అడుగులు:

తిరుమలకు వచ్చిన సామాన్యభక్తులు గదుల కోసం ఇబ్బందులు పడకుండా సులభంగా గదులు పొందేలా ఎఐ విధానం అమలుచేయడం, నూతన సిఆర్ఓ భవనం నిర్మాణమైతే వసతి కల్పన విభాగాల విచారణ కార్యాలయాలు, గదుల కేటాయింపు కౌంటర్లు ఒకేచోట ఉండే వీలుకలుగుతుంది.

# డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి: మంత్రి అచ్చెన్నాయుడు

**పెనుమంట్ర, ఏప్రిల్ 8 పశ్చిమ గోదావరి జిల్లా ప్రభాతవార్త:** మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చన్నాయుడు అన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నందున మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మారుటేరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా" మారుతున్న వాతావరణ పరిస్థితులు - సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామ స్థాయిలోనే రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ సాగు పద్ధతులను విస్తృతంగా అనుసరించాలని రైతులకు పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలువల ఆధునీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును రాబోయే పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ప్రధానమంత్రి సన్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. రైతులు భూసార పరీక్షలపై తప్పకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులు సాగు చేయడానికి ఆలోచన చేయాలన్నారు. దేశీయ వినియోగాల్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నదులు అనుసంధానం ద్వారా సాగునీటి కొరత లేకుండా సాధ్యపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

# రైల్వే ట్రాక్ నిర్వహణతో పలు రైళ్లు రద్దు : దక్షిణ మధ్య రైల్వే

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల మీదుగా ప్రయాణించే రైల్వే ప్రయాణికులకు దక్షజణ మధ్య రైల్వే ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. వివిధ ప్రాంతాల్లోరైల్వే ట్రాక్ నిర్వహణ పనులు మరియు భద్రతా కారణాల దృష్ట్యా సుమారు 15 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. దీనివల్ల నిత్యం రైళ్లలో ప్రయాణించే వైల మంది ప్రయాణికులపై ప్రభావం పడనుంది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య నడిచే మెము, డెము, రైళ్లు ఈ రద్దు జాబితాలో ఉన్నాయి. విజయవాడ , విశాఖపట్నం, కాచిగూడ, గుంటూరు, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల నుంచి నడిచే లోకల్ రైళ్లు ఎక్కువగా రద్దయ్యాయి. వేసవి కాలం కావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం కొంత ఇబ్బందికరమైనప్పటికీ సురక్షిత ప్రయాణం కోసం ట్రాక్ మరమ్మతులు అత్యవసరనమి అధికారులు స్పష్టం చాశారు. కొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. ఇంకొన్ని రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులు చేసినట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ 15 రైళ్ల రద్దు ఏప్రిల్ 12,2026 వరకు అమలులో ఉంటుంది. రద్దైన రైళ్ల వివరాల్లోకి వెళ్తే.. విజయవాడ విశాఖపట్నం కాకినాడ పోర్ట్-విశాఖపట్నం, విజయవాడ-తెనాలి, విజయవాడ - ఒంగోలు, గుంటూరు-తెనాలి, విశాఖపట్నం-మచిలీపట్నం, మచిలీ పట్నం- విశాఖపట్నం. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకునే ముందు రైల్వే ఎంక్వయిరీ లేదా నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టిమ్ యాప్ ద్వారా రైళ్ల స్థితిగతులను తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. స్టేషన్లకు వెళ్లిన తర్వాత ఇబ్బంది పడకుండా ఉండేందుకు రైల్వే వెబ్‌సైట్‌ను కూడా పరిశీలించాలని కోరారు. రద్దైన రైళ్లకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడం ద్వారా తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోవచ్చు.

# విశాఖపట్నం మౌనిక హత్య కేసులో మరో ట్విస్ట్

**విశాఖపట్నం** గాజువాకలో సంచలనంరేపిన మోనిక హత్య కేసులో పోలీసులు దర్యాప్తు చేస్తుండగా ఊహించని ట్విస్ట్ బయటకొచ్చింది.. తాజాగా తెరపైకి కొత్త విషయాలు వస్తున్నాయి. ఈ నెల 30న రవీంద్ర మోనికను హత్య చేయగా.. పోలీసులు అతడి స్నేహితుడి ఇంటిని తనిఖీ చేశారు. అయితే ఆ ఇంట్లో కీలక ఆధారాలు లభ్యం అయ్యాయి.. రవీంద్ర తన స్నేహితుడు ఇంట్లో మోనికను హత్య చేశాడు. అనంతరం సూట్‌కేస్‌లో మృతదేహాన్ని తన ఇంటికి తీసుకెళ్లి అక్కడ ముక్కలు చేశాడు. తాను ఉంటున్న ఫ్లాట్‌లోనే హత్య చేసి ముక్కలు ముక్కలుగా చేసినట్లు క్రియేట్ చేశాడు. పోలీసులు సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా.. అసలు మోనిక రవీంద్ర ఇంటికి రాలేదని తేలింది. రవీంద్ర పోలీసుల్ని తపపుదోవ పట్టించాలని చూశాడు.. కానీ దొరికిపోయాడు. పోలీసులు నిందితుడు రవీంద్రను మూడు రోజులు కస్టడీకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.. మోనిక హత్యలో ఇంకెవరి హస్తం ఉందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం జిల్లా రాజాంకు చెందిన చింతాడ రవీంద్ర నేవీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. విశాఖపట్నంలోని ఎల్.వి.నగర్‌లో ఓ అపార్టుమెంట్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అయితే రవీంద్రకు 2021లో కరోనా లాక్‌డౌన్ సమయంలో విశాఖపట్నం పరిధిలోని సాలిగ్రామపురానికి చెందిన మోనికతో ఒక డేటింగ్ యాప్ ద్వారా పరిచయం ఏర్పడింది. మోనిక కుటుంబం విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం సంజీవయ్యకాలనీలో నివాసం ఉంటోంది. మోనిక తండ్రి వేణుగోపాల్ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం కాగా.. మోనిక చిన్న కుమార్తె. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పార్ట్ టైమ్ జాబ్ చేస్తోంది మోనిక. దీంతో పాటు పెళ్లి ఈవెంట్లలో పనిచేస్తూ ఉంటుంది. రవీంద్ర, మోనికల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఇద్దరూ ఒకర్నొకరు ఇష్టపడ్డారు. పెళ్లి చేసుకుందామనుకున్నారు. అయితే, ఆ తర్వాత వారి మధ్య అభిప్రాయభేదాలు వచ్చి బ్రేకప్ చెప్పుకొని విడిపోయినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత రవీంద్ర రాజాంకు చెందిన మరో మహిళను వివాహం చేసుకున్నాడు. రవీంద్ర, మోనిక బ్రేకప్ చెప్పుకున్నా.. స్నేహం కొనసాగించారు. ఇంతలో రవీంద్ర భార్య పుట్టింటికి వెళ్లడంతో రవీంద్ర, తన గర్ల్‌ఫ్రెండ్‌ను తరచూ కలవడం మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మోనికను పిలిచిన రవీంద్ర అత్యంత పాశవికంగా అంతమొందించాడు. మోనిక శరీరాన్ని 3 ముక్కలుగా చేసి, కొన్ని భాగాలను ఫ్రిజ్‌లో పెట్టాడు. మరి కొన్ని భాగాలను గోనె సంచిలో కట్టి, మంచం కింద పెట్టెలో దాచిపెట్టాడు. తల భాగం, కాళ్లు, చెప్పులు, సిమ్ కార్డును సూట్ కేసులో పెట్టి దారపాలెంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి దహనం చేశాడు. రవీంద్ర తన ఫ్లాట్‌లోని గదిని శుభ్రంచేసి పర్‌ఫ్యూమ్ కొట్టాడు. మోనిక తన వద్ద నుంచి మూడున్నర లక్షల రూపాయలు తీసుకుందని పోలీసులతో రవీంద్ర చెప్పాడు. తరచూ డబ్బుల కోసం వేధిస్తోందని తెలిపాడు. ఆమెను అంతమొందించినట్లు చెప్పాడు.

# జువ్వలదిన్నెలో మెరైన్ అడిషనల్ ఎస్పీ తనిఖీ



**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుండి సముద్ర తీరని మెరైన్ అడిషనల్ ఎస్పీ మధుసూదన్ రావు బుధవారం తనిఖీలు నిర్వహించారు . మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్న బోటులో కొంత దూరం వెళ్లి పరిశీలించారు. ఇటీవల తమిళ నాడు మత్స్యకార బోట్లు తప్పించుకొని పోవడంపై మెరైన్ పోలీసులు సముద్ర తీరంలో గస్తీ నిర్వహిస్తున్నట్లు మెరైన్ అడిషనల్ ఎస్పీ మధుసూదన్ రావు తెలిపారు. తమిళనాడు పాండిచ్చేరి బోట్లు ఆంధ్ర తీరంలోకి రాకుండా గట్టి భద్రత చర్యలు తీసుకుంటున్నట్టు విలేకరులకు తెలిపారు . ఏవైనా తమిళనాడు బోట్లు తీరంలోకి వస్తే వాటిని అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట పోలీసులు పాల్గొన్నారు.

# బెజవాడలో రూ.2కోట్ల హవాలా సొమ్ము పట్టివేత

## - ఇద్దరు నిందితుల అరెస్ట్

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 8,ప్రభాతవార్త**

బెజవాడలో గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.2 కోట్ల హవాలా సొమ్ము మంగళవారం అర్థరాత్రి బయటపడింది. గుణదల సిఐ తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్‌కు చెందిన బలవంత్‌సింగ్ సోలంకి,చోహాన్ అల్పేష్‌కుమార్‌లు గుజరాత్‌లో అమిత్ అనే సేట్ వద్ద పనిచేస్తున్నారు. ఆయన ఆదేశాల ప్రకారం మంగళవారం రాత్రి టాటా నెక్సాన్ కారులో విజయవాడ నగరానికి వచ్చారు. తిరిగి ఆ సేట్‌ను సంప్రదిస్తే ఆ రూ.2 కోట్ల హవాలా సొమ్ము ఎవరికివ్వాలో తెలియచేస్తాడని, ఆయన ఫోన్ కోసం వేచి చూస్తుండగా గుణదల ప్రాంతంలో గుణదల సిఐ వారి కారును పట్టుకుని తనిఖీ చేశారు. ఆ తనిఖీలో రూ.2 కోట్ల సొమ్ము బయటపడింది. దానికి సంబంధించి ఏ విధమైన పత్రాలు, కాని బిల్లులు కాని చూపించక పోవడంతో దానిని హవాలా సొమ్ము అని పోలీసులు నిగ్గు తేల్చారు. వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. వీరిని నేడు ఇన్‌కంటాక్స్ అధికారులకు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన సేఠ్ అయిన గుజరాత్‌కు చెందిన అమిత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతను పట్టుబడితో ఈ కేసులో మరిన్ని వివరాలు దొరకవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# చెన్నై పడవ పట్టివేత

## - సముద్ర జలాల్లో నిఘా కట్టుదిట్టం



**తోటపల్లి గూడూరు (నెల్లూరు), ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలం -ముత్తుకూరు సరిహద్దు పరిధిలోని కృష్ణపట్నం పోర్ట్ సమీప సముద్ర జలాల్లో బుధవారం చెన్నైకు చెందిన ఒక అనుమానాస్పద పడవను అధికారులు గుర్తించి పట్టుకున్నారు. పోర్టుకు సుమారు ఆరు నాటికల్ మైళ్ల దూరంలో సంచరిస్తున్న ఈ పడవపై గస్తీ సిబ్బంది నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్నారు. అనుమతులు లేకుండా సముద్రంలో చేపల వేట నిర్వహిస్తూ తిరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే చర్యలు చేపట్టి పడవను నిలిపివేసి సమగ్ర తనిఖీలు నిర్వహించారు. పడవలో ఉన్న సిబ్బందిని విచారిస్తూ వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తీర ప్రాంత భద్రత దృష్ట్యా సముద్ర జలాల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు మత్స్యశాఖ అధికారి ఏడి చాంద్ భాషా తెలిపారు.

# ఇండిగో విమానంలో సాంకేతిక లోపం

**విశాఖపట్నం, ఏప్రిల్ 8:** విశాఖపట్నం నుంచి తిరుపతి బయలుదేరిన ఇండిగో విమానం లో అనూహ్యంగా సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ సమయంలో ఒక్కసారిగా ఈ సమస్య ఎదురుకావడంతో అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని రన్‌వేపైనే సురక్షి తంగా నిలిపివేశారు. ఊహించని ఈ పరిణామంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో విమానంలో ఏసీ కూడా ఆగిపోవడంతో ఉక్కపోతతో నరకయాతన అనుభవించారు. ప్రయాణం భారీగా ఆలస్యం కావడం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహించిన ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో ఇండిగో సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగారు. దీంతో విశాఖ విమానాశ్రయంలో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇండిగో యాజమాన్యం తక్షణమే స్పందించింది. సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు ఇంజనీర్ల బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. విమానయానంలో ఇలాంటి లోపాలు అరుదుగా వస్తుంటాయి, కానీ ఇవి ప్రయాణికుల భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

# నేటి నుంచి డిసిపల్లిలో పొగాకు కొనుగోళ్లు

**మర్రిపాడు (నెల్లూరు), ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** జిల్లాలోని మర్రిపాడు మండలం డిసిపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం నుండి పొగాకు కొనుగోళ్ళు ప్రారంభమవుతాయని వేలం కేంద్ర నిర్వహణాధికారి సునీల్‌కుమార్ బుధవారం తెలిపారు. డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 2095మంది రైతులు 1742.75 బారన్‌లకు సరిపడా పొగాకును రిజిస్ట్రేషన్ చేసుకున్నా మన్నారు. అందుకు సంబంధించి పొగాకు బోర్డు 6.38 మిలియన్‌కేజీల పొగాకుకు అనుమతి ఇచ్చిందన్నారు. అయితే రైతుల నుండి 10.20మిలియన్ కేజీల పొగాకు వస్తుందని అంచనా వేయడం జరిగిందన్నారు. ఈ బోర్డు పరిధిలో 5295 హెక్టార్లలో రైతులు పొగాకును సాగుచేశారన్నారు. ఏది ఏమైనప్పటికీ గిట్టుబాటు ధరలు లభిస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందక తప్పడం లేదు.ప్రస్తుత ఏడాది పొగాకు పంటను పండించేందుకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాచేసిన నేపథ్యంలో ధరలపై రైతులు డోలాయమానంలో మునిగి తేలుతున్నారు. ఒకవేళ గిట్టుబాటు ధరలు లభించకపోతే నష్టాలు తప్పవని రైతులు వాపోతున్నారు.

# రాష్ట్రంలో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి

## ఆర్ అండ్ బి మంత్రి బిసి జనార్థన్ రెడ్డి

## రూ.98 కోట్లతో గుంటూరు శంకర్ విలాస్ ఆర్వోబి నిర్మాణం

**గుంటూరు ఏప్రిల్ 8 ప్రభాత వార్త ప్రతినిధి :** గుంటూరు నగరంలో నూతనంగా చేపట్టిన శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బుధవారం పర్యవేక్షించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సేతు బంధన్ పథకం కింద రూ.98 కోట్లతో నిర్మిస్తున్న 4 లేన్ల ఆర్వోబి నిర్మాణ పనులు నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరు నగరంలో 70 ఏళ్లుగా సేవలందిస్తున్న శంకర్ విలాస్ ఆర్వోబికు సీఎం సూచనల మేరకు మోక్షం కల్పించామన్నారు. గుంటూరు ప్రజల చిరకాల వాంఛను కూటమి ప్రభుత్వం సాకారం చేస్తుందని అన్నారు. భవిష్యత్తులో విద్యుత్ లైన్లు, డబుల్ డెక్కర్ వంటి రైళ్లకు ఇబ్బంది లేకుండా ఆర్వోబి ఎత్తును పెంచుతున్నామని అన్నారు.2027 మే నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని అనునిత్యం కూటమి నేతలు, ప్రభుత్వ అధికారులు ఈ ప్రాజెక్టును పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.గుంటూరు జిల్లాలో 974 కి.మీ ఆర్ అండ్ బీ రోడ్లు ఉండగా, ఇప్పటికే రూ. 159.41 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 27 వేల కిలోమీటర్ల రహదారులను కేవలం 9 నెలల్లో గుంతల రహితంగా తీర్చిదిద్దామని అన్నారు. 20 నెలల కాలంలో రాష్ట్రంలో రూ. 3000 కోట్లతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న రాష్ట్రంలో రహదారులకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఒక లక్ష కోట్ల జాతీయ రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కూడా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గుంటూరు ప్రజలకు వైసీపీ ప్రభుత్వ పాలనలో ఏం అభివృద్ధి జరిగిందో తెలుసని అన్నారు.నేడు వైసీపీ నేతలు రాజకీయ ఉనికి కాపాడుకోవడానికి కావాలనే శంకర్ విలాస్ ఆర్వోబీపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. గతంలో 151 సీట్లు ఇస్తే రాష్ట్రాన్ని గాలి వదిలేశారని మంత్రి లోకేష్ హామీ మేరకు యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నామని అన్నారు. విశాఖ సిఐఐ ద్వారా 16 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని విశాఖ, అమరావతి, రాయలసీమను సమదృష్టితో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఆరు ఎయిర్పోర్ట్ లు రానున్నాయని 4 గ్రీన్ ఫీల్డ్ పోర్టుల అభివృద్ధి వేగవంతంగా సాగుతుందని అన్నారు.అమరావతి రాజధానికి కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా మారుస్తామని చెప్పడం అంటే అది మూర్ఖులు మాత్రమే చేసే పనే అని ఎద్దేవా చేశారు. జీవితంలో మళ్లీ వైసిపి అధికారంలోకి రాదని. వైసిపి నేతల కలలు కలలుగానే మిగిలిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవి మహమ్మద్ నజీర్ అహ్మద్, మాజీ మేయర్ కోవెలమూడి రవీంద్ర, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, రహ దారులు, భవనాలు శాఖ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ సెలూన్ షాప్‌కు రూ.72 లక్షల జిఎస్టీ

**విజయవాడ ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో నగరంలో ఓ గమ్మత్తు చోటు చేసుకుంది.ఒక సామాన్య సెలూన్ నిర్వాహకుడికి అనుహ్యంగా రూ.72లక్షల జీఎస్టీ పడింది.దాంతో అతను బావురుమంటున్నాడు. కేవలం కత్తెర, దువ్వెనతో జీవనం సాగించే వ్యక్తికి రూ.కోట్లు టర్నోవర్ ఉన్న మరో వ్యాపారం అతను చేస్తున్నట్లు నోటీసులు పంపడం అనే అంశం సర్వత్రా చర్చకు దారి తీసింది. విజయవాడ పంజా సెంటర్ సమీపంలో గత నాలుగు దశాబ్దాలుగా సెలూన్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న పైడాడ శ్రీనివాసరావు అనే వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. తన జీవితంలో ఎన్నడూ చూడని రీతిలో సుమారు రూ.72 లక్షల జీఎస్టీ బకాయి చెల్లించాలని జీఎస్టీ అధికారుల నుంచి ఆయనకు నోటీసులు అందాయి. విశ్వాఖపట్నం కేంద్రంగా భారీ ఎత్తున స్క్రాప్ ఐరన్ వ్యాపారం నిర్వహించినట్లు, దానికి సంబంధించిన పన్నులు చెల్లించలేదని అధికారులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. తనకు తెలియకుండానే తన పేరు మీద ఇంత పెద్ద మోసం జరుగుతోందని శ్రీనివాసరావుకు మొదట తెలియలేదు. అయితే.. ఇటీవల ఆయన తన బ్యాంక్ ఖాతా నుంచి నగదు తీసుకోవడానికి వెళ్లినప్పుడు, ఖతా హోల్డ్ లో ఉన్నట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారు. జీఎస్టీ అధికారుల ఆదేశాల మేరకే ఈ చర్య తీసుకున్నామని వారు స్పష్టం చేశారు. దీంతో కంగుతిన్న ఆయన, తన ఆవేదనను అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. చిన్నప్పటి నుంచి సెలూన్ షాపులో కష్టపడి బతుకుతున్నాను. నాకు ఇనుప వ్యాపారంతో సంబంధం లేదు అని చెప్పినా అధికారులు మాత్రం విశాఖ వెళ్లి వివరణ ఇవ్వాలని సూచించారు. ఈ ఉదంతం వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు స్థానికులు బాధితుడు అనుమానిస్తున్నారు. శ్రీనివాసరావుకు తెలియకుండానే ఆయన ఆధార్, పాన్ కార్డు వంటి వ్యక్తిగత వివరాలను సేకరించిన గుర్తుతెలియని వ్యక్తులు, వాటితో నకిలీ కంపెనీని సృష్టించి ఉంటారని భావిస్తున్నారు. ఇలాంటి నకిలీ లావాదేవీల వల్ల ఆయన ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కేవలం ఆర్థిక పరమైన ఇబ్బందులే కాకుండా..ఈ వివాదం కారణంగా ఆయనకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ప్రస్తుతానికి నిలిచిపోయాయి. ప్రస్తుతం శ్రీనివాసరావు తన నిజాయితీని నిరూపించుకోవడానికి అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. డిజిటల్ యుగంలో వ్యక్తిగత పత్రాలు ఎంత సులభంగా దుర్వినియోగం అవుతున్నాయో చెప్పడానికి ఈ సంఘటనే నిదర్శనం.

అధికారులు లోతైన విచారణ జరిపి... అసలు నిందితులను పట్టుకోవాలని అమాయకుడైన శ్రీనివాసరావుకు ఈ పన్నుల భారం నుంచి విముక్తి కలిగించాలని బాధితుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# తిరుమలలో టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు గదుల కొరత!

**తిరుమల,ఏప్రిల్ 8ప్రభాతవార్తప్రతినిధి: :** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు పలు రకాల దర్శన టిక్కెట్లు,టోకెన్లుతో వస్తున్న భక్తులకు పూర్తిగా గదులు ఇవ్వడం నిలుపుదలచేశారు. ఆయా భక్తులు సమయానికి కొండకు చేరుకుని వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలో వెళ్ళి దేవదేవుడ్ని దర్శనం చేసుకోవాలని టిటిడి అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ సముదాయాల్లో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఉచిత సర్వదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన భక్తులు ముందుగానే తిరుమలకు చేరుకుని సిఫార్సులేఖలపై గదులు పొందేవారు. ఇలా వస్తున్న వారి సంఖ్య పెరగడంతో గదుల కొరత తీవ్రంగా ఉంది. అంతేగాక ఈ టైమ్‌స్లాట్ భక్తులు టోకెన్‌పై నిర్ధేశించిన రోజు ఆ సమయానికి మాత్రమే కొండకు చేరుకోవాలి. టైమ్‌స్లాట్ టోకెన్ భక్తులకు తిరుమలలో సిఫార్సులేఖలపై గదులు కేటాయింపు పూర్తిగా రద్దుచేశారు. ఇక ఆన్‌లైన్‌లో 300 రూపాయలు టిక్కెట్లు (మూడునెలల ముందుగానే)బుక్‌చేసుకుని తిరుమలకు చేరుకునే భక్తులకు కూడా ప్రత్యేకంగా గదులు కేటాయించడంలేదు. ఈ విధానాన్ని టిటిడి పూర్తిగా రద్దుచేసింది. సుదూర ప్రాంతాల భక్తులకు మాత్రమో సిఫార్సులపై గదులు ఇచ్చేందుకు వసతికల్పన విభాగం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. ఆఫ్‌లైన్‌లో రోజువారీగా 20వేల వరకు టైమ్‌స్లాట్ టోకెన్లు జారీఅవుతున్నాయి. ఆన్‌లైన్‌లో 300 రూపాయలు టిక్కెట్లు 25వేల వరకు విడుదల చేసినా ఈ ఆన్‌లైన్ భక్తులు అదికంగా తమిళనాడు, కర్నాటక,తెలుగురాష్ట్రాల నుండి ఆయారోజుల్లో తిరుమలకు చేరుకుని నేరుగా ఇష్టదైవమ్ దర్శనం చేసుకుని తిరుగుప్రయాణమవుతూన్నారు. వీలైనంత వరకు దర్శన టిక్కెట్లు, టోకెన్లు కలిగిన భక్తులు తిరుపతిలోనూ వసతి పొంది దర్శన సమయానికి రెండు గంటల ముందు తిరుమలకు చేరుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది.

ఇప్పటికే తిరుమలలో ఉన్న గదులు కేటాయింపులో సిఫార్సులేఖల తలనొప్పులు టిటిడి అధికారులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ భక్తులకు పూర్తిగా గదులు కేటాయించడం లేదు. 10,500 రూపాయలు దర్శన టిక్కెట్ కొనుగోలుచేస్తున్న శ్రీవాణి భక్తులకు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో 100రూపాయలు, వెయ్యిరూపాయలు అద్దె గదులను కేటాయిస్తున్నారంటే పరిస్థితి అర్థమవుతుంది. కుటుంబసభ్యుల సంఖ్యకు అనుగుణంగా గదులు కేటాయించాలని ఉన్నతాధికారుల నుండి వసతికల్పన విభాగంకు అందిన సమాచారం.

09-04pg10 12 VJA_09-04pg10.qxd 08/Apr/26 10:47 PM Page 1



## రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# సెహ్రావత్‌కు రజత పతకం



**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో లలిత్ సెహ్రావత్ తొలి గ్రీకోరోమన్ రజత పతకాన్ని సాధించాడు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన ఈ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సెహ్రావత్ గ్రీకోరోమన్ రెజ్లింగ్‌లో పురుషుల 55 కేజీల విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మూడేళ్లలో ఖండాంతర ఛాంపియన్‌షిప్‌లలో గ్రీకోరోమన్ విభాగంలో భారతదేశానికి ఇదే తొలి రజత పతకం. 2023 ఎడిషన్‌లో ఇదే వెయిట్ క్లాస్‌లో రూపిన్ గహ్లావత్ చివరిసారిగా ఈ పతకాన్ని సాధించాడు. సెమీఫైనల్‌లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత హుయోయింగ్ షీపై లలిత్ ఘన విజయం సాధించినప్పటికీ, ఆ ఊపును కొనసాగించలేక ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ఇఖ్తియార్ బోటిరోవ్ చేతిలో 0-9 తేడాతో స్వర్ణ పతక పోరులో ఓడిపోయాడు. ముహమెట్ మాలో ర్యాంకింగ్ సిరీస్‌లో కాంస్య పతకం సాధించిన తర్వాత, వరుసగా రెండవ టోర్నమెంట్‌లోనూ పతకం గెలుచుకొని, ఈ 23 ఏళ్ల యువకుడు ఈ ఏడాదిలో ఇప్పటివరకు అద్భుతంగా రాణించాడు. మరోవైపు, భారతదేశపు అత్యంత ప్రతిభావంతులైన గ్రీకోరోమన్ రెజ్లర్లలో ఒకరైన సునీల్ కుమార్, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో తన ఆరవ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పురుషుల 87 కేజీల విభాగంలో మాజీ ఛాంపియన్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ముఖమ్మద్‌కోదిర్ రసూలోవ్‌పై 5-4 తేడాతో హోరాహోరీగా గెలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అలాగే 19 ఏళ్ల అమన్ బరోనియా తీవ్ర నిరాశకు గురయ్యాడు. దక్షి ణ కొరియాకు చెందిన యోంగ్‌హున్ నోహ్‌తో జరిగిన అధిక స్కోరింగ్ పోరులో, 77 కేజీల కాంస్య పతకం కోసం జరిగిన హోరాహోరీ పోరులో అతను 14-15 తేడాతో ఓడిపోయాడు.

## మహిళల ఆసియా కప్‌లో
# చైనీస్ తైపీపై భారత్ విజయం



**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి అండర్ 20 మహిళల ఆసియా కప్‌లో చైనీస్ తైపీపై భారత్ ఘన విజయం సాధించింది. 22 ఏళ్లలో భారత్ మహిళలకు ఇదే తొలి విజయం. బుధవారం థాయ్‌లాండ్‌లోని పతుమ్ థాని స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో భారత్, చైనీస్ తైపీని 3-1 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. భారత్ తరఫున భూమిక దేవి ఖుముఖ్‌చమ్ (26వ నిముషం), శిబానీ దేవి (32, 87) గోల్స్ చేయగా, తైపీ తరఫున కావో సిన్ (90+3వ నిముషాల్లో) ఒక గోల్ చేసి ఓటమి అంతరాన్ని తగ్గించింది. భారత్ దాదాపు 69 శాతం బంతి నియంత్రణతో ఆధిపత్యం చెలాయించింది.
దాడి విభాగంలో కూడా, టైగ్రెసెస్ తాము సంధించిన 18 షాట్లలో 10 షాట్లను లక్ష్యం వైపు సంధించింది. రిబన్సీ జమున గోల్ కీపర్‌గా ప్రారంభ దశలలో కొన్ని సేవ్‌లు కూడా చేసింది. ఆ తర్వాత 26వ నిమిషంలో, భూమిక కొట్టిన షాట్‌తో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. ఆరు నిమిషాల తర్వాత, భారత హాఫ్ లోపలి నుండి వచ్చిన క్రాస్‌ను అందుకున్న బంతిని శిబాని చాకచక్యంగా అవతలి పోస్ట్‌లోకి కొట్టి, తన జట్టు ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. రెండు గోల్స్‌తో వెనుకబడిన తైపీ, రెండవ అర్ధభాగంలో భారత్ గోల్‌పైకి బంతిని నెట్టినా దాన్ని ఎదుర్కొని దృఢంగా నిలిచింది. 53వ నిమిషంలో చువాన్ త్జుయు ఒక క్రాస్‌ను అందుకుని హెడర్ కొట్టగా, వెనుకబడిన జట్టుకు ఖాతా తెరిచేందుకు ఒక అద్భుతమైన అవకాశం లభించింది. అయితే బాక్స్ లోపల లిన్ పిన్‌సిన్ చేతితో బంతిని తాకడంతో లభించిన పెనాల్టీని సిబానీ గోల్‌గా మలచడంతో భారత్ తన మూడవ గోల్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత స్టాపేజ్ టైమ్ చివరిలో హ్సాన్ గోల్ చేసి తైపీ ఖాతాను తెరిచింది, కానీ అప్పటికే ఆమె జట్టు పోటీ నుండి దాదాపుగా నిష్క్రమించింది.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో
# వరల్డ్ నం.7ను మట్టికరిపించిన ఆయుష్
### తొలి రౌండ్‌లో నిష్క్రమించిన మాళ్విక

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ ప్రారంభ రౌండ్‌లో ఆయుష్ శెట్టి, ప్రపంచ నంబర్ 7, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేతను మట్టికరిపించాడు. బుధవారం చైనాలోని నింగ్బోలో జరుగుతున్న ఆసియా ఛాంపియన్‌షిప్స్ ప్రారంభ రౌండ్‌లో చైనాకు చెందిన ఐదవ సీడ్, 20 ఏళ్ల లీ షి ఫెంగ్‌ను వరుస గేమ్‌లలో 21-13, 21-16 తేడాతో ఓడించి, 51 నిమిషాల్లో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఆయుష్ ఆరంభంలోనే పుంజుకుని 4-4తో స్కోరును సమం చేయగా, 7-7 వరకు లీ స్వల్ప ఆధిక్యంలో నిలిచాడు. అక్కడి నుంచి, భారత షట్లర్ పట్టు సాధించి గేమ్‌ను 21-13 తేడాతో కైవసం చేసుకున్నాడు. రెండవ గేమ్ కూడా అదే రీతిలో సాగింది. లీ మొదట్లో ఒత్తిడి తెచ్చి మధ్య దశలో ఆధిక్యం సాధించాడు. అయితే, ఆయుష్ పలుమార్లు స్కోరును సమం చేసినప్పటికీ, 13-13 వద్ద గేర్లు మార్చాడు.
వరుసగా ఆరు పాయింట్లు సాధించి దూసుకుపోయి, 51 నిమిషాల్లో 21-16 తేడాతో మ్యాచ్‌ను ముగించాడు. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇదే తొలి పోరు. ఈ విజయంతో ఆయుష్ ఇప్పుడు రౌండ్ ఆఫ్ 16లో చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ నంబర్ 20 చి యు జెన్‌తో తలపడనున్నాడు. ఇక మహిళల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన మాళ్విక బన్సోద్ 41 నిమిషాల పోరులో థాయ్‌లాండ్‌కు చెందిన బుసనన్ ఒంగ్‌బమ్రుంగ్‌ఫాన్ చేతిలో 10-21, 19-21 తేడాతో ఓడిపోయి, మొదటి రౌండ్‌లోనే ఛాంపియన్‌షిప్‌ల నుండి నిష్క్రమించింది. మరోవైపు, స్టార్ షట్లర్ పివి సింధు తనకంటే చాలా తక్కువ ర్యాంకులో ఉన్న మలేషియాకు చెందిన లింగ్ చింగ్ వాంగ్‌ను ఓడించింది.





ఆట



# పేరుకే మోనార్క్‌లు
## ఐపిఎల్‌లో ఫ్లాప్ పేయర్లు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌లో ఒక వారం ముగిసింది. ఈ మొదటి వారం కొంతమంది కొత్త ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకోగా, మరికొందరు విఫలమయ్యారు. కొంతమంది స్టార్ ఆటగాళ్లు పేలవ ప్రదర్శనలు కనబరచడంతో తొలి వారంలో ఫ్లాప్ ప్లేయర్స్ జాబితాలో చేరారు. అలాంటి ఐదుగురు స్టార్ ఆటగాళ్లలో పంజాబ్ కింగ్స్ ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ ఈ సీజన్‌లో అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 4 ఓవర్లలో 42 పరుగులు ఇచ్చి వికెట్లేమీ తీయలేదు. తర్వాత చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో కూడా ధారాళంగా పరుగులు ఇచ్చి, 4 ఓవర్లలో వికెట్ తీయకుండా 41 పరుగులు ఇచ్చాడు. ముఖ్యంగా, అతను గుజరాత్ టైటాన్స్‌పై 11 బంతులతో ఒక ఓవర్ వేసి, ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన ఓవర్‌ను నమోదు చేశాడు. ఇక వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ సంజు శాంసన్ ఇప్పటివరకు చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఇబ్బంది పడుతున్నాడు. 3 మ్యాచ్‌లలో 6, 7, 9 పరుగులు మాత్రమే చేసి, అతని ఫామ్‌పై ప్రశ్నలను లేవనెత్తుతున్నాడు. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో సంజు భారత జట్టుకు మ్యాచ్ విన్నర్‌గా నిరూపించుకున్నాడు. కానీ, ఇప్పుడు అతని ఫామ్ సీఎస్‌కేకు తలనొప్పిగా మారింది. కోల్‌కతా నైట్ రైడర్స్ ఖరీదైన విదేశీ ఆటగాడైన కామెరాన్ గ్రీన్ పేరుకు తగ్గట్టుగా రాణించలేకపోయాడు. అతను బౌలింగ్ చేయలేకపోగా, బ్యాటింగ్‌లో కూడా పెద్దగా సహకరించలేదు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో గ్రీన్ 18 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లో 2 పరుగులకే రనౌట్ అయ్యాడు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ సీనియర్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ ప్రదర్శన కూడా నిరాశపరిచింది. జట్టు అతని నుంచి భారీ స్కోరును ఆశించగా, రెండు ఇన్నింగ్స్‌లలో కేవలం 1 పరుగు మాత్రమే చేయగలిగాడు. లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లో రాహుల్ ఖాతా తెరవడంలో విఫలమయ్యాడు. ముంబై ఇండియన్స్‌పై 1 పరుగు మాత్రమే సాధించాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కూడా తొలి రెండు మ్యాచ్‌లలో ప్రభావం చూపడంలో విఫలమయ్యాడు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో 4 ఓవర్లలో 48 పరుగులు ఇవ్వగా, సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 2 ఓవర్లలో 31 పరుగులు ఇచ్చాడు. అతని బౌలింగ్‌లో స్పష్టంగా నిలకడ లోపించింది. అతని లెంగ్త్, లైన్ కూడా స్థిరంగా లేవు.

## ఫిడే కాండిడేట్స్‌లో
# దివ్య సంచలన విజయం
### ప్రజ్ఞానంద రెండో ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల కాండిడేట్స్-2026 టోర్నమెంట్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్, టోర్నమెంట్ లీడర్ అయిన ఉక్రెయిన్‌కు చెందిన అన్నా ముజిచుక్‌ను ఓడించి సంచలనం సృష్టించింది. ఈ విజయంతో దివ్య లీడర్‌బోర్డ్ అగ్రస్థానంలో పోటీకి రంగం సిద్ధమైంది. దీంతో భారతీయ క్రీడాకారిణులు దివ్య, వైశాలిలతో సహా ఐదుగురు చెరో 4.5 పాయింట్లతో సమంగా నిలిచారు. సైప్రస్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సమయ ఒత్తిడిలో అన్నా తన బంటును పొరపాటున కోల్పోవడంతో, దివ్య నల్ల పావులతో గెలిచే స్థితికి చేరుకుంది.
దీంతో ఆమె అన్నాపై కష్టపడి ఒక పెద్ద విజయాన్ని సాధించింది. ఇంతలో, కజకిస్తాన్‌కు చెందిన బిబిసారా అసౌబాయేవా, నల్ల పావులతో డ్రా సాధించి, వైశాలి యొక్క రెండుమ్యాచ్‌ల విజయ పరంపరకు బ్రేక్ వేసింది. గ్రాండ్ స్విస్ ఛాంపియన్ 8వ రౌండ్‌లో ఇటాలియన్ గేమ్‌లో పురోగతి సాధించలేక, టోర్నమెంట్‌లో ఏకైక ఆధిక్యాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయింది. అలాగే ఓపెన్ విభాగంలో గత రౌండ్లలో వరుసగా నాలుగు డ్రాలు చేసుకున్న జీఎం రమేష్‌బాబు ప్రజ్ఞానంద పేలవ ఫామ్ కొనసాగింది. అతను ఈ టోర్నమెంట్‌లో తన రెండవ ఓటమిని చవిచూశాడు. నల్ల పావులతో ఆడుతూ నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి చేసిన కింగ్‌సైడ్ దాడిని ఆపలేక 44 ఎత్తుల తర్వాత ఓటమిని అంగీకరించాడు.





## బులియన్ మార్కెట్లో
# ధరలు పైపైకి!
### తులం బంగారం రూ.3650 పెరుగుదల
### రూ.10వేలు పెరిగిన కిలో వెండి



**ముంబయి, ఏప్రిల్ 8:** బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గిపోవడం ఖరీదైన లోహాలపై ఒత్తిడిని తగ్గించింది. అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాల పాటు యుద్ధ విరమణకు అంగీకారానికి రావడంతో బులియన్ మార్కెట్‌లు ప్రభావితం అయ్యాయి. బంగారం, వెండి అనూహ్యంగా పుంజుకున్నాయి. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.3,650 పెరగగా, కిలో వెండి రూ.10 వేలకు పైగా పెరిగింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం నిన్నటితో పోలిస్తే రూ.1,53,800కు, 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ.2,999 పెరిగి రూ.1,41,000కు చేరింది. కిలో వెండి రూ.10 వేలు పెరిగి నిన్నటితో పోలిస్తే రూ.2.65 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రూ.1,53,970 వద్ద ఉండగా, 22 క్యారెట్ల పసిడి రూ.1,41,150 వద్ద కొనసాగుతున్నాయి. అలాగే ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఇంచుమించు ఒకేధరలు కొనసాగుతున్నాయి. రూ.1,53,820గా కొనసాగాయి. చెన్నైలో మాత్రం 1,54,910 రూపాయలుగా కొనసాగింది. అలాగే వెండిధరల్లో కూడా గణనీయంగా మార్పులు వచ్చాయి. చెన్నైలో 2.65 లక్షలుకాగా ముంబయి, ఢిల్లీ, కోల్‌కత్తా, బెంగళూరుల్లో మాత్రం 2.60 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండిధరలు రూ.2.65 లక్షలుగా కొనసాగినట్లు బులియన్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. వెండిధరలు ఒకేరోజు పదివేలకుపైగా పెరగడం విశేషం.



# ఒక్కరోజులోనే రూ.2350 పెరిగిన షేరు ధర
### ఫోర్స్‌మోటార్స్ షేర్లు పైపైకి

**ముంబయి, ఏప్రిల్ 8:** స్టాక్ మార్కెట్లలో మల్టీనేషనల్ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్ ఫోర్స్ మోటార్స్ అదరగొట్టింది. ఈ స్టాక్ బుధవారం సెషన్‌లో భారీగా పెరిగింది. ముందురోజు ఈ స్టాక్ ధర రూ. 19,920 వద్ద ముగియగా ఇవాళ నేరుగా దాదాపు రూ.1000 మేర పెరిగిరూ. 20, 900 వద్ద ఓపెన్ అయింది. ఇంట్రాడేలో దాదాపు 12 శాతం పెరిగింది. దీంతో ఒక్కో షేరుపై సుమారు రూ. 2350 కు పైగా పెరగడంతో రూ. 22,290 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 11.10 శాతం లాభంతో రూ. 22,131 వద్ద స్థిరపడింది. ఇక్కడ ఒక్కో షేరుపైనే రూ. 2,211 పెరిగింది.
దీంతో ఇందులో ఇన్వెస్ట్ చేసిన వారికి కాసుల పంట పండింది. స్టాక్ మార్కెట్లో సానుకూలతలు సహా కంపెనీ పెర్ఫామెన్స్ ఇన్వెస్టర్లను ఆకర్షించింది. ఫోర్స్ మోటార్స్ గత ఆర్థిక సంవత్సరంలో (2025-26) దేశీయంగా ఏకంగా 36,536 యూనిట్లను విక్రయించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే కార్ల సేల్స్ 20 శాతం పెరిగాయి. దీంతో ఇన్వెస్టర్లలో జోష్ నెలకొంది. సెంటిమెంట్ బలపడింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 26,450 కాగా కనిష్ఠ ధర రూ. 8300 గా ఉంది. సంస్థ మార్కెట్ విలువ రూ. 29.10 వేల కోట్లుగా ఉంది.

# ఇన్వెస్టర్లకు లాభాల పంట!
### ఇరాన్‌వార్‌కు బ్రేక్.. ఆర్బీఐ రెపోరేట్లే కీలకం
### రూ.16 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

వాణిజ్యం




**ముంబయి, ఏప్రిల్ 8:** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు సద్దుమణగడంతో భారత స్టాక్ మార్కెట్లు బుధవారం సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్లాయి. ఇరాన్ - అమెరికా మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు వెలువడిన వార్తలతో ఇన్వెస్టర్లలో ఒక్కసారిగా ఉత్సాహం పెరిగింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే సూచీలు భారీ లాభాల్లోకి వెళ్లాయి. ఈ రోజు మార్కెట్లో సెన్సెక్స్ ఒకదశలో దాదాపు 2,900 పాయింట్లకు పైగా పెరిగి 77,600 మార్కును తాకింది. నిఫ్టీ దాదాపు 890 పాయింట్ల భారీ పెరుగుదలతో 24,000 మైలురాయిని అధిగమించింది. కేవలం ఒక్క రోజులోనే ఇన్వెస్టర్ల సంపద దాదాపు రూ.16 లక్షల కోట్ల మేర పెరగడం గమనార్హం. మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణాలుగా అమెరికా ఇరాన్‌లు రెండువారాల పాటు కాల్పుల విరమణకు పరస్పర అంగీకారానికి రావడమేనని తెలుస్తోంది. హర్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరుస్తామని ప్రకటించడం కూడా మార్కెట్ల లాభాలకు కారణం కాగా ఇన్వెస్టర్లలో యుద్ధ భయాలను తాత్కాలికంగా తొలగించింది. హర్మూజ్ జలసంధి గుండా రవాణాకు ఇరాన్ అంగీకరించడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర భారీగా తగ్గింది (దాదాపు 13 పతనమై 95 వద్దకు చేరింది). ఇది భారత్ లాంటి దేశాలకు భారీ ఊరట కలిగించే విషయం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను యథాతథంగా 5.25 వద్దనే కొనసాగిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా మార్కెట్‌కు సానుకూలంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 50 పైసల మేర పెరిగి 92.56 వద్దకు చేరింది. ఇవన్నీ భారీ లాభాలకు కారణం అయ్యాయని మార్కెట్ నిపుణుల అంచనా. ఈ రోజు మార్కెట్లో అదానీ గ్రూప్ షేర్లు 13 వరకు లాభపడగా, ఇండిగో, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీ లాభాలను ఆర్జించాయి. బిఎస్ఇలో 3859 కంపెనీల షేర్లు లాభపడ్డాయి. 537 షేర్లు క్షీణించగా 101 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 3.97శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 3.88శాతంచొప్పునపెరిగాయి. ఎంసిఎక్స్‌పసిడిధరలు జూన్ 5నాటి సెటిల్‌మెంట్‌దరలు 1.76శాతంపెరిగి రూ.1,52,900కి చేరింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్లు 14.48 డాలర్లు క్షీణించి బ్యారెల్‌కు 94.79 డాలర్లుగా కొనసాగింది. గ్లోబల్ మార్కెట్లన్నీ లాభాలతో ర్యాలీ తీసాయి. అమెరికా డౌజోన్ ఫ్యూచర్స్, యూరోపియన్‌ఆసియా మార్కెట్లు కూడా ఇరాన్‌ట్రంప్ నిర్ణయాలకు మద్దతుగా ర్యాలీ తీసాయి. నాస్‌డాక్ కాంపోజిట్, ఎస్‌అండ్‌పి 500 కూడా లాభాలతో ర్యాలీతీసాయి.

# అమెరికా కోర్టులో అదానీకి ఊరట

**న్యూయార్కు, ఏప్రిల్ 8:** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి అమెరికా కోర్టులో ఊరట లభించింది. ఆదానిగ్రూప్‌పై యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) నమోదు చేసిన ఫ్రాడ్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు న్యూయార్క్‌లోని ఫెడరల్ కోర్టు అంగీకరించింది. ఈ కేసు అమెరికా చట్టాల పరిధిలోకి రాదని, ఇది పూర్తిగా దేశం వెలుపల జరిగిన వ్యవహారమని అదానీ తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు. భారత్‌లో సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇవ్వజూపారని, ఈ విషయాన్ని అమెరికా పెట్టుబడిదారుల నుంచి దాచిపెట్టి నిధులు సేకరించారని ఆరోపిస్తూ 2024 నవంబర్‌లో ఎస్ఈసీ ఈ కేసును దాఖలు చేసింది. ఈ కేసులో



గౌతమ్ అదానీతోపాటు ఆయన బంధువు సాగర్ అదానీని కూడా ప్రతివాదిగా చేర్చింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా వ్యతిరేకించింది. తమ పిటిషన్‌లో కీలక అంశాలను ప్రస్తావించింది. ఈ కేసు పూర్తిగా భారత్‌కు సంబంధించినదని దీనిపై విచారణ జరిపే అధికారం అమెరికా కోర్టులకు లేదని స్పష్టంచేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 2021లో జారీ చేసిన బాండ్ల అమ్మకం అమెరికా వెలుపల జరిగిందని, ఈ బాండ్ల కాలపరిమితి కూడా ముగిసిందని తెలిపింది. 2024లో అసలు, వడ్డీతో సహా పెట్టుబడిదారులకు పూర్తి సొమ్మును తిరిగి చెల్లించామని, ఎవరికీ ఆర్థిక నష్టం జరగలేదని కోర్టుకు వివరించింది. ఈ నేపథ్యంలో కేసును ప్రాథమిక దశలోనే కొట్టివేయాలని అదానీ తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది.



# రెపోరేట్లు యధాతథం
### పశ్చిమాసియా ఉద్రిక్తతలే కారణం.. 5.25% వద్దనే రెపోరేట్ల స్థిరీకరణ

**ముంబయి, ఏప్రిల్ 8:** భారతీయ రిజర్వు బ్యాంకు మరోసారి రెపోరేట్ల జోలికి వెళ్లలేదు. మూడు రోజులపాటు నిర్వహించిన పాలసీ కమిటీ సమీక్షా సమావేశంలో రెపోరేట్ల పాలసీనిర్ణయాన్ని 5.25శాతం వద్దనే కొనసాగించాలనినిర్ణయించినట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. పశ్చిమాసియా యుద్ధ వాతావరణంలో ముడిచమురుధరలు విపరీతంగా పెరగడం, రూపాయి కనిష్టస్థాయికి పతనం చెందడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆర్బీఐ రెపోరేట్లను యధాతథంగానే కొనసాగించాలని నిర్ణయించింది. అంటే ఇప్పటివరకూ కొనసాగిన 5.25శాతం వద్దనే కొనసాగిస్తుంది. 2025లో మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు సవరించింది. ఇక స్థిరమైన డిపాజిట్ సౌకర్యం రేట్‌ను ఐదుశాతం వద్దనే ఉంచింది. అలాగే బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక నిధుల సర్దుబాటు ఎంఎస్‌ఎఫ్‌రేట్‌ను కూడా 5.5శాతంగానిర్ణయించింది. ఎంఎస్‌ఎఫ్‌రేట్, బ్యాంక్ రేట్ రెండింటినీ ఒకే స్థాయిలో కొనసాగించాలనినిర్ణయించింది.
పాలసీ సమీక్ష అనంతరం వివరాలను వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్ మాట్లాడుతూ జిడిపి వృద్ధి ఈ ఏడాది 6.9శాతంగా ఉంటుందని అంచనావేసారు. ఇక హర్మూజ్ మూసివేయడంతో ఎగుమతులు,దిగుమతులకు కూడా భరీ విఘాతం కలిగింది. బీమా వ్యయాలుపెరిగాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా గ్లోబల్ డిమాండ్‌కూడా తగ్గిందని ఆర్బీఐ గవర్నర్ తెలిపారు. వాణిజ్య ఎగుమతులు ఇటీవలి వాణిజ్య ఒప్పందాలతో కొంతమేర ప్రయోజనకారి అవుతున్నదని అన్నారు. ఈ ఏడాదిచేసుకున్న స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలన్నీ కూడా ఈ ఏడాది అమలుకు వస్తాయని ఆయన అన్నారు. ఇక సేవలరంగ ఎగుమతులు కూడా సానుకూలంగానే ఉన్నట్లు సంజయ్‌మల్హోత్రా చెప్పారు. ఈ ఏడాది తొలిత్రైమాసికంలో 6.8, రెండో త్రైమాసికంలో 6.7, మూడవ త్రైమాసికంలో 7శాతం, నాలుగోత్రైమాసికంలో 7.2శాతంగా ఆర్థికవృద్ధి ఉంటుందని ఆర్బీఐ అంచనావేసింది. ఇక రిటైల్ ద్రవ్యోల్బణం 2027 ఆర్థికసంవత్సరంలో 4.6శాతంగానే ఉంటుందని వెల్లడించారు. ఇంధన ధరలు పెరగడం, నిర్వహణ వ్యయం పెరగడం వంటివి ద్రవ్యోల్బణం పెరుగుదల భయాలను పెంచిందని సంజయ్ అన్నారు.
యుద్ధభయాలు కొనసాగినా పెట్రోలు, డీజిల్ రిటైల్‌ధరలు ఎక్కడా పెరగకపోవడం కొంత మేలుచేసిందని, ఆహార ఉత్పత్తులధరలు కూడా కొంత సానుకూలంగానే ఉన్నాయని, రబీ ఉత్పత్తి పెరగడం వల్ల దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉంటాయని ఆయన చెప్పారు. ఇక ద్రవ్యోల్బణంపరంగా నాలుగు త్రైమాసికాల్లో వరుసగా నాలుగుశాం, 4.4, 5.2, 4.7శాతంగా ఉంటుందని ఆర్బీఐ ఎంపిసి సమావేశంలో అంచనావేసారు. ఇక తదుపరి ఎంపిసి సమీక్ష జూన్ మూడునుంచి ఐదోతేదీవరకూ ఉంటుందని ఆర్బీఐ ప్రకటించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14